ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

వ్యవసాయం

జూలై, 2026

సంపుటి - 12 | సంచిక-07 | పేజీలు- 52 | వెల : ₹ 20/-

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గత నెలలో జరిగిన వివిధ కార్యక్రమాల దృశ్యమాలిక

వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య రచించిన పుస్తకాలను విడుదల చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌ॥ ఎ. రేవంత్ రెడ్డి

హెచ్.ఎం.డి.ఎ సహకారంతో పునరుద్ధరించిన "కిద్వాయ్ కాటేజీ & రిసార్ట్" ను ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి గౌ॥ తుమ్మల నాగేశ్వరరావు

డా॥ వై.ఎస్.ఆర్ – డా॥ కే.వీ.పి ఫౌండేషన్ తరపున రూ. 21 లక్షల చెక్కును వర్సిటీ ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్యకు అందజేసిన మాజీ పార్లమెంటు సభ్యులు శ్రీ ఉండవల్లి అరుణ్ కుమార్

వ్యవసాయ వర్సిటీలో రైతు ఆదాయ భద్రతపై జరిగిన మేధో మధన సదస్సులో ప్రసంగిస్తున్న వర్సిటీ ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య

49వ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశాన్ని ప్రారంభిస్తున్న వర్సిటీ ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య

ఎస్సీ, ఎస్టీ అధికారుల సన్మాన కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఎస్సీ, ఎస్టీ సెల్ ఇంచార్జీ డా॥ రాజేశ్వర్ నాయక్‌కు భారత రాజ్యాంగ ప్రతిని అందిస్తున్న వర్సిటీ ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య

వ్యవసాయం

సంక్షిప్త వ్యవసాయ సమాచార మాస పత్రిక

జూలై, 2026

స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ పరాభవ నామ సం॥ర నిజ జ్యేష్ఠ పాడ్యమి నుండి ఆషాఢ బహుళ విదియ వరకు

సంపాదక వర్గం

ప్రధాన సంపాదకులు

డా॥ ఎమ్. శ్రీనివాసులు

ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి

సంపాదకులు

డా॥ ఆర్. సునిత దేవి

ప్రధాన శాస్త్రవేత్త, (కీటక శాస్త్రం)

సాంకేతిక పర్యవేక్షణ నిపుణులు

డా॥ వి. సునిత

సీనియర్ శాస్త్రవేత్త (కీటక శాస్త్రం)

డా॥ బి. పద్మజ

ప్రధాన శాస్త్రవేత్త (అగ్రానమి) & హెడ్

టెక్నికల్ ఆఫీసర్

డా॥ వి. సుధాకర్

పౌర సంబంధాలు & సమాచార ప్రసార అధికారి

వ్యవసాయ మాస పత్రిక సంవత్సర చందా రూ. 200/- మరియు జీవిత కాలపు (10 సంవత్సరాలు) చందా రూ. 1000/- నగదు రూపంలో లేదా డి.డి. రూపంలో చెల్లించవచ్చు.

డి. డి. అయితే

Principal Agricultural Information Officer,
Agricultural Information and Communication Center
PJTAU Press, Rajendranagar, Ranga Reddy
Pin Code : 500 030

పేరిట తీసి హైదరాబాద్‌లో చెల్లుబాటయ్యే విధంగా పంపించాలి

చిరునామా :

ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి

వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం

ఎ.ఆర్.ఐ క్యాంపస్, రాజేంద్రనగర్, హైదరాబాద్ - 30.

తెలంగాణ, ఫోన్ నెం. 040-24015380

e-mail : paio.pjtau@gmail.com, pjtau.paio@gmail.com

vyavasayam.pjtau@gmail.com

పాఠక మహాశయులు మాసపత్రిక అభ్యున్నతికి తోడ్పడుటకుగాను తమ అమూల్యమైన సలహాలను సూచనలను అందచేయవలసిందిగా కోరుతున్నాము.

విషయ సూచిక

1. ఉపకులపతి సందేశం.. 5
2. ఈమాసంలో చేయవలసిన వ్యవసాయ పనులు................ 6
3. వాతావరణం-పంటల పరిస్థితి-విశ్లేషణ.................... 15
4. సాంకేతిక వ్యాసాలు
- వానాకాలం రాగి సాగు - యాజమాన్య పద్ధతులు.......... 16
- వానాకాలం కంది సాగుకు అనువైన రకాలు - మేలైన యాజమాన్య పద్ధతులు..19
- చెఱకులో వేరు పురుగు - సమగ్ర యాజమాన్యం........... 22
- వానాకాలానికి అనువైన పశుగ్రాస పంటల యాజమాన్యం.. 24
- ఘనంగా జయశంకర్ వర్సిటీ 62వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు.. 26
- వ్యవసాయ పదవినోదం.......................................28
- నైరుతి ఋతుపవనాలపై ఎల్-నినో ప్రభావం - పత్తి పంట యాజమాన్యం...29
- విత్తనం విత్తే యంత్రాలు: రకాలు, ప్రయోజనాలు, వినియోగం...32
- టమాటలో పురుగుల నివారణ, పురుగుమందుల అవశేషాలు మరియు పంటకోత కాలాల ప్రాముఖ్యత....... 35
- జూలై మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు.. 38
- ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవం 2026 సందర్భంగా ప్రత్యేక కథనం! స్కిల్ కోర్సుల ద్వారా నైపుణ్య అభివృద్ధి మరియు మెరుగైన ఉపాధి అవకాశాలు............40
- గొర్రె మరియు మేక పిల్లల యాజమాన్యం.................. 44
5. టి.వి.ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు.. 46
6. రైతన్నకో ప్రశ్న...47
7. విశ్వవిద్యాలయ వార్తలు.................................... 48
8. రైతు విజయగాథ
- శాస్త్రీయ వ్యవసాయంతో అత్యధిక దిగుబడులు సాధించిన మహిళా రైతు - విజయగాథ................ 49

జూలై మాసం క్యాలెండర్ - 2026

స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ పరాభవ నామ సం॥ర నిజ జ్యేష్ఠ పాడ్యమి నుండి ఆషాఢ బహుళ విదియ వరకు

SUN ఆది రాహుకాలం సా. 4.30-6.00	MON సోమ రాహుకాలం ఉ.7.30-9.00	TUE మంగళ రాహుకాలం మ.3.00-4.30	WED బుధ రాహుకాలం మ.12.00-1.30	THU గురు రాహుకాలం మ.1.30-3.00	FRI శుక్ర రాహుకాలం ఉ.10.30-12.00	SAT శని రాహుకాలం ఉ.9.00-10.30
			1 నిజ జ్యేష్ఠ బహుళ పాడ్యమి ఉ.6-19 పూర్వాషాఢ ఉ.6-25 ప.వ.3-09 ల 4-54	**2** విదియ ఉ.7-54 ఉత్తరాషాఢ ఉ.8-37 ప.వ.12-55 ల 2-38	**3** తదియ ఉ.9-03 శ్రవణం ఉ.10-24 ప.వ.2-37 ల 4-19	**4** చవితి ఉ.9-45 ధనిష్ఠ ఉ.11-45 రా.వ.7-12 ల 8-51
5 పంచమి ఉ.9-56 శతభిషం ప.12-35 రా.వ.7-04 ల 8-41	**6** షష్ఠి ఉ.9-38 పూర్వాభాద్ర ప.12-55 రా.వ.10-28 ల 12-03	**7** సప్తమి ఉ.8-36 ఉత్తరాభాద్ర ప.12-46 రా.వ.12-31 ల 2-05	**8** అష్టమి ఉ.7-36 రేవతి ప.12-17 వర్జ్యము లేదు	**9** నవమి ఉ.5-55 దశమి తె.4-32 అశ్విని ఉ.11-22 ఉ.వ.7-31 ల 9-03 రా.వ.8-37 ల 10-09	**10** ఏకాదశి రా.1-55 భరణి ఉ.10-29 రా.వ.9-36 ల 11-05	**11** ద్వాదశి రా.11-26 కృత్తిక ఉ.8-43 రా.వ.11-38 ల 1-08
12 త్రయోదశి రా.9-00 రోహిణి ఉ.7-08 మృగశిర తె.5-28 ప.వ.12-20 ల 1-49	**13** చతుర్దశి సా.6-32 ఆర్ద్ర తె.3-49 ప.వ.1-17 ల 2-47	● **14** అమావాస్య సా.4-07 పునర్వసు రా.2-16 ప.వ.3-03 ల 4-33	**15** ఆషాఢ శు.పాడ్యమి ప.1-51 పుష్యమి రా.12-55 ఉ.వ.9-49 ల 11-19	**16** విదియ ప.11-48 ఆశ్రేష రా.11-49 ప.వ.1-08 ల 2-39	**17** తదియ ఉ.10-03 మఘ రా.11-03 ఉ.వ.11-26 ల 12-59	**18** చవితి ఉ.8-38 పుబ్బ రా.10-41 ఉ.వ.6-56 ల 8-30 తె.వ.5-53 ల
19 పంచమి ఉ.7-39 ఉత్తర రా.10-44 ఉ.శే.వ.7-29 వ	**20** షష్ఠి ఉ.7-07 హస్త రా.11-15 ఉ.వ.7-19 ల 8-57	**21** సప్తమి ఉ.7-06 చిత్ర రా.12-17 ఉ.వ.7-36 ల 9-16	**22** అష్టమి ఉ.7-38 స్వాతి రా.1-49 ఉ.వ.6-15 ల 7-57	**23** నవమి ఉ.8-38 విశాఖ తె.3-46 ఉ.వ.7-52 ల 9-36	**24** దశమి ఉ.10-15 అనూరాధ పూర్తి ఉ.వ.8-09 ల 9-54	**25** ఏకాదశి ప.11-52 అనూరాధ ఉ.6-02 ప.వ.12-14 ల 2-00
26 ద్వాదశి ప.1-49 జ్యేష్ఠ ఉ.8-35 సా.వ.5-28 ల 7-14	**27** త్రయోదశి ప.3-50 మూల ఉ.11-13 ఉ.వ.9-26 ల 11-13 రా.వ.9-48 ల 11-34	**28** చతుర్దశి సా.5-42 పూర్వాషాఢ ప.1-43 రా.వ.10-28 ల 12-13	○ **29** పూర్ణిమ రా.7-17 ఉత్తరాషాఢ సా.3-59 రా.వ.8-18 ల 10-01	**30** ఆషాఢ బ.పాడ్యమి రా.8-30 శ్రవణం సా.5-53 రా.వ.10-07 ల 11-49	**31** విదియ రా.9-14 ధనిష్ఠ రా.7-20 రా.వ.2-49 ల 4-29	

16 రథ యాత్ర

పునర్వసు కార్తె (06.07.26 నుండి 19.07.26)

వరి : వరినాట్లు వేసుకొనుట, ముందుగా నాటిన వరిలో అంతరకృషి, సస్యరక్షణ

సజ్జ : రసాయనిక ఎరువులు వేసి పైరు విత్తుట.

వేరుశనగ : అంతరకృషి, సస్యరక్షణ

ఆముదం : రసాయనిక ఎరువులు వేసి విత్తుట.

జొన్న : పునాస లేక ఖరీఫ్ జొన్న విత్తుట. విత్తిన పంటకు ఎరువులు వేయుట. సస్యరక్షణ

మొక్కజొన్న : అంతరకృషి, సస్యరక్షణ. నెలాఖరులో ఎరువులు వేయుట.

ప్రత్తి : వర్షాధారపు పంట విత్తడం. ముందుగా నాటిన ప్రత్తిలో అంతరకృషి. ఎరువులు వేయుట.

చెఱకు : సస్యరక్షణ, ఎరువులు వేయుట.

కొఱ్ర : ఎరువులు వేయుట, దుక్కి తయారుచేయుట.

వేరుశనగ : అంతరకృషి, సస్యరక్షణ.

ఆముదం : కలుపు తీయుట, సస్యరక్షణ.

పుష్యమి కార్తె (20.07.26 నుండి 2.08.26)

వరి : మధ్యకాలిక వరి నాట్లు వేయుట, సస్యరక్షణ, రసాయనిక ఎరువులు వేయుట.

జొన్న : అంతరకృషి, మొక్కలు పలుచన చేయుట, సస్యరక్షణ.

మొక్కజొన్న : అంతరకృషి, పైపాటుగా ఎరువులు వేయుట, సస్యరక్షణ.

కొఱ్ర : విత్తనం వేయుట.

ప్రొద్దుతిరుగుడు : విత్తుట

వాతావరణ సూచనలకు అనుగుణంగా పంటలు వేద్దాం... సుస్థిర ఆదాయాన్ని పొందుదాం...

అల్దాస్ జానయ్య
ఉపకులపతి

వ్యవసాయం ప్రకృతి ఆధారిత జీవన విధానం. వర్షపాతం, ఉష్ణోగ్రత, నేల తేమ, నీటి లభ్యత వంటి వాతావరణ అంశాలు పంటల ఉత్పాదకతతో పాటు రైతుల జీవనోపాధిని కూడా నిర్ణయిస్తాయి. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం 2026 నైరుతి ఋతుపవనాలు దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది. అదే సమయంలో అభివృద్ధి చెందుతున్న ఎల్–నినో పరిస్థితులు భారత ఋతుపవనాల తీవ్రత, వర్షాల పంపిణీపై ప్రభావం చూపే అవకాశముంది. ఎల్–నినో సంవత్సరాల్లో వర్షపాతం తగ్గడం, బెట్ట పరిస్థితులు పెరగడం, పంటలపై తేమ ఒత్తిడి ఏర్పడటం వంటి పరిస్థితులు గతంలో అనేకసార్లు నమోదయ్యాయి.

తెలంగాణలో వార్షిక వర్షపాతంలో దాదాపు 80 శాతం నైరుతి ఋతుపవనాల ద్వారానే లభిస్తుంది. రాష్ట్రంలోని వానాకాలం పంటలు ప్రధానంగా ఈ వర్షాలపైనే ఆధారపడి ఉంటాయి. కృష్ణా, గోదావరి నదుల ద్వారా లభించే నీరు కూడా కర్ణాటక, మహారాష్ట్రలో నమోదయ్యే వర్షపాతంపై ఆధారపడుతుంది. ఎల్–నినో ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో వర్షపాతం తగ్గితే జలాశయాలకు వచ్చే ప్రవాహాలు తగ్గి వానాకాలంతో పాటు యాసంగి సాగుపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో ప్రతి నీటి చుక్కను సమర్థవంతంగా వినియోగించడం అత్యంత కీలకం. గత దశాబ్దంలో తెలంగాణలో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. అయితే వరి పంట సాగుకు అధిక నీరు అవసరం. వాతావరణ అనిశ్చితి, జలవనరులపై పెరుగుతున్న ఒత్తిడి, భూగర్భ జలాల తగ్గుదల వంటి పరిస్థితుల్లో వరి సాగును కొనసాగించడం దీర్ఘకాలంలో సుస్థిరమైన వ్యవసాయ విధానం కాదు. ఈ నేపథ్యంలో 2026 వానాకాలంలో తెలంగాణలో పంటల వైవిధ్యీకరణ అత్యవసరంగా మారింది. ఇది కేవలం వరి విస్తీర్ణాన్ని తగ్గించడం మాత్రమే కాకుండా, స్థానిక వర్షపాతం, నేల స్వభావం, నీటి లభ్యత, మార్కెట్ అవకాశాలను దృష్టిలో ఉంచుకొని అనువైన పంటలను ఎంపిక చేసుకోవడం. ఈ విధానం నీటి సంరక్షణతో పాటు రైతుల ఆదాయాన్ని స్థిరీకరించే శాస్త్రీయ వ్యూహం.

తెలంగాణలో వరికి ప్రత్యామ్నాయంగా కంది, సోయాబీన్, పెసర, మినుము, నువ్వులు, ఆముదం, జొన్న, సజ్జ, రాగులు, కూరగాయలు మరియు ఇతర ఉద్యాన పంటలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సాగు చేయవచ్చు. పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు తక్కువ నీటితో సాగు చేయడంతో పాటు నేల సారాన్ని మెరుగుపరుస్తాయి. నూనెగింజల పంటలు దేశీయ ఉత్పత్తి పెంపునకు దోహదపడగా, కంది, సోయాబీన్ ఆధారిత అంతర పంట విధానాలు వాతావరణ ప్రతికూల ప్రమాదాన్ని తగ్గించి రైతులకు స్థిరమైన ఆదాయాన్ని అందిస్తాయి. పంటల వైవిధ్యీకరణ వల్ల నీటి వినియోగం, భూగర్భ జలాలపై ఒత్తిడి తగ్గడంతో పాటు పంటల వైఫల్య ప్రమాదం తగ్గి రైతుల ఆదాయం స్థిరపడుతుంది. నేల ఆరోగ్యం మెరుగుపడుతుంది, చీడపీడలు, వ్యాధుల ఉధృతి తగ్గుతుంది. అలాగే పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాల ఉత్పత్తి పెరిగి పోషక భద్రతకు కూడా తోడ్పడుతుంది. వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయాన్ని తీర్చిదిద్దడంలో పంటల వైవిధ్యీకరణ కీలక పాత్ర పోషిస్తుంది.

2026 వానాకాలంలో రైతులు వాతావరణ సూచనలను అనుసరిస్తూ, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను సాగు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వరికి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడం ద్వారా నీటి వనరులను సంరక్షించడంతో పాటు రైతుల ఆదాయాన్ని స్థిరపరచవచ్చు. "పంటల వైవిధ్యీకరణే సుస్థిర వ్యవసాయానికి పునాది" అనే భావనను ఆచరణలో పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది...

(అల్దాస్ జానయ్య)
ఉపకులపతి

వరి

- తెలంగాణ రాష్ట్రంలో జూలై మాసంలో కేవలం మధ్యకాలిక (135 రోజులు) లేదా స్వల్పకాలిక (120-125 రోజులు) రకాల నార్లను మాత్రమే వేసుకోవాలి. ముఖ్యంగా దీర్ఘకాలిక రకాలను (150 రోజులు) జూలై మాసం లేదా ఆ తరువాత నార్లు పోసుకోవటానికి అనుకూలం కాదు.
- తొలకరి వర్షాలకు పచ్చిరొట్ట పైర్లైన జనుము లేదా జీలుగు లేదా పెసర పెంచుకొని పూత సమయంలో నేలలో కలియదున్నాలి.
- మధ్యకాలిక రకాలను జూలై 15 లోపు నార్లు పోసుకోవాలి. 120 - 125 రోజులు గల స్వల్పగింజ రకాలైన తెలంగాణ సోన (ఆర్.ఎన్.ఆర్. -15048), కూనారం రైస్-2 (కెఎన్ఎమ్-1638), డబ్ల్యుజిఎల్- 962 లేదా దొడ్డుగింజ రకాలైన జెజిఎల్- 24423, కూనారం సన్నాలు (కెఎన్ఎమ్-118), యంటియు- 1010, ఆర్ఎన్ఆర్- 29325 మరియు ఐఆర్ -64 లను జూలై చివరి వరకు నార్లు పోసుకొని 25-30 రోజులలోపు ప్రధాన పొలంలో నాటుకోవాలి.
- బెరుకులు లేని విత్తనం ఉన్నచో, రైతులు తమ విత్తనము తామే వాడుకోవచ్చు.
- వరిని నేరుగా విత్తే పద్ధతిలో సాగు చేయాలనుకుంటే మధ్యకాలిక రకాలను జూలై 15 వరకు, స్వల్పకాలిక రకాలను జూలై చివరి వరకు విత్తుకోవచ్చు. విత్తనశుద్ధి చేసిన విత్తనాన్ని చదును చేసిన పొలంలో నాగటిసాలు వెనుక లేదా గొర్రుతో లేదా ట్రాక్టర్ నడిచే ఫర్టికమ్ సీడ్‌డ్రిల్‌తో సాళ్ళలో విత్తుకోవాలి. సన్నగింజ రకాలైతే సాళ్ళలో విత్తడానికి ఒక ఎకరాకు 8 కిలోలు, వెదజల్లే పద్ధతిలో 10 కిలోలు వేయాలి. అదే దొడ్డు గింజ రకాలైతే 10 కిలోలు సాళ్ళలో విత్తడానికి, 12 కిలోలు వెదజల్లే పద్ధతిలో విత్తుకోవాలి.
- వరిని నేరుగా విత్తే పద్ధతిలో (దమ్ము చేసిన పొలం లేదా పొడిదుక్కి) విత్తుకోవడం వలన సాగు ఖర్చును కాల వ్యవధిని తగ్గించుకోవడంతో (సుమారు 7 రోజులు) పాటుగా కూలీల కొరతను అధిగమించవచ్చును.
- పొడిదుక్కిలో నేరుగా విత్తుకున్నప్పటికీ వర్షాలు సమృద్ధిగా పడి నీటి సౌకర్యం ఉన్నచో, మరల మామూలు పద్ధతిలోలాగా నీరు పెట్టుకోవచ్చు.
- విత్తనం ద్వారా సంక్రమించే తెగుళ్ళ నివారణకు నారుపోసే ముందు తప్పనిసరిగా తడి విత్తనశుద్ధికి కార్బండాజిమ్ 1 గ్రా. లేదా పొడి విత్తనశుద్ధికి 3 గ్రా. కిలో విత్తనానికి, నాటడానికి వారం రోజుల ముందు ప్రతి 2 గుంటల నారుమడికి 800 గ్రా. కార్బోఫ్యూరాన్ 3సిజి గుళికలను వేసుకోవాలి.
- నారుమడి తయారీకి 2 వారాల ముందు 200 చ.మీ. నారుమడికి 2 క్వింటాళ్ళు బాగా మాగిన పశువుల ఎరువును వేసి పొలాన్ని 2-3 సార్లు కలియదున్నాలి. ఒక ఎకరాకు సరిపడా నారుమడికి 2.2 కిలోల యూరియా, 1.6 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 6.25 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ఎరువులను వేయాలి. నారు ఎదుగుదలను బట్టి 15-20 రోజుల దశలో 2.2 కిలోల యూరియా వేయాలి.
- నారుమడిలో కలుపు యాజమాన్యానికి విత్తిన 15-20 రోజులకు సైహలోఫాప్-పి-బ్యూటైల్ 1.5 మి.లీ. లేదా బిస్‌పైరిబ్యాక్ సోడియం 0.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- ప్రధాన పొలాన్ని 10-15 రోజులు బాగా మురగనిచ్చి దమ్ము చేయాలి. ఆఖరి దుక్కిలో ఎకరానికి 16 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 8 కిలోల పొటాష్‌నిచ్చు ఎరువులు అనగా 50 కిలోల డి.ఎ.పి, 33 కిలోల యూరియా, 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి.

డా॥ వై. చంద్రమోహన్, ప్రధాన శాస్త్రవేత్త (వరి) & హెడ్, వరి పరిశోధన సంస్థ, రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్ నెం. 8333818218

మొక్కజొన్న

- సారవంతమైన నేలల్లో, నీరు ఇంకే నల్లరేగడి, ఎర్ర నేలలు లేదా ఒండ్రు కలిగిన ఇసుక నేలలు ఉదజని సూచిక 6.5 నుండి 7.5 ఉన్న నేలలు మొక్కజొన్న సాగుకు అనుకూలమైనవి. చౌడు, నీరు ఇంకని భూములు మొక్కజొన్న సాగుకు పనికిరావు. పొలంలో మురుగు నీరుపోయే వసతి ఉండాలి.
- వర్షాధారం క్రింద, దీర్ఘకాలిక, మధ్యకాలిక రకాలు ఉపయోగించి జూలై 15 వరకు స్వల్పకాలిక రకాలను జూలై ఆఖరి వరకు విత్తుకోవచ్చు.
- వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసిన మధ్యకాలిక ఏక సంకర రకాలైన డి.హెచ్.యం. 117, డి.హెచ్.యం.121, డి.హెచ్.యం.182, డి.హెచ్.యం.206, డి.హెచ్.యం. 211, కరీంనగర్ మక్క, కరీంనగర్ మక్క-1 లేదా సిఫారసు చేసిన ప్రైవేట్ హైబ్రిడ్లు విత్తుకోవాలి.
- ఎకరాకు 8 కిలోల విత్తనం వాడాలి. కత్తెర పురుగు నివారణకు ఒక కిలో విత్తనానికి 6.0 మి.లీ సయాంట్రానిలిప్రోల్ + థయోమిథాక్సామ్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలి. మొక్కజొన్నలో ఎకరాకు 33,333 మొక్కల సాంద్రత ఉండేలా చూసుకోవాలి. ఇందుకు వరుసల మధ్య 60 సెం.మీ. ఎడం ఉండేటట్లు బోదెలు చేసుకొని మొక్కల మధ్య 20 సెం.మీ. ఉండేటట్లు విత్తనాన్ని బోదెకు ఒకవైపున పై నుండి 1/3 వ వంతు ఎత్తులో విత్తుకుంటే నీటిపారుదలకు సులభంగా ఉండటమేకాక, వర్షపాతం ఎక్కువైనప్పుడు నీరు బయటకు పోవడానికి వీలుంటుంది.
- ఎకరాకు 3-5 టన్నుల బాగా మాగిన పశువుల ఎరువు లేక కంపోస్టును ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలి. భూసార ఫలితాలను బట్టి ఎరువులను తగిన మోతాదులో వాడాలి. వర్షాధార మొక్కజొన్నకు నేల స్వభావాన్ని బట్టి ఎకరాకు 72-80 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను వేసుకోవాలి. 1/3వ వంతు నత్రజని, మొత్తం భాస్వరం, సగం పొటాష్ ను విత్తే సమయంలోనే వేసుకోవాలి. ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేటును మూడు పంటలకొక సారి దుక్కిలో వేసుకోవాలి. దుక్కిలో భాస్వరం మరియు జింక్ సల్ఫేట్ ఎరువులను ఒకేసారి వేయకూడదు.
- ఎండుతెగులు ఆశించు భూములలో మొక్కజొన్న విత్తునపుడు, ట్రైకోడర్మా విరిడి అనే జీవ శిలీంద్రనాశిని మందును కిలో విత్తనానికి 10 గ్రాముల చొప్పున కలిపి విత్తనశుద్ధి చేయాలి. 2 కిలోల ట్రైకోడర్మా విరిడి మందును 100 కిలోల బాగా మాగిన పశువుల ఎరువుతో కలిపి అభివృద్ధి పరిచి దుక్కిలో వేయాలి.
- అట్రాజిన్ అనే కలుపు నివారణ మందును తేలిక నేలల్లో ఎకరాకు 800 గ్రా., బరువు నేలల్లో 1200 గ్రా., 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 2 రోజులలోపు నేలపై తగినంత తేమ ఉన్నప్పుడు పిచికారి చేయడం వలన వెడల్పాటి ఆకులుగల కలుపు మొక్కలను దాదాపు ఒక నెల వరకు అదుపు చేసుకోవచ్చు లేదా పైరాక్సాసల్ఫోన్ అనే కలుపు మందును ఎకరాకు 60 గ్రాముల చొప్పున పిచికారి చేయాలి. ఒకవేళ పప్పుజాతి పంటలను మొక్కజొన్నతో అంతర పంటలుగా విత్తుకుంటే పెండిమిథాలిన్ అనే కలుపుమందును ఎకరాకు 1.0 లీ. ను 200 లీ. నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.
- పైరు 20-25 రోజుల దశలో కలుపు సమస్య ఎక్కువగా ఉంటే టెంబోట్రయోన్ 34.4 % ఎస్.సి. 115 మి.లీ + 400 గ్రా. అట్రాజిన్ లేదా టోప్రమిజోన్ 36 మి.లీ మరియు 400 గ్రా. అట్రాజిన్ లేదా 1400 మి.లీ మిసోట్రియన్ + అట్రాజిన్ ను 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరాకు సరిపోయేలా పిచికారీ చేయాలి. విత్తిన 30 నుండి 35 రోజుల దశలో వరుసల మధ్య కల్టివేటర్‌తో అంతరకృషి చేసి కలుపు మొక్కలను పూర్తిగా నివారించవచ్చు.

నెల రోజులలోపు పంట అధిక తేమను తట్టుకోలేదు కావున విత్తిన తరువాత పొలంలో నీరు నిలవ కుండ జాగ్రత్తలు తీసుకోవాలి.

మొక్కజొన్నను ఆశించే పురుగులలో కత్తెర పురుగు, కాండం తొలుచు పురుగు ముఖ్యమైనవి. నివారణ కొరకు పైరు మొలచిన 10-12 రోజులకు క్లోరాంట్రానిలిప్రోల్ 20 ఎస్‌సి 0.4 మి.లీ. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. అవసరాన్ని బట్టి 25-30 రోజులలో కార్బోఫ్యూరాన్ 3సిజి గుళికలను ఎకరాకు 3-4 కిలోలు ఆకుసుడులలో వేయాలి. నెల రోజుల పంట దశలో అంతర కృషి జరిపి 1/3 వ వంతు నత్రజనిని పైపాటుగా నేల పదునులో వేయాలి.

చిరుధాన్యాలు

జొన్న:

- సారవంతమైన, నీరు ఇంకే నల్లరేగడి, ఎర్ర నేలలు, ఇసుక మిశ్రమ నేలలు జొన్న సాగుకు అనుకూలమైనవి. నీరు నిల్వ ఉండే భూములు అనుకూలం కావు.
- వర్షాధార పరిస్థితుల్లో జొన్న పంటను జూన్ రెండవ వారం నుండి జూలై రెండవ వారం వరకు విత్తుకోవచ్చు. విత్తడం ఆలస్యమవుతున్న కొద్ది మొవ్వ చంపు ఈగ ఆశించే అవకాశం పెరుగుతుంది. అందువల్ల ఆలస్యంగా విత్తే సమయంలో సాధారణంగా ఎకరాకు 3 కిలోల విత్తనం వాడే బదులు 4-5 కిలోల విత్తనం ఉపయోగించాలి.
- తెలంగాణ జొన్న-1 (సిఎస్‌వి-41), పాలమూరు జొన్న (సిఎస్‌వి-31), పాలెం జొన్న-1 (పిఎస్‌వి 512) పాలెం పచ్చజొన్న - 1 (పివైపిఎస్-2) రకాలు తెలంగాణలో వర్షాధార సాగుకు అనుకూలమైనవి.
- మొవ్వ చంపు ఈగ నివారణకు విత్తే ముందు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలి. కిలో విత్తనానికి ఇమిడాక్లోప్రిడ్ 7.5 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 5 గ్రా. పట్టించి విత్తుకున్నట్లయితే పంటను తొలి 30 రోజుల వరకు పురుగు బెడద నుండి రక్షించవచ్చు.
- విత్తేటప్పుడు వరుసల మధ్య 45 సెం.మీ. దూరం ఉండేలా విత్తుకోవాలి. మొక్కలు ఒత్తుగా ఉన్నచో విత్తిన 15 రోజులలోపు పలుచన చేసి సరైన మొక్కల సాంద్రతను పాటించాలి.
- ఎకరాకు 2-4 టన్నుల బాగా మాగిన పశువుల ఎరువు లేదా కంపోస్టును చివరి దుక్కిలో వేయాలి. వర్షాధార జొన్నకు ఎకరాకు 32 కిలోల నత్రజని, 16 కిలోల భాస్వరం, 16 కిలోల పొటాష్ ఇవ్వాలి. సగం నత్రజని, మొత్తం భాస్వరం, పొటాష్‌ను విత్తే సమయంలో, మిగిలిన సగం నత్రజనిని 30-35 రోజుల దశలో పైపాటుగా వేయాలి.
- కలుపు నివారణకు విత్తిన వెంటనే లేదా 48 గంటలలోపు అట్రాజిన్ 50 డబ్ల్యుపి 600-800 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి తడినేలపై సమంగా పిచికారి చేయాలి. విత్తిన 15 రోజుల తర్వాత దంతితో అంతరకృషి నిర్వహించడం ద్వారా కలుపు మొక్కలను సమర్థవంతంగా నియంత్రించడంతోపాటు నేలలో గాలి ప్రసరణ మెరుగుపడి మొక్కల ఎదుగుదల బాగుంటుంది.
- మొవ్వ చంపు ఈగ ఉధృతి ఎక్కువగా ఉంటే 12-15 రోజుల దశలో ఇమిడాక్లోప్రిడ్ 17.8 ఎస్ఎల్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. కాండం తొలుచు పురుగు నివారణకు క్లోరాంట్రానిలిప్రోల్ 18.5 ఎస్‌సి 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

సజ్జ:

- వానాకాలంలో సజ్జ పంటను జూన్ రెండవ వారం నుండి జూలై చివరి వారం వరకు విత్తుకోవచ్చు. ధనశక్తి, పిబిహెచ్-1625, ఐసిఎమ్‌వి-221, హెచ్‌హెచ్‌బి-67 ఇంప్రూవ్డ్, కావేరి సూపర్ బాస్ వంటి రకాలు అనుకూలమైనవి.

- ఎకరాకు 1.6-2.0 కిలోల విత్తనం వాడి, వరుసల మధ్య 45 సెం.మీ., మొక్కల మధ్య 15 సెం.మీ. దూరం ఉండేలా విత్తుకోవాలి. విత్తిన రెండు వారాల తర్వాత పలుచన చేయాలి.
- ఎకరాకు 2-4 టన్నుల పశువుల ఎరువుతో పాటు, 12 కిలోల నత్రజని, 12 కిలోల భాస్వరం మరియు 8 కిలోల పొటాష్‌ను తర్వాత 12 కిలోల నత్రజనిని 30 రోజుల దశలో పైపాటుగా వేయాలి.
- కలుపు నివారణకు విత్తిన 48 గంటలలోపు అట్రజిన్ 50 డబ్ల్యుపి 700-800 గ్రా. ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. అవసరమైతే 15-20 రోజుల తర్వాత అంతరకృషి చేయాలి.

రాగి:

- వానాకాలంలో రాగి పంటను జూన్ నుండి ఆగష్టు వరకు విత్తుకోవచ్చు. తెలంగాణ పరిస్థితులకు అనుకూలమైన పాలెం రాగి-38 (పిఆర్ఎస్-38), మారుతి, హిమ, గోదావరి, వకుళ, చైతన్య రకాలను సాగు చేయవచ్చు.
- ఎకరాకు 2.0-2.5 కిలోల విత్తనంతో నారు పోసి, 21-25 రోజుల వయస్సు గల నారును ప్రధాన పొలంలో నాటుకోవాలి. వెదజల్లే పద్ధతిలో సాగు చేసినప్పుడు ఎకరాకు 4 కిలోల విత్తనం ఉపయోగించాలి.
- అగ్గి తెగులు నివారణకు కిలో విత్తనానికి ట్రైసైక్లాజోల్ 75 డబ్ల్యుపి 2 గ్రా. చొప్పున విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి.
- ఎకరాకు 12 కిలోల నత్రజని, 12 కిలోల భాస్వరం మరియు 8 కిలోల పొటాష్‌ను అడుగు ఎరువుగా వేయాలి. మరల 12 కిలోల నత్రజనిని పంట 30 రోజుల దశలో పైపాటుగా వేయాలి.
- కలుపు నివారణకు నాటిన వెంటనే పెండిమిథాలిన్ 30 ఇసి 600 మి.లీ., ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. అవసరమైతే 20-25 రోజుల తర్వాత అంతరకృషి చేయాలి.

కొర్ర:

- కొర్ర పంటను వానాకాలంలో జూలై నెల వరకు విత్తుకోవచ్చు.
- ఎకరాకు 2 కిలోల విత్తనం సరిపోతుంది. విత్తిన రెండు వారాలలోపు ఒత్తుగా ఉన్న మొక్కలను తొలగించి సరైన మొక్కల సాంద్రతను పాటించాలి.
- విత్తిన 20-30 రోజులలోపు గొర్రు లేదా దంతితో అంతరకృషి చేసి కలుపు మొక్కలను నివారించాలి.
- కలుపు నివారణకు విత్తే ముందు లేదా విత్తిన వెంటనే పెండిమిథాలిన్ 30 ఇసి 600 మి.లీ. ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- ఎకరాకు 8 కిలోల నత్రజని మరియు 8 కిలోల భాస్వరాన్ని ఆఖరి దుక్కిలో వేయాలి. విత్తిన 3-4 వారాల తర్వాత మరో 8 కిలోల నత్రజనిని పైపాటుగా వేయాలి.

డా॥ డి. భద్రు, ప్రధాన శాస్త్రవేత్త (మొక్కజొన్న మరియు చిరుధాన్యాలు)
మొక్కజొన్న పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్ నెం. 83338 18245

వేరుశనగ

వేరుశనగ:

- వానాకాలంలో వేరుశనగ పంటను జూలై రెండవ పక్షం వరకు విత్తుకోవచ్చు. భూసార పరీక్షలను అనుసరించి ఎరువుల మోతాదుని నిర్ణయించుకోవాలి.
- ఆఖరి దుక్కిలో ఎకరాకి మూడు నుండి నాలుగు టన్నుల పశువుల ఎరువులను వేసుకోవాలి. మొత్తం భాస్వరం, పొటాష్ ఎరువులను విత్తే సమయంలోనే వేసుకోవాలి.
- ఎకరానికి 100 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 33 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ మరియు 18 కిలోల యూరియాను విత్తే సమయంలో వేసుకోవాలి.

- నేలలో తగినంత తేమ ఉన్నప్పుడు 30×10 సెం.మీ. దూరంలో విత్తనాలను విత్తుకోవాలి. విత్తనాన్ని 5 సెం.మీ. మించి లోతుకు వేయకూడదు.
- విత్తిన తర్వాత కలుపు మొలకెత్తకముందే డైక్లోసూలం 84% డబ్ల్యుజిను 12 గ్రా. ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన వెంటనే గాని 48 గంటలలోపు తేమ గల నేలపై బాగా తడిచేటట్టుగా పిచికారి చేసుకోవాలి. విత్తిన 20 రోజుల వరకు ఎటువంటి నీటి తడిని ఇవ్వకూడదు.

ఆముదం

- వర్షాధారంగా ఆముదంను జూలై రెండవ పక్షం వరకు విత్తుకోవాలి. కిలో విత్తనానికి 3 గ్రా. కార్బండాజిమ్ లేదా 10 గ్రా. ట్రైకోడెర్మా హర్జియానంతో విత్తనశుద్ధి చేసుకోవాలి.
- ఆఖరి దుక్కిలో ఎకరానికి 15 కిలోల యూరియా, 100 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను వేసుకోవాలి. ఆముదం + కంది (1:1) నిష్పత్తిలో వేసుకున్నప్పుడు సాళ్ళ మధ్య 120 సెం.మీ. దూరం ఉండే విధంగా విత్తుకోవాలి.

నువ్వులు

- వానాకాలం ముందు మే మాసంలో విత్తిన పంట 45 నుండి 60 రోజుల దశలో ఉంది. తేమ ఎక్కువగా ఉన్నట్లైతే శాఖీయ పెరుగుదల ఎక్కువగా ఉండి గింజ దిగుబడి సరిగ్గా రాదు.
- కాయ తొలుచు పురుగు ఆశించినట్లైతే క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. వానాకాలంలో వేసుకునే నువ్వుల పంటకు ఆఖరి దుక్కిలో ఎకరాకి నాలుగు టన్నుల పశువుల ఎరువు, 16 కిలోల నత్రజని, 8 కిలోల పొటాష్, 8 కిలోల భాస్వరాన్నిచ్చే ఎరువులు వేసుకోవాలి.

ప్రొద్దుతిరుగుడు

- వర్షాధారంగా ప్రొద్దుతిరుగుడు పంటను జూలై రెండవ పక్షం వరకు విత్తుకోవాలి. వర్షాధారపు పంటకు 24 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం మరియు 12 కిలోల పొటాషియం ఎరువులను వేసుకోవాలి.
- బోదెలు చేసి విత్తనం నాటినట్లైతే పంటకు వివిధ దశల్లో నీటి తడి ఇవ్వడానికి అనుకూలంగా ఉంటుంది.
- వేరుశనగ + ప్రొద్దుతిరుగుడు 4:2, కంది + ప్రొద్దుతిరుగుడు 1:2 నిష్పత్తిలో వానాకాలంలో సాగుచేయవచ్చు.

డా॥ డి. శశిభూషణ్, ప్రధాన శాస్త్రవేత్త (నూనె గింజలు), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, ఫోన్ నెం. 8186945838

సోయాచిక్కుడు

సోయాచిక్కుడును జూలై మొదటి వారము వరకు విత్తుకోవచ్చు. నల్లరేగడి భూముల్లో 45 × 5 సెం.మీ., తేలిక భూముల్లో 30 × 7.5 సెం.మీ. చ.మీ.కు 33-44 మొక్కల చొప్పున ఎకరాకు సరాసరిగా లక్ష ముప్పై రెండు వేల నుండి లక్ష డెబ్బై ఆరు వేల మొక్కలు ఉండేటట్లు చూసుకోవాలి. విత్తేటప్పుడు భూమిలో తేమ శాతం చూసుకోవాలి. 60-70 మిల్లీ మీటర్ల వర్షపాతం పడ్డ తర్వాత లేదా వరుసగా రెండు రోజులు భారీ వర్షాలు కురిసిన తర్వాతనే విత్తుకోవాలి. అదే విధంగా 3-4 సెంటి మీటర్ల లోతులో విత్తుకోవాలి. విత్తన మోతాదు గింజ పరిమాణం, మొలక శాతం మరియు విత్తే దూరం మీద ఆధార పడుతుంది. మొలక శాతం 70 % కంటే తక్కువగా ఉంటే విత్తన మోతాదు పెంచుకోవాలి. ఎకరానికి 25-30 కిలోల విత్తనం వేసుకోవాలి. విత్తిన 48 గంటలలోపు పెండిమిథాలిన్ 30 ఇసి ఎకరాకు లీటరు చొప్పున పిచికారి చేయాలి.

- పంట మొదటి దశ 45 రోజుల వరకు కలుపు సమస్య లేకుండా జాగ్రత్త పడాలి.

- పెండిమిథాలిన్ (30% ఇ.సి.) 1.4 లీ./ఎకరం లేదా పెండిమిథాలిన్ (38.7% ఇ.సి.) 700 మి.లీ./ఎకరం లేదా డైక్లోసులం (84% డబ్ల్యు.డి.జి.) 12.4 గ్రా./ఎకరం చొప్పున విత్తిన 48 గం.ల లోపు పిచికారీ చేయాలి.
- కలుపు మందుల పిచికారీ సమయంలో నేలలో తగినంత తేమ తప్పనిసరిగా ఉండాలి.
- విత్తిన 20-25 రోజులకు గొర్రుతో అంతరకృషి చేయాలి.
- ఇమజిథాపైర్ (10% ఇ.సి.) ను 300 మి.లీ./ఎకరం లేదా ఎసిఫోర్ఫేన్ 16.5% ం సోడియం క్లోడినాఫాప్ ప్రొపార్గిల్ 8% ఇ.సి. 400 మి. లీ./ఎకరం లేదా ఇమజిథాపైర్ లేదా ఇమజమోక్స్ 40 గ్రా./ఎకరం లేదా ప్రోపాక్విజాఫాప్ లేదా ఇమజిథాపైర్ 800 మి.లీ./ఎకరం పిచికారి చేసి వెడల్పాకు మరియు గడ్డి జాతి కలుపును నిర్మూలించుకోవచ్చు.
- గడ్డి ముదిరిన (40 రోజుల తర్వాత) పక్షంలో పై కలుపు మందుల వినియోగము లాభదాయకంగా ఉండదు.

సిఫారసు చేసిన నత్రజని ఎరువులలో 50% నత్రజనిని (25-30 కిలోల యూరియా) ను పై పాటుగా 30-35 రోజుల సమయంలో వేసి మట్టితో కప్పాలి.

- నీటి పారుదల కింద పండించినట్లైతే, బెట్ట పరిస్థితులు ఎదురైనప్పుడు 15 రోజులకొకసారి 2-3 నీటి తడులను ఇవ్వాలి.
- సోయా పంటలో లేత మొక్కల దశ నుండి గింజ నిండే దశ వరకు కాండం తొలిచే ఈగ, కాండం తొలుచు పురుగు (లేదా) పెంకు పురుగు మరియు తెల్లదోమ ఉధృతి ఎక్కువగా ఉంటుంది.
- బెట్ట వాతావరణ పరిస్థితులు ఏర్పడినప్పుడు మరియు ఆలస్యంగా విత్తినప్పుడు ఈ పురుగుల యొక్క ఉధృతి అధికంగా ఉంటుంది.
- కాండం తొలిచే ఈగ మరియు కాండం తొలుచు పురుగు నివారణకు, 25-30 రోజుల పంట దశలో 1.25 మి.లీ. బీటా-సైఫ్లుత్రిన్ + ఇమిడాక్లోప్రిడ్ లేదా 0.4 మి.లీ. థయామిథాక్సామ్ 12-60% + లామ్డాసైహాలోత్రిన్ 9.50% జడ్.సి లేదా 0.3 మి.లీ క్లోరాంట్రానిలిప్రోల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయవలెను. పైన తెలిపిన మందులతో పాటు 2.5 గ్రా. మాంకోజెబ్ 63% + కార్బాండజిమ్ 12% డబ్ల్యు.పి. + 10 గ్రా. 19:19:19. లేదా 13:0:45 కలిపి పిచికారి చేస్తే పంటను ఆశించే తెగుళ్ళతో (వేరుకుళ్ళు, ఎండు తెగులు) పాటు బెట్ట నుండి కూడా పంటను కాపాడవచ్చు. తెల్లదోమ నివారణకు 0.3 గ్రా. ఎసిటామిప్రిడ్ 20% ఎస్‌పి లీటరు నీటికి కలిపి పిచికారి చేయవలెను. పసుపు రంగు జిగురు అట్టలను ఎకరానికి 10 చొప్పున అమర్చినట్లయితే తెల్లదోమ ఉధృతిని అదుపు చేయవచ్చు. ఉధృతి ఎక్కువగా ఉన్నట్లయితే, 1 మి.లీ. డైఫెన్‌థయూరాన్ 50% డబ్ల్యు.పి లీటరు నీటికి కలిపి పిచికారి చేయవలెను.
- తెల్లదోమ ఉధృతి అధికంగా ఉంటే సింథటిక్ పైరిథ్రాయిడ్స్ మందులను పిచికారీ చేయకూడదు.

డా॥ ఎం. రాజేందర్ రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త (సోయాచిక్కుడు), వ్యవసాయ పరిశోధన స్థానం, ఆదిలాబాద్, ఫోన్ నెం. 97041 34304

అపరాలు

మినుము, పెసర

అనువైన రకాలు :

మినుము : ఎం.బి.జి - 207, ఎం.బి.జి - 1070, డబ్ల్యు.బి.జి - 26, పి.యు - 31, యల్.బి.జి - 752, యల్.బి.జి - 787, టి.బి.జి - 104, జి.బి.జి - 11

పెసర : ఎం.జి.జి - 295, ఎం.జి.జి - 385, ఎం.జి.జి - 348, ఎం.జి.జి - 347, డబ్ల్యు.జి.జి - 42, డబ్ల్యు.జి.జి - 37, టి.ఎం. - 96 - 2, ఐ.పి.ఎం. - 2-14

నేల తయారీ: మురుగు నీరు పోవు వసతి గల, తేమను నిలుపుకోగల భూములు అనువైనవి. చౌడు భూములు పనికిరావు. వేసవి దుక్కి చేసి తొలికరి వర్షాలు పడగానే గొర్రుతో నేలను మెత్తగా తయారు చేసుకోవాలి. ఆఖరి దుక్కిలో 20 కిలోల నత్రజని, 50 కిలోల భాస్వరం ఎరువులను హెక్టారుకు వేసి కలియదున్నాలి.

విత్తన శుద్ధి: ఒక కిలో విత్తనానికి 3 గ్రా. థైరామ్ లేదా కాప్టాన్ లేదా మ్యాంకోజెబ్ మందుతో విత్తనశుద్ధి చేసిన తరువాత 5 గ్రా. థయోమిథాక్సామ్ లేదా 5 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ మందుతో విత్తనశుద్ధి చేసి విత్తితే తొలిదశలో ఆశించే రసం పీల్చే పురుగులు, తెగుళ్ళ బారి నుండి కాపాడుకోవచ్చు. చివరగా విత్తేముందు 200 గ్రా. రైజోబియం కల్చర్‌ను 10 కిలోల విత్తనానికి పట్టించి విత్తుకోవాలి.

విత్తు సమయం: జూన్ 1 నుండి జూలై 15 వరకు.

విత్తన మోతాదు:

పెసర : 15 – 16 కిలోలు / హెక్టారు.

మినుము : 18 – 20 కిలోలు / హెక్టారు.

అంతరకృషి: పెసర / మినుము పైరును 30 రోజుల వరకు కలుపు బారి నుండి రక్షించుకోవాలి. 20 – 30 రోజుల దశలో గొర్రు / దంతి ద్వారా అంతరకృషి చేస్తే కలుపు నివారణతో పాటు తేమను కూడా నిలుపుకోవచ్చు. కలుపు అధికంగా ఉండే భూముల్లో అయితే విత్తిన వెంటనే (24 గంటలలోపు) ఎకరాకు 1.0 – 1.4 లీటర్ల పెండిమిథాలిన్ 30% ని 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి.

సస్యరక్షణ: మినుము, పెసర పంటల్లో తొలిదశలో చిత్త పురుగులు, తామర పురుగులు, తెల్లదోమ, పేనుబంక, కాండపు ఈగ ఎక్కువగా ఆశించడం జరుగుతుంది. కాండపు ఈగ నివారణకు, ఎసిఫేట్ 1.0 గ్రా లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తామర పురుగు నివారణకు, ఎసిఫేట్ 1.0 గ్రా. లేదా ఫిప్రోనిల్ 1.5 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తెల్లదోమ నివారణకు, లీటరు నీటికి ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. కలిపి పిచికారీ చేయాలి.

పేనుబంక నివారణకు, డైమిథోయేట్ 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కంది :

అనువైన రకాలు: ఎం.ఆర్.జి – 1004, ఐ.సి.పి.ఎల్ – 87119, పి.ఆర్.జి – 176, పి.ఆర్.జి – 158, ఐ.సి.పి – 8863, డబ్ల్యు.ఆర్.జి – 121, డబ్ల్యు.ఆర్.జి – 65, టి.డి.ఆర్.జి – 4, డబ్ల్యు.ఆర్.జి.ఇ – 97, డబ్ల్యు.ఆర్.జి – 93, టి.డి.ఆర్.జి – 59.

వెర్రి తెగులు ఉధృతి ఉన్న ప్రాంతాలలో వెర్రి తెగులును తట్టుకునే రకాలైన ఎల్.ఆర్.జి – 105, టి.ఆర్.జి – 59, బి.ఎస్.ఎమ్.ఆర్ – 736, ఐ.సి.పి.ఎల్ – 87119 రకాలను సాగు చేసుకోవాలి. అదేవిధంగా గత పంట తాలుకు వెర్రి తెగులు సోకిన మొక్కలు, వాటి అవశేషాలను సమూలంగా నాశనం చేయటానికి వేసవి దుక్కులు చేయాలి.

నేలలు – నేల తయారీ: మురుగు నీరు పోవు వసతి గల భూములు అనువైనవి. వేసవిలో తొలికరి వర్షాలు పడగానే గొర్రుతో మెత్తగా దున్నాలి. ఆఖరి దుక్కిలో హెక్టారుకు 20 కిలోల నత్రజని, 50 కిలోల భాస్వరమునిచ్చు ఎరువులు వేసి కలియదున్నాలి. విత్తుటకు ముందు 10 కిలోల విత్తనానికి 200 గ్రా. రైజోబియం కల్చరు పట్టించి విత్తుకోవాలి. లేదా కిలో విత్తనానికి 10 మి.లీ. రైజోబియం పట్టించి విత్తుకోవాలి.

విత్తు సమయం: జూన్, జూలై మాసాలు అనువైనవి. ఆగష్టు వరకు కూడా విత్తుకోవచ్చు. ఆగష్టులో విత్తుకున్నట్లయితే మొక్కలు, సాళ్ళ మధ్య దూరం తగ్గించుకొని మొక్కల సాంద్రత పెంచుకోవాలి.

విత్తన మోతాదు మరియు విత్తు దూరం: తొలికరిలో 5 – 6 కిలోలు / హెక్టారుకు. నేల స్వభావాన్ని బట్టి 120 × 20 సెం.మీ. నుండి 240 × 20 సెం.మీ. వరకు విత్తుకోవచ్చు.

అంతరకృషి: కంది పైరును 40 – 50 రోజుల వరకు కలుపు బారి నుండి రక్షించుకోవాలి. మొదట రెండు నెలల వరకు తరచుగా గొర్రు / దంతి సహాయంతో అంతరకృషి చేసి కలుపు నివారించుకోవాలి. కలుపు బెడద ఎక్కువగా ఉన్నప్పుడు విత్తిన వెంటనే (48 గంటలలోపు) ఎకరానికి 1.0 – 1.4 లీటర్ల పెండిమిథాలిన్ 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయవలెను.

అంతర పంటలు :

- కంది + జొన్న / మొక్కజొన్న / సజ్జ (1:2) లేదా (1:4)
- కంది + పెసర / మినుము / వేరుశనగ / సోయాచిక్కుడు (1:7)
- కంది + ప్రత్తి (1:4) లేదా (1:6)
- కంది + పసుపు (1:4) లేదా (1:6)

డా॥ కె. రుక్మిణి దేవి, ప్రధాన శాస్త్రవేత్త (అపరాలు) & హెడ్, వ్యవసాయ పరిశోధన స్థానం, మధిర, ఫోన్ నెం. 7675050041

ప్రత్తి

- ప్రత్తి పంటను జూలై 20 వరకు విత్తుకోవాలి. జూలై 20 నుండి 30 వరకు ప్రత్తి విత్తిన రైతు సోదరలు భూస్వభావాన్ని బట్టి తేలిక, మధ్యస్థ భూముల్లో దగ్గర అచ్చు వేసుకొని మొక్కల సంఖ్యను పెంచుకొనే విధంగా ప్రత్తి గింజలను విత్తుకున్నట్లైతే ప్రత్తి దిగుబడి తగ్గకుండా ఉంటుంది.
- ప్రత్తి విత్తిన 10 రోజుల్లో మొలక రాని చోట మళ్ళీ విత్తుకోవాలి. రెండు మొలకలు ఉన్నచోట ఒకటి పీకి వేయాలి. కుదురుకు ఒక మొక్క ఉండేలా చూసుకోవాలి.
- ప్రత్తి పంటలో మొదటి 45 నుండి 60 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకోవాలి.
- కలుపు నివారణకై ప్రత్తి విత్తనం విత్తిన 24–48 గంటలలోపు ఎకరాకు 1.2 లీటర్ల పెండిమిథాలిన్ 30% లేదా 700 మి.లీ. పెండిమిథాలిన్ 38.7% సిఎస్ మందు 200 లీటర్ల నీటికి కలిపి నేలపై పిచికారి చేయాలి. భూమిలో సరియైన పదును/తేమ ఉన్నప్పుడు పిచికారి చేసినట్లైతే గడ్డి మందు సమర్థవంతంగా పనిచేసి 20 రోజుల వరకు కలుపు మొక్కలను లేకుండా చేస్తుంది.
- ప్రత్తి చేను 15 – 20 రోజుల దశలో ఉన్నప్పుడు చేనులో సన్న ఆకుల గడ్డి (4 ఆకులు), వెడల్పాకు (2–3 ఆకులు) కలుపు నివారణకై క్విజలోఫాప్ ఇథైల్ 400 మి.లీ. లేదా ప్రొపాక్విజాఫాప్ 250 మి.లీ. మరియు పైరిథయోబ్యాక్ సోడియం 250 మి.లీ. లేదా పైరిథయోబ్యాక్ సోడియం 6% + క్విజలోఫాప్ ఇథైల్ 4% ఎమ్ఇసి 500 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారి చేయాలి.
- ఎకరాకు 110 కిలోల యూరియా, 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ లేదా 50 కిలోల డిఎపి మరియు 40 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి.
- భాస్వరం ఎరువు మొత్తాన్ని దుక్కిలో లేదా విత్తిన 15 రోజులలోపు వేసుకోవాలి.
- ప్రత్తి విత్తిన 20, 40, 60, 80 రోజులలో 25 కిలోల యూరియా 10 కిలోల పొటాష్ కలిపి 4 సార్లు వేసుకోవాలి.
- పైపాటుగా డిఎపి లేదా కాంప్లెక్స్ (20.20.0.13) ఎరువులను వాడకూడదు.
- ప్రత్తి చేను బెట్ట లేదా అధిక వర్షాలకు గురి అయినప్పుడు ప్రత్తి పంట పెరుగుదలకై 19:19:19 లేదా 13:0:45 లాంటి పోషకాలను లీటరు నీటికి 10 గ్రా. చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి.
- అధిక సాంద్రత పద్ధతిలో ప్రత్తి సాగు చేసే రైతులు ప్రత్తి పంట 45–50 రోజుల దశలో ఉన్నప్పుడు తప్పకుండా మెపిక్వాట్ క్లోరైడ్ మందును లీటరు నీటికి 1.2 మి.లీ. చొప్పున కలుపుకొని పిచికారి చేయాలి. ఈ మందు పంట పెరుగుదలను మరియు శాఖీయ కొమ్మల పెరుగుదలను అదుపు చేస్తుంది.

- ప్రత్తిలో మొదటి 30-45 రోజుల్లో రసం పీల్చు పురుగుల నివారణకై ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ. లీటరు నీటికి కలుపుకొని పిచికారి చేసుకోవాలి.
- ప్రత్తి చేనులో ప్రత్తి మొక్కలు గుంపులు గుంపులుగా చనిపోతే వేరుకుళ్ళుగా భావించి దీని నివారణకై కార్బండాజిమ్ 1 గ్రా. లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్ళ చుట్టూ వేరు బాగా తడిచేటట్లు పోసుకోవాలి.

డా॥ జి. వీరన్న, ప్రధాన శాస్త్రవేత్త (ప్రత్తి), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్, ఫోన్ నెం. 9908033309

చెఱకు

ఈ మాసంలో కురిసే అధిక వర్షాలు, తుపాను గాలులకు పంట పడిపోకుండా మొక్కల మొదళ్ళ వరకు ఎత్తుగా మట్టిని ఎగద్రోయడం వలన చెఱకు గడలకు బలం చేకూరి, తోటలు పడకుండా ఉండటానికి ఆస్కారముంటుంది. నీటి ముంపునకు లోనయ్యే తోటల్లో, ప్రతి 25 మీటర్లకు వెడల్పుగల లోతైన ఊటకాలువలను ఏర్పాటు చేసుకొని తోటల్లో నీరు నిల్వకుండా మురుగు నీటి కాలువల ద్వారా నీటిని తీసివేయాలి. మురుగు నీటిని తీసివేసిన తర్వాత భూమి ఆరినప్పుడు తోటలకు దగ్గర దగ్గరగా తడులు పెట్టాలి. ముంపునకు గురైన తోటల్లో తెల్లదోమ నివారణకు క్లోరో పైరిఫాస్ 2.5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

నీటి ఎద్దడి, నీటి ముంపునకు లోనైన తోటల్లో వడలు తెగులు ఆశిస్తుంది. తెగులు సోకిన మొక్కల ఆకులు నీటి ఎద్దడికి గురైన ఆకులవలె వడలిపోతాయి. చెఱకు గడలలో గుల్ల ఏర్పడడం వలన బరువు తగ్గుతుంది. దీని నివారణకు నీటి ముంపునకు గురైన తోటల్లో నీరు నిల్వకుండా, మురుగు నీటి కాలువల ద్వారా తరచుగా నీటిని తీసివేయాలి. అధిక గాలితో కూడిన చల్లటి వాతావరణం మరియు గాలిలో తేమ త్రుప్పు తెగులు వృద్ధి చెందడానికి దోహదపడుతుంది. ఆకు అడుగుభాగంలో సన్నగా పసుపు లేదా నారింజ రంగులో ఉండే బొబ్బలు ఏర్పడతాయి. తెగులు ఉధృతమైనప్పుడు ఆకు తొడిమల మీద కూడా త్రుప్పు తెగులు ముదురు గోధుమ రంగులో కనిపిస్తుంది. దీని నివారణకు 1 మి.లీ. అజోక్సిస్ట్రోబిన్ 18.2% డబ్ల్యు / డబ్ల్యు లేదా డైఫెన్ కొనజోల్ 11.4% డబ్ల్యు / డబ్ల్యు గల మందు ద్రావణంను ఆకుల పైభాగం మరియు క్రింది భాగం తడిచేలా పిచికారీ చేసుకోవాలి.

చెఱకు పంటకాలము, ఎదుగుదలను బట్టి 2 – 3 సార్లు జడచుట్లు వేసుకుంటే తోట పడిపోకుండా నివారించుకోవచ్చు. అయితే మొదటి జడ చుట్లు చెఱకు సుమారు 1.5 మీటర్లు ఎత్తు ఎదిగిన తరువాత వేసుకోవాలి. జడ చుట్లు వేసుకునేటప్పుడు, అడుగు భాగాన మరియు పక్కన ఉన్న ఆకులను మెలివేసి 5 సెం.మీ. వ్యాసం గల తాడుగా అల్లాలి. ఇదే విధముగా సాళ్ళలో గల గడలకు వరస పొడవున జడచుట్లు వేసుకోవాలి. దీని వలన మొక్కకు సూర్య రశ్మి ఉపయోగించుకునే శక్తి ఎక్కువగా కల్గుతుంది. అందుకని మొక్కల పెరుగుదలకు అవసరమైన పోషక పదార్థాలను సమానంగా అందించి జడ చుట్లు వేసుకొన్నట్లయితే తోటల దిగుబడి పెరగటమే కాకుండా నాణ్యత కూడా పెరుగుతుంది. ఏపుగా పెరిగిన చెఱకు తోటలకు జడ చుట్లతో పాటు అక్కడక్కడ వెదురు గడలను భూమిలో నిలబెట్టుకోవడం కూడా ప్రయోజనకరమే.

డా॥ యం. విజయ్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త (చెఱకు) & హెడ్ వ్యవసాయ పరిశోధన స్థానం, బసంత్‌పూర్, మెదక్, ఫోన్ నెం. 9849535756

వాతావరణం-పంటల పరిస్థితి-విశ్లేషణ

డా॥ పి. లీలా రాణి మరియు డా॥ యస్. జి. మహాదేవప్ప
వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్

భారత వాతావరణ విభాగం వారి సమాచారం ప్రకారం నైరుతి ఋతుపవనాలు జూన్ 04వ తేదీన కేరళలో ప్రవేశించాయి. రాష్ట్రంలో నైరుతి ఋతుపవనాలు జూన్ 08వ తేదీన ప్రవేశించి జూన్ 23వ తేదీ వరకు రాష్ట్రమంతటా విస్తరించాయి. ఇప్పటివరకు రాష్ట్రంలో 01.06.2026 నుండి 30.06.2026 వరకు కురిసిన వర్షపాతాన్ని గమనించినట్లయితే సాధారణ వర్షపాతం 130.3 మి. మి. గాను 115.3 మి.మి అనగా సాధారణ వర్షపాతం – 12 శాతం నమోదైనది.

రాష్ట్రంలో వానాకాలం పంటకాలానికి 24.06.2026 వ తేదీ వరకు సాధారణ విస్తీర్ణంలో (ఎకరాలలో) వరి – 0.48 శాతం (30243), జొన్న – 7.87 శాతం (3992), మొక్కజొన్న – 5.93శాతం (30932), ప్రత్తి – 25.76 శాతం (1260315), కంది – 8.29 శాతం (55500), పెసర – 10.19 శాతం (8737), మినుములు – 11.55 శాతం (3801), సోయాచిక్కుడు – 5.86 శాతం (24666) మరియు వేరుశనగ – 2.46 శాతం (678) సాగు చేయటం జరిగింది. ఈ సంవత్సరం వానాకాలం పంటకాలంలో ఇప్పటి వరకు 11.16 శాతం మేర పంటలు సాగుచేయటం జరిగింది. ఇందులో ఆహార పంటలు 0.96 శాతం, పప్పుదినుసులు 8.71 శాతం, నూనె గింజల పంటలు 4.46 శాతం సాగుచేయటం జరిగింది.

వాతావరణ విభాగం సమాచారం ప్రకారం నైరుతి ఋతుపవనాల ద్వారా జులై నెలలో మన రాష్ట్రంలోని ఉత్తర మరియు దక్షిణ తెలంగాణ మండలాలలోని కొన్ని జిల్లాలలో సాధారణ వర్షపాతం మరియు మిగిలిన జిల్లాలలో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలున్నాయి. అదేవిధంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు మరియు కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఈ మాసంలో నమోదుకావచ్చును.

వాతావరణాధారిత వ్యవసాయ సలహాలు

- వర్షాధార పంటలను నేల 15-20 సెం.మీ. లోతు తడిచిన తరువాతనే వాలుకు అడ్డంగా లేదా బోదెలు మరియు కాలువల పద్ధతిలో లేదా ఎత్తు మడులు మరియు కాలువల పద్ధతిలో విత్తుకున్నట్లయితే పంటకు ఎక్కువ కాలం తేమ లభ్యమవుతుంది అదే విధంగా ఎక్కువ వర్షపు నీటిని కాలువల ద్వారా తీసివేయటానికి వీలుంటుంది.
- చెరువులు మరియు కుంటలకు దూరంగా ఉండి తక్కువ నీటి వసతి ఉన్న రైతులు తమకు అనువైన తక్కువ నీటి అవసరమున్న ఆరుతడి పంటలను సాగుచేసుకోవాలి.
- వరి సాగు చేసే రైతులు పచ్చిరొట్ట పైరుగా జనుము, జీలుగ, పెసర, పిల్లి పెసర, ఉలవలు లేదా అలసంద పంటలను విత్తుకోవడానికి అనుకూల సమయం.
- నీరు సమృద్ధిగా ఉన్న ప్రాంతాల్లో మధ్య కాలిక మరియు స్వల్ప కాలిక వరి రకాలు జులై 15 వరకు నారుమళ్ళు పోసుకోవడానికి అనువైన సమయం.
- తెలంగాణ సోన (ఆర్ఎన్ఆర్ 15048) వరి విత్తనాన్ని జులై మొదటి వారంలో మాత్రమే నారుమడి పోసుకోవాలి.
- 25రోజుల వయస్సు ఉన్న దీర్ఘకాలిక వరి రకాలను నాటు పెట్టుకోవాలి.
- వరి పంటను ప్రధాన పొలంలో నాట్లు వేయడానికి 15రోజుల ముందుగానే పచ్చి రొట్ట పైర్లను 50% పూత దశలో నేలలో కలియదున్నాలి.
- వర్షపు నీరు పడిన చోటనే నేలలో తేమను రక్షించే పద్ధతులను పాటించాలి
- సోయాచిక్కుడు జులై మొదటి వారం వరకు, మొక్కజొన్న, పెసర, మినుము పంటను జులై 15వ తేదీ వరకు ప్రత్తి జులై 20వ తేదీ వరకు మరియు ఆముదము, వేరుశనగ, కంది పంటను జులై చివరి తేదీవరకు ఏక పంటగా లేదా అంతర పంటలుగా విత్తుటకు అనుకూలం.
- ముందస్తు నివారణ చర్యాలలో బాగంగా, సోయాచిక్కుడులో స్టెమ్ గిర్డర్‌ను నివారించడానికి, 1500 పి. పి.ఎం. వేపనూనె మందును 5 మీ.లీ. ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.
- రైతులు మామిడి కోత అనంతరం 25–30 రోజుల తరువాత ఎండు కొమ్మలను మరియు అడ్డంగా పెరిగిన కొమ్మలను కత్తిరించినట్లయితే గాలి మరియు వెలుతురు మొక్కకు బాగా లభిస్తుంది.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం.9704157445

వానాకాలం రాగి సాగు - యాజమాన్య పద్ధతులు

డా॥ ఎ. శ్రీరామ్, డా॥ డి. శశిభూషణ్, డా॥ ఎం. శంకర్, కె. మమత, డా॥ టి. చైతన్య, డా॥ డి. భద్రు మరియు డా॥ ఎల్. కృష్ణ

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం

వానాకాలంలో వర్షాధారంగా, యాసంగిలో ఆరుతడి పంటగా రాగిని సాగు చేసుకోవచ్చు. మాగాణి భూముల్లో నీటి లభ్యత తగ్గినప్పుడు మరియు కొద్దిపాటి చౌడు సమస్య ఉన్న భూముల్లో కూడా రాగి పంటను విజయవంతంగా సాగు చేయవచ్చు. రాగిలో కాల్షియం అత్యధికంగా ఉండి, కొవ్వు శాతం తక్కువగా ఉంటుంది.

నేలలు: రాగి సాగుకు తేలికపాటి ఇసుక నేలలు, బరువైన నేలలు మరియు కొద్దిపాటి చౌడు సమస్య ఉన్న భూములు అనుకూలంగా ఉంటాయి.

విత్తే సమయం:

వానాకాలంలో జూన్ మొదటి వారం నుండి ఆగస్టు చివరి వారం వరకు విత్తుకోవచ్చు.

విత్తన మోతాదు:

2.0 కిలోల విత్తనంతో 5 సెంట్లలో పెంచిన నారు ఒక ఎకరం పొలంలో నాటడానికి సరిపోతుంది. వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తే ఎకరానికి 3-4 కిలోల విత్తనం అవసరం.

రాగి రకాలు

రకం	అనువైన ఋతువు	పంట కాలం (రోజులు)	దిగుబడి (క్వింటాళ్ళు/ఎకరం)	ముఖ్య గుణగణాలు
పాలెం రాగి-38	అన్ని కాలాలకు	110-120	10-12	వెన్నులు పెద్దవి, అధిక దిగుబడి, అన్ని కాలాలకు అనుకూలం, మంచి గింజ నాణ్యత కలిగి ఉంటుంది.
హిమ	యాసంగి	105-110	10-12	తెల్ల గింజల రకం, అగ్గి తెగులును తట్టుకుంటుంది.
వకుళ	వానాకాలం	105-110	10-12	అగ్గి తెగులును కొంతవరకు తట్టుకుంటుంది.
మారుతి	వానాకాలం, వేసవి	85-90	9-10	స్వల్ప కాలిక రకం, అగ్గి తెగులును తట్టుకుంటుంది.
భారతి	అన్ని కాలాలకు	105-110	10-12	వెన్నులు పెద్దవి, ముద్దగా ఉంటాయి. అగ్గి తెగులును కొంతవరకు తట్టుకుంటుంది.

విత్తన శుద్ధి: కిలో విత్తనానికి 2 గ్రా. కార్బండాజిమ్ లేదా 3 గ్రా. మ్యాంకోజెబ్ లేదా 2 గ్రా. ట్రైసైక్లోజోల్ 75% డబ్ల్యు.పి. మందుతో విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి.

విత్తే పద్ధతి: నారుమడికి తేలికపాటి దుక్కి చేసి విత్తనం చల్లి పట్టెతోలాలి. బాగా దుక్కి చేసిన నేలల్లో రాగిని 1:3 నిష్పత్తిలో విత్తనం మరియు సన్నని ఇసుక కలిపి నేరుగా విత్తుకోవచ్చు.

నారు నాటే పద్ధతి: 85-90 రోజుల స్వల్పకాలిక రకాలకు 21 రోజుల నారు, 105-120 రోజుల దీర్ఘకాలిక రకాలకు 30 రోజుల నారును నాటుకోవాలి. వరుసల మధ్య 30 సెం.మీ. మొక్కల మధ్య 10-15 సెం.మీ. దూరం పాటించాలి.

విత్తనం వెదజల్లే పద్ధతి: బాగా మెత్తగా తయారైన భూమిలో విత్తనాన్ని సమానంగా చల్లుకోవాలి. విత్తనం చల్లిన తర్వాత బల్లతో గానీ, చెట్టు కొమ్మతో గానీ నేలను చదును చేయాలి. లేకపోతే విత్తనానికి తగినంత తేమ లభించక మొలక శాతం తగ్గుతుంది.

ఎరువుల యాజమాన్యం

నారుమడిలో: 5 సెంట్ల నారుమడి ఒక ఎకరానికి సరిపడే నారును అందిస్తుంది. నారుమడికి 640 గ్రాముల నత్రజని, 640 గ్రాముల భాస్వరం మరియు 480 గ్రాముల పొటాష్‌ను అందించే ఎరువులను వేయాలి.

ప్రధాన పొలంలో: ఎకరానికి 4 టన్నుల పశువుల ఎరువును వేసి చివరి దుక్కిలో కలియదున్నాలి. ఎకరానికి 12 కిలోల నత్రజని, 12 కిలోల భాస్వరం మరియు 8 కిలోల పొటాష్ నాటే సమయంలో వేయాలి. నాటిన 30 రోజుల తర్వాత మరో 12 కిలోల నత్రజనిని పైపాటుగా వేయాలి.

కలుపు నివారణ, అంతర కృషి: విత్తిన రెండు వారాల్లోపు ఒత్తుగా ఉన్న మొక్కలను తొలగించాలి. విత్తనం వేసే ముందు లేదా నారు నాటడానికి ముందు పెండిమిథాలిన్ 30% ఇసి మందును ఎకరానికి 600 మి.లీ. లేదా అనిలోఫాస్ 0.75 లీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి తడి నేలపై పిచికారి చేయడం ద్వారా కలుపును నివారించవచ్చు. నాటిన 25-30 రోజుల తర్వాత వెడల్పాకు కలుపు మొక్కల నివారణకు: 2,4-డి సోడియం సాల్ట్ 80% డబ్ల్యుపి 400 గ్రా. లేదా ఇథాక్సీసల్ఫ్యూరాన్ - 100 మి.లీ. మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

నీటి యాజమాన్యం: నాటిన పైరు బాగా వేర్లు తొడిగిన తరువాత 10 రోజుల వరకు నీరు పెట్టరాదు. పూత దశ మరియు గింజలు పాలు పోసుకునే దశల్లో పైరు నీటి ఎద్దడికి గురికాకుండా తగినంత తేమను అందించాలి. ఈ దశల్లో నీటి కొరత ఏర్పడితే దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుంది.

అంతర పంటలు: రాగితో కందిని 8:2 నిష్పత్తిలో లేదా చిక్కుడును 8:1 నిష్పత్తిలో అంతర పంటలుగా సాగు చేయవచ్చు. అంతర పంటల సాగు ద్వారా భూమి సారాన్ని మెరుగుపరచడంతో పాటు రైతులకు అదనపు ఆదాయం కూడా లభిస్తుంది.

సస్యరక్షణ

పురుగులు:

గులాబి రంగు కాండం తొలుచు పురుగు

ఈ పురుగు రాగి, సజ్జ, కొర్ర పంటలను ఆశిస్తుంది. లార్వాలు కాండాన్ని తొలిచి లోపలి భాగాలను తినడం వల్ల మొవ్వ చనిపోవడం మరియు కంకి దశలో తెల్ల కంకులు ఏర్పడతాయి.

నివారణ

పురుగు ఆశించిన మొక్కలను గుర్తించి తొలగించాలి. పంట అవశేషాలను నాశనం చేయాలి. ఫెరోమోన్ ట్రాప్‌లను ఎకరానికి 4-5 ఏర్పాటు చేయాలి. పురుగు నష్టం 5 శాతం కంటే ఎక్కువ మొక్కల్లో కనిపించినప్పుడు, నివారణ చర్యగా క్లోరాంట్రానిలిప్రోల్ 18.5 ఎస్‌సి 0.3 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 5 ఎస్‌జి 0.4 గ్రా. లేదా స్పైనటోరామ్ 11.7 ఎస్‌సి 0.5 మి.లీ. మందులను లీటరు నీటికి కలిపి సమంగా పిచికారి చేయాలి. అవసరమైతే 10-15 రోజుల వ్యవధిలో రెండవ పిచికారి కూడా చేపట్టాలి.

శనగ పచ్చ పురుగు

ఈ పురుగు కంకి దశలో పూతలు, గింజలను తిని దిగుబడిని తగ్గిస్తుంది.

నివారణ

ఫెరోమోన్ ట్రాప్స్‌ను ఎకరానికి 4-5 ఏర్పాటు చేయాలి. పక్షుల వాలు కొయ్యలను ఎకరానికి 10-15 ఏర్పాటు చేయాలి. శనగ పచ్చ పురుగు ఉధృతి ఆర్థిక నష్టం స్థాయి (ఇటిఎల్) దాటినప్పుడు, ఇమామెక్టిన్ బెంజోయేట్ 5 ఎస్‌జి 0.4 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 18.5 ఎస్‌సి 0.3 మి.లీ. లేదా ఇండాక్సాకార్బ్ 14.5 ఎస్‌సి 1 మి.లీ. లేదా స్పైనోసాడ్ 45 ఎస్‌సి 0.3 మి.లీ. మందులను లీటరు నీటికి కలిపి సమంగా పిచికారి చేయాలి. అవసరమైతే 10-15 రోజుల వ్యవధిలో మరొక పిచికారి చేయడం ద్వారా పురుగు ఉధృతిని సమర్థవంతంగా నియంత్రించవచ్చు.

చెదలు: రాగి, కొర్ర పంటల్లో చెదలు ముఖ్యంగా తేలిక నేలలు మరియు వర్షాభావ పరిస్థితుల్లో అధిక నష్టం కలిగిస్తాయి. ఇవి మొక్కల వేర్లు, కాండాలను దెబ్బతీసి మొక్కలు ఎండిపోవడానికి కారణమవుతాయి.

నివారణ: పొలాన్ని పరిశుభ్రంగా ఉంచి చెదల పుట్టలను నాశనం చేయాలి. చెదల ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు పుట్టలో రంధ్రం చేసి క్లోరిపైరిఫాస్ 50 ఇసి 5 మి.లీ. ను లీటరు నీటికి కలిపిన ద్రావణం పోయాలి. అవసరమైతే మొక్కల అడుగు భాగంలో ద్రావణాన్ని పోసి చెదలను సమర్థవంతంగా నియంత్రించవచ్చు.

తెగుళ్లు: అగ్గి తెగులు: రాగిలో అగ్గి తెగులు ప్రధాన వ్యాధి. ఈ తెగులు నారుమడిలోనూ, పొలంలోనూ కనిపిస్తుంది. వర్షపాతంతో కూడిన అధిక తేమ, మబ్బు వాతావరణం మరియు 20-25^{0} సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతల వద్ద తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అధిక నత్రజని ఎరువుల వాడకం వల్ల కూడా వ్యాధి ఉధృతి పెరుగుతుంది.

లక్షణాలు: ఆకులపై దారపు కండె లేదా కంటి ఆకారంలో బూడిద రంగు మధ్యభాగం, గోధుమ రంగు అంచులతో కూడిన మచ్చలు ఏర్పడతాయి. కణుపులపై ఆశిస్తే కణుపులు బలహీనపడి విరిగిపోతాయి. వెన్నులపై ఆశిస్తే గింజలు సరిగా నిండక తాలుగింజలుగా మారతాయి.

నివారణ: వ్యాధి నిరోధక లేదా తట్టుకునే రకాలను సాగు చేయాలి (శ్రీచైతన్య, వేగావతి, ఇంద్రావతి, సువర్ణముఖి, వకుళ, తిరుమల). విత్తనశుద్ధి కోసం కిలో విత్తనానికి ట్రైసైక్లోజోల్ 75 డబ్ల్యుపి 2 గ్రా. లేదా కార్బండాజిమ్ 2 గ్రా. కలిపి శుద్ధి చేయాలి. నత్రజని ఎరువులను సిఫారసు మోతాదులోనే వాడాలి. వ్యాధి ప్రారంభ లక్షణాలు కనిపించిన వెంటనే ట్రైసైక్లోజోల్ 75 డబ్ల్యుపి 0.6 గ్రా., లేదా అజాక్సీస్ట్రోబిన్ 23 ఎస్‌సి 1 మి.లీ., మందులలో ఏదో ఒకదాన్ని లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. అవసరమైతే 10-15 రోజుల వ్యవధిలో రెండవ పిచికారి చేయాలి. ఎకరానికి సుమారు 200 లీటర్ల నీటితో పిచికారి చేయడం ద్వారా అగ్గి తెగులును సమర్థవంతంగా నియంత్రించి మంచి ఫలితాలు పొందవచ్చు.

పంట కోత: గింజలు ముదురు గోధుమ రంగులోకి మారినప్పుడు, వెన్నుకు దగ్గర ఆకులు పండినట్లు కనిపించినప్పుడు కోత ప్రారంభించాలి. పిలక కంకుల కంటే ప్రధాన కాండపు కంకి ముందుగా కోతకు వస్తుంది. అందువల్ల 2-3 దశల్లో కోత చేపట్టాలి. పొలంలో చొప్పను కోసి 2-3 రోజులు ఆరిన తరువాత వెన్నులను విడదీయవచ్చు. లేదా వెన్నులను మాత్రమే కోసి 2-3 రోజులు ఆరబెట్టవచ్చు. బాగా ఎండిన వెన్నులను కర్రలతో కొట్టి లేదా ట్రాక్టర్ నడిపి గింజలను వేరు చేయాలి. అనంతరం గాలికి తూర్పారబట్టి శుభ్రమైన, నాణ్యమైన గింజలను సేకరించాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8919777028

జూలై, 2026లో పి.జె.టి.ఏ.యు వారి రేడియో కార్యక్రమం చేనుకబుర్లు ప్రతి బుధవారం మధ్యాహ్నం 1:20 నుండి 1:50 వరకు ఆకాశవాణి, హైదరాబాద్-ఏ స్టేషన్ నుంచి ప్రసారమవుతుంది.

తేది	అంశం
01.07.2026	తడి - పొడి విధానంలో వరి సాగు యాజమాన్యం
	వన మహోత్సవ వారోత్సవం
08.07.2026	వర్షాకాలంలో కూరగాయల సాగు
	వర్షాకాలంలో ఆహారభద్రత
15.07.2026	వ్యవసాయంలో ఏఐ పాత్ర
	గ్రామీణ యువతకు నైపుణ్యాభివృద్ధి
22.07.2026	చిరుధాన్యాలు ఆరోగ్యానికి అమృతం
	గృహంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం
29.07.2026	ఆహారం సరిగా తీసుకుకోకపోతే వచ్చే పోషకాహార లోపాలు, సమస్యలు మరియు వాటి పరిష్కారాలు
	జీవవైవిధ్య పరిరక్షణ

వానాకాలం కంది సాగుకు అనువైన రకాలు - మేలైన యాజమాన్య పద్ధతులు

డా॥ జి. ఈశ్వర రెడ్డి, డా॥ కె. సదయ్య, జి. మాధురి, కె. మమత, డా॥ వి. దివ్యా రాణి మరియు డా॥ ఎల్ క్రిష్ణ

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం

తెలంగాణ రాష్ట్రంలో వర్షాధారంగా సాగు చేసే పప్పుదినుసుల పంటలలో కంది ముఖ్యమైన పంట. కంది పంటను ముఖ్యంగా వికారాబాద్, సంగారెడ్డి, నారాయణ్‌పేట్, ఆదిలాబాద్, కొమురంభీం అసిఫాబాద్, కామారెడ్డి, జోగులాంబ గద్వాల్ మరియు మహబూబ్‌నగర్ జిల్లాలలో సాగు చేస్తున్నారు. కంది పంట తెలంగాణలో ప్రతి సంవత్సరం సుమారుగా 5 లక్షల ఎకరాల విస్తీర్ణంలో సాగులో ఉండగా దిగుబడులు మాత్రం ఎకరాకు కేవలం 450-500 కిలోలు మాత్రమే నమోదవుచున్నవి.

కందిలో అధిక దిగుబడులు సాధించక పోవడానికి గల ముఖ్య కారణాలు

- ఈ పంటను సాగు చేసేటప్పుడు నేల స్వభావం మరియు వర్షపాత పరిస్థితులకు అనుగుణంగా రకాలను ఎంచుకోకపోవడం తద్వారా పంట చివరి (గింజ కట్టే) దశలో నీటి ఎద్దడికి గురై దిగుబడులు గణనీయంగా తగ్గడం.
- అతి తక్కువ వనరులు తేలికపాటి లేక నిస్సారమైన భూములలో ఈ పంటను సాగుచేయడం.
- వివిధ దశలలో ఎండుతెగులు పంటను ఆశించి, మొక్కల సాంద్రత గణనీయంగా తగ్గిపోవడం.
- కందిని అంతరపంటగా సాగుచేసినప్పుడు, పూర్తి శ్రద్ధతో ఈ పంటలో యాజమాన్యం చేపట్టకపోవడం.
- వెర్రి (గొడ్డు మోతు) తెగులు పంటను ఆశించి పూత రాకపోవడం.
- పూత దశలో మారుకామచ్చల పురుగు, పిందె / కాయ ఏర్పడే దశలో శనగపచ్చ పురుగు తీవ్రంగా ఆశించినప్పుడు సరైన సస్యరక్షణ చర్యలు పాటించకపోవడం.

పైన తెలిపిన కారణాలను దృష్టిలో ఉంచుకొని రైతులు సరైన రకాలను ఎంచుకొని మేలైన యాజమాన్య మరియు సస్యరక్షణ పద్దతులను ఆచరిస్తే కందిలో అధిక దిగుబడులు సాధించగలుగుతారు.

రకాల ఎంపిక

కంది పంటను తేలికపాటి ఎర్ర చల్కా నేలల్లో సాగుచేసేటప్పుడు స్వల్పకాలిక (140-145 రోజుల పంటకాలం) మరియు మధ్యకాలిక (155-160 రోజుల పంటకాలం) రకాలను ఎంచుకుంటే పంట చివరిదశలో నీటి ఎద్దడికి గురికాకుండా పిందె / కాయ బాగా నిలిచి మంచి దిగుబడులు పొందే అవకాశం ఉంటుంది. అలాగే ఈ పంటను బరువైన నల్లరేగడి నేలల్లో లేదా నీటి పారుదల సౌకర్యం క్రింద సాగుచేస్తే దీర్ఘకాలిక (180-185 రోజుల పంటకాలం) లేదా హైబ్రిడ్‌లను ఎంచుకొంటే అధిక దిగిబడులు సాధించవచ్చును.

రకం	పంట కాలం (రోజుల్లో)	దిగుబడి (క్వి/ఎ)	గుణగణాలు
పి.ఆర్.జి.176 (ఉజ్వల)	140-145	6-8	తక్కువ వర్షపాతం కలిగిన ప్రాంతాలకు మరియు ఎర్ర చల్కా నేలలకు అనువైనది.
డబ్ల్యు.ఆర్.జి. ఇ. 93	150-165	7-8	మధ్యస్థ నేలలు, తక్కువ వర్షపాతం కలిగే ప్రాంతాలకు అనువైన రకం. ఎండు తెగులును తట్టుకుంటుంది.
డబ్ల్యు.ఆర్.జి. ఇ. 97	150-165	7-8	మధ్యస్థ నేలలు, తక్కువ వర్షపాతం కలిగే ప్రాంతాలలో సాగుచేయవచ్చు. ఎండు తెగులును తట్టుకుంటుంది. ఆకుముడత పురుగులు తక్కువగా ఆశిస్తాయి.
డబ్ల్యు.ఆర్.జి. 65 (రుద్రేశ్వర)	160-180	8-10	ఫ్యుజేరియం ఎండు తెగులు మరియు శనగపచ్చ పురుగును కొంతవరకు తట్టుకుంటుంది. నల్ల రేగడి భూములకు అనువైనది.
డబ్ల్యు.ఆర్.జి. 121	155-165	6-7	ఫ్యుజేరియం ఎండు తెగులు, మారుకామచ్చల పురుగులను, కాయతొలుచు ఈగలను కొంతవరకు తట్టుకొనును.
డబ్ల్యు.ఆర్.జి. 255	165- 180	7-8	ఎండుతెగులును సమర్థవంతంగా తట్టుకుంటుంది. గింజ లావుగా ఉంటుంది.
టి.డి.ఆర్.జి.4 (హనుమ)	160-180	8-10	ఫ్యుజేరియం ఎండు తెగులును పూర్తిగా తట్టుకొనును. వెర్రి తెగులు మరియు శనగ పచ్చ పురుగును కొంత మేరకు తట్టుకుంటుంది.
టి.డి.ఆర్.జి. 59 (తెలంగాణ కంది-3)	170-175	8-10	ఫ్యుజేరియం ఎండు తెగులు మరియు వెర్రి తెగులును కొంత మేరకు తట్టుకుంటుంది. శనగ పచ్చ పురుగును కొంత మేరకు తట్టుకుంటుంది.
టి.డి.ఆర్.జి. 272 (తెలంగాణ కంది-4)	160-165	7-8	ఫ్యుజేరియం ఎండు తెగులును కొంత వరకు తట్టుకుంటుంది. శనగ పచ్చ పురుగు మరియు కాయ ఈగ ను కొంత మేరకు తట్టుకుంటుంది.
ఆశ (ఐ.సి.పి.ఎల్. 87119)	170-180	7-8	మొక్క నిటారుగా, గుబురుగా పెరుగుతుంది. ఫ్యుజేరియం ఎండు మరియు వెర్రి తెగుళ్ళను తట్టుకుంటుంది. గింజలు ముదురు గోధుమ రంగులో లావుగా ఉంటాయి.

నేలల ఎంపిక మరియు నేలల తయారి: కంది పంటను నీరు త్వరగా ఇంకిపోయే గరప నేలలు, ఎర్ర నేలలు మరియు చల్కా నేలల్లో సాగుచేసుకోవచ్చును. మురుగు నీరు పొయే వసతి గల నల్లరేగడి నేలలు కూడా అనుకూలం. చౌడు నేలలు, నీటి ముంపునకు గురయ్యే నేలలు కంది సాగుకు పనికిరావు. విత్తే ముందు భూమిని కనీసం రెండు సార్లు దున్ని మెత్తగా తయారు చేసుకోవాలి. ఎద్దుల సహాయంతో నడిచే పల్ల గొర్రుతో లేక ట్రాక్టర్ లెవలర్‌తో నేలను చదునుచేసుకోవాలి.

విత్తన మోతాదు: రకాలను సాగుచేసేటప్పుడు ఒక ఎకరా కందిని విత్తుకోవటానికి 3 కిలోల విత్తనం సరిపోతుంది. అదే ఈ పంటను అంతరపంటగా సాగుచేస్తున్నప్పుడు ఆయా పంటల నిష్పత్తులను బట్టి ఎకరాకు 1.5 నుండి 2 కిలోల విత్తనం సరిపోతుంది. కందిలో హైబ్రిడ్ (సంకర రకాలు) లను సాగుచేస్తే ఎకరాకు 2 కిలోల విత్తనం సరిపోతుంది.

విత్తనశుద్ధి: కంది పంటను మొదటిసారిగా సాగుచేసుకొనే పొలాల్లో ప్రతి ఎకరానికి (అంటే 3 కిలోలు విత్తనానికి) 250 గ్రా. రైజోబియం కల్చర్‌ను పట్టించాలి అలాగే కిలో విత్తనానికి 3 గ్రా. థైరామ్ లేదా కాప్టాన్‌తో విత్తనశుద్ధి చేయడం వలన పంట తొలిదశలో వచ్చే తెగుళ్ళను నివారించవచ్చు.

విత్తే దూరం: నల్ల రేగడి నేలలు అయినచో సాళ్ళ మధ్య 150 సెం.మీ. నుండి 180 సెం.మీ.లు మరియు మొక్కల మధ్య 20 సెం.మీ. ఎడం ఉండేటట్లు విత్తుకోవాలి. అదే ఎర్రనేలలు

అయినప్పుడు సాలుకు మధ్య కనీసం 90 సెం.మీ. నుండి 120 సెం.మీ. దూరం ఉండే విధంగా విత్తుకోవాలి. దీనివల్ల పూత, కాయ దశల్లో పురుగు మందులను పిచికారి చేసుకోవడం కూడా తేలికవుతుంది.

ఎరువులు

ముందుగా ఎకరాకు 2 టన్నుల పశువుల ఎరువుతో పొలమంతా కలిసేటట్లుగా దుక్కిలో కలియదున్నాలి. తొలకరి కందికి ఎకరాకు 8 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరంనిచ్చే ఎరువులు ఆఖరి దుక్కిలో వేసుకోవాలి, అనగా 18 కిలోల యూరియా, 125 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ లేదా 50 కిలోల డి.ఎ.పి. ని వాడాలి. కంది మొక్కకు తొలి రోజులలో ఎక్కువ పోషకాల ఆవశ్యకత ఉంటుంది. కావున పూర్తి నత్రజని మరియు భాస్వరం ఎరువులను తప్పనిసరిగా విత్తనంతో పాటు గాని లేదా ఆఖరి దుక్కిలో గాని వేసుకోవాలి.

అంతర పంటలు

కందిని ఇతర ముఖ్య పంటలతో సాగుచేసుకున్నట్లయితే యాజమాన్యం సులభమే కాకుండా రెండు పంటల నుండి అధిక దిగుబడిని, ఆదాయాన్ని పొందవచ్చును.

కంది + జొన్న/మొక్కజొన్న/సజ్జ	-	1:4
కంది + పెసర / మినుములు	-	1:7
కంది + పత్తి	-	1:4 లేదా 1:6
కంది + ఆముదం	-	1:1 లేదా 1:4 లేదా 1:6

కలుపు నివారణ, అంతరకృషి

మొలకెత్తక ముందు: పెండిమిథాలిన్ 30% ఎకరాకు 1.3 నుండి 1.6 లీటర్లను 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన వెంటనే లేదా మరుసటి రోజు గాని పిచికారి చేయాలి.

మొలకెత్తిన తర్వాత: పైరు 20 రోజుల వయస్సులో వెడల్పాకు కలుపు లేత దశలో నివారణకు ఇమజితాఫిర్ 300 మి.లీ. ఎకరాకు పిచికారి చేయాలి. గడ్డి జాతి కలుపు మొక్కలు ఎక్కువగా ఉన్నచో క్విజలోఫాప్-పి-ఇథైల్ 5% ఇ.సి. 400 మి.లీ. లేదా ప్రోపాక్విజాఫాప్ 10% ఇ.సి. 250 మి.లీ. లేదా ఫినాక్సీప్రాప్ ఇథైల్ 9.3% 250 మి.లీ. కలుపు మొక్కలు 3-4 ఆకుల దశలో ఉన్నప్పుడు 250 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. కలుపు మందులు పిచికారి చేసేటప్పుడు భూమిలో తగు తేమ ఉండేలా చూసుకోవాలి. కందిలో 45 రోజుల వరకు మొక్కల పెరుగుదల నెమ్మదిగా ఉంటుంది. కాబట్టి ఈ సమయం వరకు కలుపును సమగ్రంగా అరికట్టేందుకు సాళ్ల మధ్య గుంటక సహాయం తో 2-3 సార్లు అంతర సేద్యం చేసుకోవాలి.

నీటి యాజమాన్యం

కంది పంటకు ప్రస్తుతం ఉన్న మంచి మార్కెట్ ధర కారణంగా, బోర్లు / బావుల కింద కొద్దిపాటి నీటిపారుదల సౌకర్యం ఉన్నచోట రైతు సోదరులు కీలక దశలో 2-3 తడులు ఇవ్వగలిగితే అత్యధిక దిగుబడులు సాధించవచ్చు. ఖరీఫ్‌లో వర్షాధారంగా పండిస్తారు. అవకాశమున్న చోట పిందె, కాయ తయారయ్యే దశలో ఒకటి లేదా రెండు తడులు ఇస్తే దిగుబడులు పెరుగుతాయి.

కంది సాగులో ముఖ్య సూచనలు

- ఎండుతెగులు సంక్రమించే సమస్యాత్మక భూముల్లో విధిగా ట్రైకోడెర్మా విరిడిని ప్రతి కిలో విత్తనానికి 8 గ్రా. పట్టించి విత్తుకోవాలి.
- విత్తిన తొలి 60 రోజుల వరకు ఎదుగుదల తక్కువగా ఉంటుంది. కావున స్వల్పకాలిక పంటలైన పెసర లేదా మినుమును అంతర పంటగా వేసుకోవచ్చును.
- విత్తిన 50-60 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకోవలెను.
- ఎప్పటికప్పుడు అంతరకృషి చేసి మరియు అంతర పంట కోసిన తర్వాత మోళ్ళను భూమిలో కలియ దున్ని బోదెల ద్వారా వర్షాధారపు నీటిని సంరక్షించుకోవాలి.
- శనగ పచ్చ పురుగు మరియు మారుకా మచ్చల పురుగును సకాలంలో నివారించడానికి సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.
- కీలక దశలలో తేలిక పాటి నీరు (డ్రిప్ లేదా బోదెల ద్వారా) అందించినచో అధిక దిగిబడులు సాధించవచ్చును. నిండు పూత దశలో నీరు పెట్టకూడదు. ఎట్టి పరిస్థితులలో పొలంలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడాలి.
- మొగ్గ తొడిగే దశ మరియు మొగ్గ తొడిగిన 10 రోజులకు మెపిక్వాట్ క్లోరైడ్ 2000 పి.పి.యం. (40 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి) ఎకరానికి పిచికారి చేసినచో పూత రాలడం చాలా వరకు తగ్గి ఎక్కువగా కాయలు నిలవడానికి దోహదపడి దిగుబడి పెరుగును.
- విత్తడం నుండి కోత వరకు యాంత్రిక పద్ధతులు అవలంభించినచో ఖర్చు తగ్గి ఆదాయం పెరుగును.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. 6281121529

చెఱకులో వేరు పురుగు - సమగ్ర యాజమాన్యం

ఎమ్. సాయి చరణ్, జి.రాకేష్, డా॥ వై.ఎస్. పరమేశ్వరి, డా॥ ఏ. కృష్ణ చైతన్య, డా॥ రమ్య రాథోడ్, బి. మంజు భార్గవి, డా॥ ఫిర్దోస్ షహేన, డా॥ కే. పవన్ చంద్రా రెడ్డి మరియు డా॥ ఎమ్. విజయ్ కుమార్

ప్రాంతీయ చెఱకు మరియు వరి పరిశోధన స్థానం, రుద్రూర్, నిజామాబాద్

తెలంగాణ రాష్ట్రంలో రైతులు చెఱకును ఒక ముఖ్యమైన వాణిజ్య పంటగా సుమారు 30 వేల హెక్టార్ల కన్నా ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. చెఱకు పంటను తొలి దశ నుండి పంట నరికే వరకు వివిధ రకాల కీటకాలు మరియు తెగుళ్లు ఆశించి నష్టపరుస్తాయి. రాష్ట్రంలో చెఱకు సాగు చేసే ప్రాంతాలైన ఖమ్మం, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, కామారెడ్డి మరియు వికారాబాద్ జిల్లాలలో వేరు పురుగు ఉధృతి ఎక్కువగా ఉండి పంటను ఆశించి తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. ఈ పురుగు యొక్క ఉనికిని సకాలంలో గుర్తించి నియంత్రించని ఎడల పంట యొక్క దిగుబడి మరియు నాణ్యత పైన తీవ్రమైన ప్రభావం చూపిస్తాయి.

వేరు పురుగు జీవిత చక్రం

పెంకు పురుగులు నేలలో నివసిస్తాయి. సాధారణంగా మే - జూన్ మాసాలలో తొలకరి వర్షాలు కురిసిన తరువాత ఎదిగిన పురుగులు నేల నుండి బయటకు వచ్చి దగ్గరలో ఉన్న వేప, చింత, తుమ్మ మరియు నేరేడు వంటి చెట్ల పైన నివాసం ఉంటాయి. తల్లి పురుగులు నేల లోపల గుడ్లను పెడతాయి. ఒక తల్లి పురుగు జీవితకాలంలో 20-27 గుడ్లను పెడుతుంది. గుడ్లు పెట్టిన 7-10 రోజుల తర్వాత పిల్ల పురుగులు / లార్వాలు బయటికి వస్తాయి. తొలి దశలో లార్వాలు నేలలో ఉన్న కర్బన పదార్థం మరియు గడ్డి జాతి కలుపు యొక్క వేర్లని తిని జీవిస్తాయి. 2, 3 దశల్లో లార్వాలు తెలుపు రంగు లో "సి" ఆకారంలో ఉండి చెఱకు పంట యొక్క వేరు వ్యవస్థని ఆశిస్తాయి. లార్వా తొలి దశ నుండి పూర్తిగా ఎదగడానికి 8-10 వారాల సమయం పడుతుంది. దాని తరువాత లార్వా 30-125 సెం.మీ నేల లోపల కోశస్థ దశగా రూపాంతరం చెందుతుంది. ఈ పురుగులు సుమారుగా నెల రోజుల పాటు గూడు దశలో కొనసాగిన తరువాత పెంకు పురుగుగా మారతాయి. వేరు పురుగులు సంవత్సర కాలంలో ఒక జీవిత చక్రాన్ని పూర్తి చేసుకుంటాయి.

చెఱకులో వేరు పురుగు యొక్క నష్ట లక్షణాలు

- వేరు పురుగులు మొక్క యొక్క వేర్లు మరియు మొదళ్ళను ఆశించి నష్టపరుస్తాయి.
- పురుగు ఆశించిన మొక్క యొక్క ఆకులు పసుపు రంగులోకి మారి, వడలిపోవడం జరుగుతుంది.
- వేరు పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు మొక్క పూర్తిగా ఎండిపోతుంది.
- పురుగు ఆశించిన మొక్కలు పీకితే సులభంగా ఊడి వస్తాయి.
- ఈ పురుగు యొక్క ఉధృతి కార్శి పంటలలో ఎక్కువగా ఉంటుంది.

నివారణ చర్యలు

- ఈ పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్న పొలం యొక్క ఆఖరు దుక్కి లో ఎకరాకు 200 కిలోల చొప్పున వేపపిండిని వేసుకోవాలి.

- మే-జూన్ మాసాలలో తొలకరి వర్షాలు కురిసిన తరువాత, పొలం గట్లపై ఉన్న వేప, చింత, తుమ్మ మరియు నేరేడు వంటి చెట్ల పైన ఇమిడాక్లోప్రిడ్ 17.8% 0.25 మీ.లీ లేదా క్లోరిపైరిఫాస్ 20% ఇసి 2.5 మీ.లీ ను లీటరు నీటికి కలిపి చెట్లపై పిచికారి చేసుకోవాలి.
- అదేవిధంగా పొలంలో దీపపు ఎరలను ఏర్పాటు చేసుకోవాలి, ఈ విధంగా చేయడం వలన ఎదిగిన / ప్రౌఢ పెంకు పురుగులను 50% వరకు నియంత్రించవచ్చు, తద్వారా పురుగుల యొక్క సంతతిని తగ్గించవచ్చు.
- ఈ పురుగు ఉనికి గమనించిన పొలంను 24 గంటల పాటు పూర్తిగా నీటితో నింపాలి, అపుడు వేరు పురుగు యొక్క లార్వాలు నేల నుండి బయటికి వచ్చి నీటిపై తేలియాడుతాయి, వాటిని ఏరి నాశనం చేయాలి.
- వేరు పురుగు యొక్క తొలి దశ లార్వాలు కలుపు మొక్క యొక్క వేర్లను తిని జీవిస్తాయి, కావున పొలం గట్ల పైన, మొక్క మొదళ్ళ వద్ద కలుపు మొక్కలు లేకుండా నివారించాలి.
- కీటక నాశక శిలీంద్రం మెటారైజియం అనిసోప్లియె కల్చర్ 2 కిలోలు 100 కిలోల పశువుల ఎరువులో కలుపుకుని వృద్ధి చెందిన తరువాత, రైతులు స్వంతంగా తమ పొలంలో వేసుకున్నట్లయితే వేరుపురుగును సమర్థవంతంగా నివారించవచ్చు.
- ఫిప్రోనిల్ 40% + ఇమిడాక్లోప్రిడ్ 40% రసాయనాన్ని ఎకరాకు 150 గ్రా. చొప్పున 400 లీటర్ల నీటిలో కలిపి మొక్కల మొదళ్ళ దగ్గర పిచికారి చేసి వేరు పురుగును నియంత్రించవచ్చు.
- పురుగు ఉధృతి అధికంగా ఉండి, తరుచుగా వేరు పురుగు ఆశించే పొలాలలో పంట మార్పిడి చేసుకోవాలి.

ఈ విధంగా చెఱకు రైతులు వేరుపురుగు యొక్క ఉనికిని సకాలంలో గుర్తించి, తగిన సమగ్ర సస్యరక్షణ చర్యలను చేపట్టడం వలన చెఱకు యొక్క దిగుబడి మరియు నాణ్యతని పెంపొందించవచ్చు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 7032705166

ఆకాశవాణి ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమము

పి.జె.టి.ఏ.యు, శాస్త్రవేత్తల ప్రత్యక్ష రేడియో ప్రసార కార్యక్రమం ప్రతి గురువారం రాత్రి 7:15-7:45 ఆకాశవాణి, హైదరాబాద్ ఏ స్టేషన్ నుంచి ప్రసారమవుతుంది. జూలై, 2026 లో ప్రసారమయ్యే రేడియో కార్యక్రమాలు

తేది	అంశం	సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్
02.07.2026	సమస్యాత్మక భూముల యాజమాన్యం	**డా॥ టి. చైతన్య,** శాస్త్రవేత్త (ఎస్.ఎస్.ఎ.సి.) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, ఫోన్ నెం.: 9032677235
09.07.2026	వర్షభావ పరిస్థితుల్లో వేసుకోవాల్సిన పంటలు	**శ్రీమతి కె. మమత,** శాస్త్రవేత్త (అగ్రానమి) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, ఫోన్ నెం.: 9666600471
16.07.2026	కంది సాగుకు అనువైన రకాలు మేలైన యాజమాన్య పద్ధతులు	**డా॥ జి. ఈశ్వర్ రెడ్డి,** శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, ఫోన్ నెం.: 6281121529
23.07.2026	మొక్కజొన్న పంటలో సమగ్ర సస్యరక్షణ	**డా॥ సిహెచ్. అనూష,** శాస్త్రవేత్త (ఎంటమాలజీ) మొక్కజొన్న పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, ఫోన్ నెం.: 9701518923
30.07.2026	వానాకాలం పంటల్లో సమగ్ర కలుపు యాజమాన్యం	**డా॥ బి. పద్మజ,** ప్రధాన శాస్త్రవేత్త (అగ్రానమి) ఎఐసిఆర్‌పి ఆన్ వీడ్ మెనేజ్‌మెంట్, రాజేంద్రనగర్, ఫోన్ నెం.: 9440040605

వానాకాలానికి అనువైన పశుగ్రాస పంటల యాజమాన్యం

డా॥ డి. పద్మజ, డా॥ యస్. శ్రీనివాసరావు, డా॥ జె. అరుణ కుమారి మరియు డా॥ వై. చంద్రమోహన్

ఎ.ఐ.సి.ఆర్.పి. పశుగ్రాస విభాగం, ఎ.ఆర్.ఐ., రాజేంద్రనగర్

వానాకాలానికి అనువైన పశుగ్రాస మొక్కజొన్న యాజమాన్యం

అనువైన నేలలు: నీరు నిలువని నల్లరేగడి నేలలు మరియు ఎర్రరేగడి నేలలు అనుకూలం.

విత్తు సమయం:

ఖరీఫ్ / వానాకాలం :– జూన్ – జూలై (వర్షాధారంగా)

యాసంగి / రబీ :– అక్టోబర్ – నవంబర్

వేసవి :– జనవరి – మే (నీటి పారుదల)

విత్తన మోతాదు :– 20 కిలోలు / ఎకరానికి

విత్తనశుద్ధి :– 3 గ్రా. థైరమ్ / కాప్టాన్‌తో విత్తనశుద్ధి చేయాలి.

విత్తే దూరం :– సాలుకు సాలుకు మధ్య దూరం 30 సెం.మీ.

మొక్కకు మొక్కకు మధ్య దూరం 10 సెం.మీ.

అనువైన రకాలు :– ఆఫ్రికన్ టాల్, జె–1006, టి.ఎస్.ఎఫ్.ఎమ్ 15–5, జె–1007

విత్తనశుద్ధి :– కిలో విత్తనానికి 3 గ్రాముల థైరామ్ / కాప్టాన్ కలిపి విత్తనశుద్ధి చేయాలి.

ఎరువుల యాజమాన్యం :– బాగా మాగిన పశువుల ఎరువు 4 టన్నులు ఒక ఎకరానికి ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలి. ఆఖరి దుక్కిలో నత్రజని ఎరువు 12 కిలోలు, భాస్వరం 16 కిలోలు మరియు పొటాష్‌నిచ్చే ఎరువులు 12 కిలోలు వేసుకోవాలి.

నీటిపారుదల సౌకర్యం గల ప్రాంతాలలో సాగు చేసినట్లయితే 20 కిలోల నత్రజని, 16 కిలోల భాస్వరం మరియు 12 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను వేసుకోవాలి. 3 రోజుల తర్వాత 20 కిలోల నత్రజనినిచ్చే ఎరువులను మొక్కల మొదళ్ళ దగ్గర వేసుకోవాలి.

నీటి యాజమాన్యం :– విత్తిన వెంటనే నీరు పెట్టాలి. తదుపరి 10 రోజుల తర్వాత పలుచటి తడి ఇవ్వాలి. వాతావరణ పరిస్థితులను బట్టి మరియు నేల స్వభావాన్ని బట్టి నీటి తడులు పెట్టాలి.

కలుపు యాజమాన్యం :– అట్రాజిన్ 4 గ్రా. లీటరు నీటిలో కలిపి మొలకరాక ముందే పిచికారి చేస్తే వెడల్పాకు కలుపు నివారించవచ్చును.

విత్తిన 20–25 రోజులకు 2,4–డి కలుపు మందును ఎకరాకు 500 గ్రా. 200 లీ. నీటిలో కలిపి పిచికారి చేసినచో వెడల్పాకు కలుపు మొక్కలను నివారించవచ్చును.

పంట కోత :– కండె పాలదశలో మొక్కజొన్నను పచ్చిమేతగా కోయాలి.

దిగుబడి:– ఎకారాకు వర్షాధార పంటలో 14–16 టన్నులు పచ్చిమేత దిగుబడి సాధించవచ్చును.

నీటిపారుదల పంట సుమారు 20–24 టన్నులు పచ్చిమేత దిగుబడి సాధించవచ్చును.

చొప్పను చిన్న చిన్న ముక్కలుగా చేసి మేపడం లాభదాయకం.

కండెదశలో సైలేజ్ కొరకు కోయవచ్చును.

ముడిమాంసకృతులు: 8-10%

దిగుబడి: వర్షాధారం - 14-16 టన్నులు / ఎకరా

నీటి వసతి క్రింద - 20-24 టన్నులు / ఎకరానికి వస్తుంది.

వానాకాలానికి అనువైన పశుగ్రాస అలసంద /బొబ్బర సాగు యాజమాన్యం

నేలలు: మధ్యస్థ ఎర్ర రేగడి మరియు నల్లరేగడి నేలలు అనుకూలం.

రకాలు: విజయ, బుందేల్ లోబియా-1, బుందేల్ లోబియా-2, ఐసి 4216, యుపిసి 5286 మరియు కెబిసి-2.

విత్తన సమయం:

ఖరీఫ్ / వానకాలం : జూన్ - జూలై

రబీ / యాసంగి : సెప్టెంబర్ - జనవరి

వేసవి:- జనవరి - మార్చి లో నీటి పారుదల క్రింద సాగు చేయవచ్చును.

విత్తన మోతాదు: 14 - 16 కిలోలు ఒక ఎకరానికి విత్తుకోవచ్చును.

విత్తే దూరం: సాలుకి సాలుకి మధ్య దూరం 30 సెం.మీ., మొక్కకు మొక్కకు మధ్య దూరం 10 సెం.మీ. మిశ్రమ పంటగా మొక్కజొన్న, జొన్న మరియు సజ్జతో సాగు చేయవచ్చు.

ఎరువుల యాజమాన్యం: ఆఖరి దుక్కిలో 2 టన్నులు / ఎకరానికి బాగా మాగిన పశువుల ఎరువు వేసుకోవాలి. ఆఖరి దుక్కిలో 8 కిలోల నత్రజని మరియు 16 కిలోల భాస్వరం వేసుకోవాలి.

నీటి యాజమాన్యం:- విత్తిన వెంటనే నీరు పెట్టుకోవాలి. విత్తిన 10 రోజుల తర్వాత పలుచటి నీటి తడి ఇవ్వాలి. తర్వాత వాతావరణ పరిస్థితులను మరియు నేల స్వభావాన్ని బట్టి నీటి తడి ఇవ్వాలి.

కలుపు యాజమాన్యం:- పెండిమిథాలిన్ ఎకరాకు 1.0 లీ. 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 24 - 48 గంటలలోపు పిచికారి చేయాలి.

పంట కోత: పచ్చిమేతగా 50% పూత దశలో పంటను కోయాలి. అనగా విత్తిన 55-60 రోజులకు కోయవలెను.

దిగుబడి: ఎకరాకు 8 - 10 టన్నులు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9959306929

జూన్ 2026 మాసంలో పి.జె.టి.ఎ.యు. వారి అగ్రికల్చర్ వీడియో యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేసిన నూతన వీడియోలు

క్ర.సం.	తేది	అంశం
1	04.06.2026	పశువులలో వేసవి తాపం - నివారణ పద్ధతులు
2	16.06.2026	62nd Foundation Day Photos
3	17.06.2026	62nd Foundation Day Keynote Address by prof. Madhura Swaminathan
4	20.06.2026	ప్రకృతి వ్యవసాయం యొక్క ప్రాముఖ్యత
5	24.06.2026	మొక్కజొన్న సాగుతో అధిక ఆదాయం
6	25.06.2026	ఎల్-నినో ప్రభావం ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలు

ఘనంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ 62వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 62వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను జూన్ 12న రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను పురస్కరించుకొని **"భారతదేశ హరిత విప్లవ సాధనలో నాటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ విశేష సేవలు"** అన్న అంశం పై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు శ్రీ తుమ్మల నాగేశ్వరరావు గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి గారు వ్యవస్థాపక దినోత్సవ ప్రసంగం చేశారు. భారత దేశ హరిత విప్లవ పితామహుడు ప్రొఫెసర్ ఎం.ఎస్. స్వామినాథన్ గారి కుమార్తె, ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్, బెంగళూరు, ప్రొఫెసర్ & హెడ్ మధుర స్వామినాథన్ కీలకోపన్యాసం చేశారు. మాజీ పార్లమెంటు సభ్యులు శ్రీ ఉండవల్లి అరుణ్ కుమార్, రాజేంద్రనగర్ శాసన సభ్యులు శ్రీ టి. ప్రకాశ్ గౌడ్, తెలంగాణ రైతు కమిషన్ చైర్మన్ శ్రీ ఎం. కోదండ రెడ్డితో పాటు పలువురు వక్తలు ఈ సందర్భంగా ప్రసంగించారు.

ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, ఉపకులపతి

గత 62 ఏళ్ళుగా వ్యవసాయ విశ్వవిద్యాలయం దేశ వ్యవసాయ రంగానికి అందించిన సేవలను, సాధించిన ప్రగతిని ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య వివరించారు. అందుకు సంబంధించిన వీడియోలని ప్రదర్శించారు.

శ్రీ తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ మంత్రివర్యులు

సాంకేతిక వ్యవసాయ పరిజ్ఞానానికి అగ్రి వర్సిటీ దిక్సూచి కావాలి. తెలంగాణకి, భారతదేశానికి గత 62 ఏళ్ళుగా ఈ విశ్వవిద్యాలయం అసమాన సేవలు అందిస్తోందని శ్రీ తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ మంత్రివర్యులు. అభినందించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చేతుల మీదుగా ప్రారంభం అయిన ఈ విశ్వవిద్యాలయం వివిధ పంటలలో రూపొందించిన సుమారు 525 వంగడాలు రైతుల మన్ననలు పొందాయన్నారు. ఇందిరాగాంధీ, స్వామినాథన్ వంటి ప్రముఖ శాస్త్రవేత్తల తోడ్పాటుతో అమలు చేసిన హరిత విప్లవం కారణంగా నేడు ఆహార ఉత్పత్తుల్ని ఎగుమతి చేసే స్థాయికి భారతదేశం ఎదిగింది. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. వరి, మొక్కజొన్న పంటల ఉత్పత్తిలో రాష్ట్రం రికార్డు సాధించిందన్నారు. తెలంగాణ వ్యవసాయం సాంకేతిక, విలువ ఆధారిత వ్యవసాయంగా పరిణామం చెందాలని అందుకు వ్యవసాయ విశ్వవిద్యాలయం దిక్సూచిగా ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు.

హరిత విప్లవంలో ఇందిరా గాంధీ పాత్ర అమోఘం – జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి

దేశం ఆహార భద్రత సాధించడంతోపాటు, నేడు ఆహార ధాన్యాలని ఎగుమతి చేసే స్థాయికి భారతదేశం చేరుకోవడానికి ఇందిరాగాంధీ అమలు చేసిన హరిత విప్లవం ప్రధాన కారణం అని అన్నారు. వ్యవసాయ వర్సిటీ వంటి సంస్థల స్థాపన అందుకు దోహదం చేసిందన్నారు. అయితే ఇప్పటికి అనేకమంది పోషకాహార లోపంతో ఉండటం దురదృష్టకరమన్నారు.

ఇందిరాగాంధీ పరిపాలన వ్యవసాయ రంగానికి స్వర్ణయుగం – శ్రీమతి మధురా స్వామినాథన్, ప్రొఫెసర్ & హెడ్, ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్, బెంగళూరు

హరిత విప్లవం తర్వాత భారతదేశంలో ఉత్పత్తి, దిగుబడులు బాగా పెరిగి ఎగుమతులు చేసే స్థాయికి ఎదిగామని ఆమె అన్నారు. వ్యవసాయ సంస్థలకి, పరిశోధనలకి ప్రభుత్వాలు విస్తృతంగా ప్రోత్సాహం ఇవ్వాలని మధురా స్వామినాథన్ సూచించారు. అదే విధంగా ఆహార ఉత్పత్తులలో మనదేశం స్వయం సమృద్ధి సాధించిన కారణంగా ఇతర దేశాలకి తోడ్పాటు అందించాలని అన్నారు.

శ్రీ ఉండవల్లి అరుణ్ కుమార్, మాజీ పార్లమెంటు సభ్యులు

భారతదేశం వ్యవసాయ ఆధారిత దేశం అని, అనేక ఆహార ఉత్పత్తులలో అధిక దిగుబడులు సాధిస్తున్నప్పటికీ నూనె గింజలు, పప్పుధాన్యాల ఉత్పత్తిలో కాస్త వెనుకబడి ఉన్నామని అన్నారు.

శ్రీ ఎం. కోదండ రెడ్డి, తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్

నేడు తెలంగాణలో కూరగాయలు, పూలు, చిరు, తృణ ధాన్యాల సాగు బాగా తగ్గిపోయిందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు పంట మార్పిడి పైన రైతులని చైతన్యవంతులని చేయాలని అభిప్రాయపడ్డారు.

టి. ప్రకాష్ గౌడ్, రాజేంద్రనగర్ శాసన సభ్యులు

ఎంతో పేరున్న విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్‌లో ఉండటం తమకెంతో గర్వ కారణం అని కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రకాశ్ గౌడ్ గారు అన్నారు.

ఈ సందర్భంగా హరిత విప్లవ సాధనలో ఇందిరాగాంధీ పాత్ర అన్న అంశం పైన ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య రచించిన పుస్తకాన్ని అతిథులు విడుదల చేశారు. తెలంగాణ విజన్ -2047, పిజెటిఏయు విజన్-2047 పుస్తకాలను కూడా అతిథులు ఆవిష్కరించారు.

వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ వ్యవసాయ విధానాలతో సాగు చేస్తున్న రైతులకు, అత్యుత్తమ సేవలు అందించిన బోధన, బోధనేతర సిబ్బంది, శాస్త్ర వేత్తలకి అవార్డులు అందచేశారు. అగ్రికల్చర్ డిప్లమాలో అత్యధిక ఓవరాల్ గ్రేడ్ పాయింట్ ఏవరేజ్ సాధించిన తెలుగు శ్రీలక్ష్మి కి దివంగత డా॥ ఆలపాటి అప్పారావు బంగారు పతకం అందచేశారు.

వ్యవసాయ పదవినోదం

కూర్పు : డా॥ ఆర్. సునిత దేవి



అడ్డం

1. సూక్ష్మజీవుల ద్వారా ఉత్పత్తి అయ్యే ఎరువు ఏది? (6)
2. ఏ హార్మోన్ పండ్ల పక్వాన్ని ప్రోత్సహిస్తుంది? (ఎడమ నుండి కుడికి) (4)
4. "బంగారు పీచు" అని ఏ పంటను పిలుస్తారు? (5)
6. ఎల్‌నినో సాధారణంగా భారతదేశంలో ....కు కారణమవుతుంది? (3)
7. పరాగ సంపర్కంలో ఏ కీటకం సహాయపడుతుంది? (4)
9. వ్యవసాయ మరియు నిల్వ ప్రదేశాలలో ఎలుకలను నియంత్రించడానికి ఉపయోగించే మందు? (కుడి నుండి ఎడమకు) (6)
12. పప్పు జాతి పంటలకు ప్రత్యేకంగా ఉపయోగించే ప్రాథమిక నత్రజని స్థాపక జీవన ఎరువు ఏది? (4)
13. తీగ జాతి కూరగాయలను ఆశించి నష్టం కలుగజేస్తాయి. ఈ పురుగు నివారణకు విషపు ఎరను తయారు చేసి పొలంలో అక్కడక్కడ పెట్టాలి. ఏ పురుగు? (4)

నిలువు

2. రసం పీల్చే కీటకాల నివారణకు సాధారణంగా ఉపయోగించే పురుగు మందు ఏది? (6)
3. భారతదేశంలో అత్యధిక నూనెగింజల ఉత్పత్తి చేసే రాష్ట్రం ఏది? (క్రింది నుండి పైకి) (4)
5. ఏ పంట సహజంగా నత్రజనిని స్థిరీకరిస్తుంది? (క్రింది నుండి పైకి) (5)
6. పసుపులో లభ్యమయ్యే సహజ రసాయన సమ్మేళనం ఏది? (4)
8. దశేరి, బంగినపల్లి రకాలు ఏ పండ్లకు సంబంధించినవి? (3)
10. పోషకాలను గ్రహించడంలో వేర్లకు సహాయపడే ప్రయోజనకరమైన శిలీంధ్రాలను ఏమంటారు? (4)
11. టమాటాలో ఏ ధాతులోపం వలన కాయ ఎండు తెగులు వస్తుంది? (3)

సమాధానాలు 34వ పేజీలో

నైరుతి ఋతుపవనాలపై ఎల్-నినో ప్రభావం - పత్తి పంట యాజమాన్యం

డా॥ ఎస్. జి. మహాదేవప్ప, డా॥ బి. బాలాజీ నాయక్ మరియు డా॥ బి. రామ్ ప్రసాద్

వ్యవసాయ వాతావరణ పరిశోధనా విభాగం, డిజిటల్ సాంకేతిక మరియు వ్యవసాయ కేంద్రం

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్

ప్రపంచ వాతావరణ సంస్థ (WMO) మరియు భారత వాతావరణ విభాగం (IMD) వారి వాతావరణ అంచనాల ప్రకారం, ఖరీఫ్ సీజన్లో ఎల్ నినో ప్రభావముంది. దీని కారణంగా ఆగస్టు నుండి సెప్టెంబర్ మధ్య బలమైన ఎల్ నినో రావడానికి 36-43% అవకాశముంది. సెప్టెంబర్ నెలలో చాలా బలమైన ఎల్ నినో రావడానికి 26% అవకాశం ఉంది. తర్వాత నవంబర్ 2026 నుండి జనవరి 2027 మధ్యలో చాలా బలమైన ఎల్ నినో రావడానికి 63% అవకాశం ఉంది.

ఎల్ నినో ఏర్పడటం వల్ల వర్షాభావ పరిస్థితులు మరియు అసమాన వర్షపాతం వల్ల పంటల పెరుగుదల మరియు దిగుబడులపై తీవ్ర దుష్ప్రభావాన్ని కలిగిస్తాయి. ఈ పరిస్థితుల్లో మన రాష్ట్రంలో ప్రధాన వాణిజ్య పంట అయిన పత్తి పంటపై ఎల్నినో ప్రభావం కారణంగా పంట నష్టం లేదా దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో సాధారణ దిగుబడులు సాధించడానికి ఈ క్రింద సూచించిన మేలైన యాజమాన్య పద్ధతులను పాటించాలి.

హైబ్రిడ్లు / రకాల ఎంపిక: తక్కువ లేదా మధ్యస్థ కాలపరిమితి గల హైబ్రిడ్లు / రకాలను ఎంపిక చేయాలి.

విత్తనాలు వేయడానికి నియమాలు :

- జూలై 20వ తేదీ వరకు విత్తనాలు వేయవచ్చు.
- కింద తెలిపిన "**విత్తనాలు వేసే నియమం**" ప్రకారం విత్తనాలు వేయాలి.

ఎ) నల్ల రేగడి నేలలు: రుతుపవనాల ప్రారంభం తరువాత ఒక వారంలో మొత్తం 60-75 మి.మీ. వర్షపాతం నమోదైతే విత్తనాలు వేయాలి.

బి) తేలికపాటి నేలలు: రుతుపవనాల ప్రారంభం తరువాత ఒక వారంలో మొత్తం 50-60 మి.మీ. వర్షపాతం నమోదైతే విత్తనాలు వేయాలి.

నేల తయారీ :

- వర్షపు నీరు సులువుగా భూమిలో ఇంకడానికి మరియు గట్టి నేల పొరలను విచ్ఛిన్నం చేయడానికి లోతుగా దున్నాలి. అనంతరం రోటావేటర్తో నేలను మెత్తగా తయారు చేయాలి.
- వర్షపు నీటి ప్రవాహాన్ని తగ్గించి, భూమిలో ఇంకడానికి మరియు నేలలో తేమ శాతం పెంచేందుకు చిన్న చిన్న గట్లు లేదా కాంటూర్ గట్లు లేదా కంపార్ట్మెంట్ బండింగ్ ఏర్పాటు చేయాలి.
- నల్ల రేగడి నేలల్లో తేమ సంరక్షణ కోసం 120 సెం.మీ. వెడల్పు గల ఎత్తు బోదెలు (Broad Beds) మరియు 60 సెం.మీ. వెడల్పు, 30 సెం.మీ. లోతు గల కాలువలు (Furrows) ఏర్పాటు చేయాలి.
- మధ్యస్థ లేదా తేలికపాటి నేలల్లో బోదేలు మరియు కాలువలు లేదా ఎత్తు బోదెలు (Broad Beds) మరియు కాలువలు (Furrows) పద్ధతులను అనుసరించాలి.

- 1% కన్నా తక్కువ నేల వాలు ఉన్న పొలాల్లో మధ్యస్థ నేలలకు 6 మీ × 6 మీ. మరియు లోతైన నల్ల రేగడి నేలలకు 8 మీ × 5 మీ. పరిమాణంలో కంపార్ట్మెంట్ గట్లు ఏర్పాటు చేయాలి.
- విత్తిన 25–30 రోజుల తరువాత వాలుకు అడ్డంగా ప్రతి 3.6 మీటర్లకు ఒక లోతైన సాలు లేదా తేమ సంరక్షణ కాలువలు తీయాలి.

మొక్కల సాంద్రత:

- తేలికపాటి నేలల్లో 90 సెం.మీ. × 60 సెం.మీ. మరియు బరువైన నేలల్లో 90–120 సెం.మీ. × 60–90 సెం.మీ. ఎడంతో విత్తు కోవాలి.
- నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి మరియు వర్షాభావ ప్రమాదాన్ని తగ్గించడానికి పత్తితో పాటు పప్పుధాన్య పంటలను అంతర పంటలుగా సాగు చేయాలి.
    - పత్తి + కందులు (4:1 లేదా 6:1)
    - పత్తి + అలసందలు (1:2)

పోషకాల యాజమాన్యం:

- సేంద్రియ ఎరువులు నేలలో తేమను ఎక్కువకాలం నిల్వ ఉంచడంతో పాటు నేల సారాన్ని పెంచుతాయి. కావున నేల తయారీ సమయంలో ఎకరానికి 4 టన్నులు పశువుల ఎరువు (FYM) లేదా ఎకరానికి 2 టన్నుల కోళ్ల ఎరువు లేదా గొర్రెల ఎరువు వేయాలి.
- సిఫారసు చేసిన మోతాదులో ఎకరానికి 48-24-24 కిలోల నత్రజని, భాస్వరం, పొటాషియం ఎరువులు వేయాలి.
- పొటాషియం తగిన మోతాదులో అందేలా చూడాలి. ఇది నీటి వినియోగ సామర్థ్యాన్ని మరియు వర్షాభావ పరిస్థితులను తట్టుకునే శక్తిని పెంచుతుంది.
- మట్టి పరీక్షల్లో బోరాన్, జింక్ వంటి సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించినట్లయితే సరిచేయాలి.
- అధిక నత్రజని ఎరువుల వాడకాన్ని నివారించాలి. ఇవి అధిక శాఖీయ పెరుగుదలను ప్రోత్సహించి నీటి అవసరాన్ని అధికం చేస్తాయి, తద్వారా పంట త్వరగా బెట్టకు గురి అవుతుంది.

కలుపు నివారణ:

- విత్తిన తరువాత 60–70 రోజుల వరకు పంటను కలుపు రహితంగా ఉంచాలి.
- కలుపు నియంత్రణ కోసం విత్తిన 24–48 గంటల్లోపు పెండిమెథలిన్ ఎకరాకు 1.2 లీటర్లు చొప్పున 200 లీటర్లు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- పైరు మొలచిన అనంతరం గడ్డి మరియు వెడల్పాటి ఆకుల కలుపు నియంత్రణ కోసం ఎకరాకు క్విజాలోఫాప్-ఇథైల్ 5% EC @ 250 మి.లీ. మరియు పైరిథియోబాక్ సోడియం 10% EC @ 250 మి.లీ. 200 లీటర్లు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యేక యాజమాన్య సూచనలు

ప్రారంభ దశ కరువు (Early Season Drought):

విత్తిన తరువాత 15–20 రోజుల పాటు వర్షాభావం ఉండి మొలకలు సరిగా రాకపోతే కింది చర్యలు చేపట్టాలి:

- తరచుగా అంతర కృషి చేసి నేలపై మల్చింగ్ పొర ఏర్పడేలా చేయాలి.
- పంట అవశేషాలు లేదా సేంద్రియ మల్చును ఉపయోగించి నేల నుండి నీటి ఆవిరిని తగ్గించాలి.
- వర్షాల ద్వార నేలలో తగినంత తేమ ఏర్పడే వరకు ఎరువుల వాడకాన్ని వాయిదా వేయాలి.
- సకాలంలో రసం పీల్చే పురుగుల నియంత్రణ చర్యలు చేపట్టాలి.
- బెట్ట పరిస్థితుల్లో 2% యూరియా ద్రావణాన్ని 10–15 రోజుల వ్యవధిలో 2–3 సార్లు పిచికారీ చేయాలి.
- వర్షం వచ్చిన వెంటనే హెక్టారుకు 20 కిలోల నత్రజని అదనంగా వేయాలి.
- పరిమిత నీటి వసతులు ఉన్నప్పుడు గూడలు ఏర్పడే దశ, పుష్పించే దశ మరియు కాయ అభివృద్ధి దశలో నీటితడులు ఇవ్వడానికి ప్రాధాన్యం ఇవ్వాలి.
- మెరుగైన మొలకలు మరియు ప్రారంభ పెరుగుదల కోసం విత్తన సాళ్ళల్లో మాత్రమే నీటితడులు ఇవ్వాలి.
- పరిమిత నీటి వనరులు ఉన్నప్పుడు సాలు విడిచి సాలుకు నీటిపారుదల (Skip Row Irrigation) చేయాలి.

మధ్య దశ కరువు (Mid-Season Drought)

పంట శాఖీయ పెరుగుదల దశ నుండి పుష్పించడం మరియు కాయ ఏర్పడే దశ వరకు కరువు ఏర్పడితే:

- తరచుగా అంతర కృషి చేసి కలుపు నియంత్రణతో పాటు తేమను సంరక్షించాలి.
- బెట్ట పరిస్థితుల్లో 2% యూరియా ద్రావణం తరువాత 1% పొటాషియం నైట్రేట్ (KNO_3) ద్రావణంను 10 రోజుల వ్యవధిలో 2–3 సార్లు పిచికారీ చేయాలి.

- వర్షాల ద్వార నేలలో తగినంత తేమ ఏర్పడే వరకు ఎరువుల వాడకాన్ని వాయిదా వేయాలి.
- సరిపడ వర్షం వచ్చిన వెంటనే హెక్టారుకు 20 కిలోల నత్రజని అదనంగా వేయాలి.
- పరిమిత నీటి వనరులు ఉన్నప్పుడు సాలు విడిచి సాలుకు నీటిపారుదల (Skip Row Irrigation) చేయాలి.
- నీటి లభ్యత చాలా తక్కువగా ఉన్నప్పుడు పుష్పించే దశ మరియు కాయ అభివృద్ధి దశలో నీటితడులు ఇవ్వాలి.

చివరి దశ కరువు (Terminal Drought):

కాయ అభివృద్ధి నుండి కాయ పగిలే దశ వరకు రుతుపవనాలు ముందుగానే ఉపసంహరించుకోవడం వల్ల బెట్ట ఏర్పడితే:

- 2% యూరియా ద్రావణం తరువాత 1% పొటాషియం నైట్రేట్ (KNO_3) ద్రావణంను 10 రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారీ చేయాలి.
- పరిమిత నీటి వనరులు ఉన్నప్పుడు సాలు విడిచి సాలుకు నీటిపారుదల (Skip Row Irrigation) చేయాలి.
- నీటి లభ్యత చాలా తక్కువగా ఉన్నప్పుడు కాయ అభివృద్ధి దశలో ఒక నీటి తడి ఇవ్వాలి.

బెట్ట పరిస్థితుల్లో చీడపీడల యాజమాన్యం:

దీర్ఘకాలిక వర్షాభావ పరిస్థితుల్లో రసం పీల్చే పురుగులైన పేను బంక, తామర పురుగులు మరియు తెల్లదోమ అధికంగా వ్యాపించే అవకాశం ఉంటుంది. పంట దశను బట్టి కింద పేర్కొన్న నియంత్రణ చర్యలు చేపట్టాలి

మొలక దశ:

- పొడి వాతావరణంలో తామర పురుగులు మరియు పేను బంక మొక్కల ఎదుగుదలను దెబ్బతీస్తాయి. నివారణ చర్యగా 5 మి.లీ. వేపనూనె లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- పురుగు ఉధృతి మోస్తరు స్థాయిలో ఉంటే 2 మి.లీ. ఫిప్రోనిల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఒకవేళ పురుగు ఉధృతి తీవ్రంగా ఉంటే 0.3 గ్రా. ఫ్లోనికామైడ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- రసం పీల్చే పురుగుల నియంత్రణ కోసం ఎకరాకు 10-15 పసుపు లేదా నీలం రంగు జిగురు అట్టలు మరియు ఎకరాకు 1-2 సౌర కాంతి ఉచ్చులు (Solar Light traps) ఏర్పాటు చేయాలి.
- నేలలో అధిక తేమ వల్ల వేరు కుళ్ళ వ్యాధి వచ్చే అవకాశం ఉంటుంది. నివారణకు 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 1 గ్రా. కార్బెండాజిమ్ మందును లీటరు నీటికి కలిపి మొక్క చుట్టూ నేల తడపాలి.

పంట శాఖీయ పెరుగుదల దశ నుండి పుష్పించడం మరియు కాయ ఏర్పడే దశ వరకు:

- పొడి వాతావరణంలో తామర పురుగులు మరియు పేను బంక మొక్కల ఎదుగుదలను దెబ్బతీస్తాయి. నివారణ చర్యగా వేపనూనె @ 5 మి.లీ./లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- పురుగు ఉధృతి మోస్తరు స్థాయిలో ఉంటే 2 మి.లీ. ఫిప్రోనిల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఒకవేళ పురుగు ఉధృతి తీవ్రంగా ఉంటే 0.3 గ్రా. ఫ్లోనికామైడ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- రసం పీల్చే పురుగుల నియంత్రణ కోసం ఎకరాకు 10-15 పసుపు లేదా నీలం రంగు జిగురు అట్టలు మరియు ఎకరాకు 1-2 సౌర కాంతి ఎరలు (Solar Light traps) ఏర్పాటు/ఎరలు చేయాలి.
- విత్తిన 30-45 రోజుల తరువాత మోనోక్రోటోఫాస్ మరియు నీరు మందు మిశ్రమంను 1:4 నిష్పత్తిలో కలిపి మృదువైన బ్రష్ తో కాండం పూత (Stem Application) చేయాలి. విత్తిన 60 రోజుల తరువాత ఇమిడాక్లోప్రిడ్ మరియు నీరు మందు మిశ్రమంను 1:20 నిష్పత్తిలో కలిపి కాండం పూత చేయాలి.
- ఆగస్టు మొదటి వారంనుంచి పొడి వాతావరణం గులాబీ రంగు కాయతొలిచే పురుగు (Pink Bollworm) ఉధృతికి అనుకూలంగా ఉంటుంది. పర్యవేక్షణ కోసం ఎకరాకు 4 లింగాకర్షక బుట్టలు ఉచ్చులు (Pheromone Traps) ఏర్పాటు చేయాలి. గుడ్డి పువ్వులు కనిపించడం గులాబీ రంగు కాయతొలిచే పురుగు ఆశించినట్లుగా సంకేతంగా గుర్తించాలి.
- గులాబీ రంగు కాయతొలిచే పురుగు నియంత్రణ కోసం వేపనూనె 1500 ppm @ 5 మి.లీ./లీటరు నీటికి పిచికారీ చేయాలి. అవసరమైతే 1.5 గ్రా. థయోడికార్బ్ లేదా 0.5 గ్రా. ఎమామెక్టిన్ బెంజోయేట్ లేదా 2.0 మి.లి. ప్రొఫెనోఫాస్ మందును లీటరు నీటికి పిచికారీ చేయాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9492359789

విత్తనం విత్తే యంత్రాలు: రకాలు, ప్రయోజనాలు, వినియోగం

డా॥ డి. అనిల్ కుమార్, డా॥ పి. రాజయ్య, డా॥ సి. హెచ్. శ్రావణ్ కుమార్, డా॥ ఆర్. జయప్రకాష్, బి. లక్ష్మణ్ మరియు ఎ. ప్రమోద్ రెడ్డి

ఎ.ఐ.సి.ఆర్.పి. వ్యవసాయ పరికరములు మరియు యంత్రముల విభాగం, రాజేంద్రనగర్

వ్యవసాయంలో సరైన సమయంలో విత్తనాలు విత్తటం అనేది పంట దిగుబడిని నిర్ణయించే అత్యంత ముఖ్యమైన దశలలో ఒకటి. విత్తనాలను సరైన లోతులో, సమాన దూరంలో విత్తడం వల్ల మొలక శాతం పెరిగి, మొక్కలు ఆరోగ్యంగా ఎదిగి అధిక దిగుబడిని అందిస్తాయి. అయితే సాంప్రదాయ పద్ధతిలో చేతితో విత్తనాలను చల్లడం వల్ల విత్తనాల వృథా ఎక్కువగా ఉండటమే కాకుండా, మొక్కల మధ్య సమాన దూరం పాటించడం కష్టమవుతుంది, విత్తనాలు సమాన లోతులో విత్తబడవు. దీనివల్ల పంట పెరుగుదల అసమానంగా ఉండి, దిగుబడిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంటుంది.

ఇలాంటి సమస్యలను అధిగమించడానికి వ్యవసాయ యంత్రాలు, పరికరాల వినియోగ అవసరం ఎంతో ఉంది. రైతులకు శ్రమను తగ్గించి, సమయాన్ని ఆదా చేయడంతో పాటు ఉత్పాదకతను పెంచడంలో ఈ యంత్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి.

యంత్రాలను ఉపయోగించటం వలన కలిగే లాభాలు:

- తక్కువ సమయంలో ఎక్కువ భూమిలో విత్తవచ్చు.
- కూలీల ఖర్చు తగ్గుతుంది.
- తేమశాతం అధికంగా ఉన్నప్పుడే విత్తటం వలన మొలకెత్తే శాతం పెరుగుతుంది.
- సిఫార్సు చేసిన మోతాదు విత్తనాలను విత్తవచ్చు. దాని వలన విత్తనాల వృథా తగ్గుతుంది.

విత్తనాలు విత్తడానికి ఉపయోగించే వివిధ రకాల పరికరాలు

విత్తనం వేయు గొర్రు పరికరము (సీడ్ డ్రిల్)

విత్తనం వేయు గొర్రు పరికరమును చిన్న విత్తనాలు విత్తటానికి ఉపయోగిస్తారు. సీడ్ డ్రిల్‌లో వరుసల మధ్య దూరం కావాల్సిన రీతిలో మార్చుకోవచ్చు. యంత్రం ట్రాక్టర్‌తో లాగబడుతున్నంత సేపు గ్రౌండ్ వీల్ నేల పైన తిరుగుతుంది. ఈ చక్రం తిరగడం వల్ల దానికి అనుసంధానించబడి ఉండే మీటరింగ్ మెకానిజం పనిచేసి, విత్తనాలు రబ్బరు పైపుల గుండా సాళ్ల మధ్యలో సమానమైన దూరంలో పడేలా నియంత్రిస్తుంది. విత్తనం విత్తిన వెంటనే మట్టి కప్పుటకు యంత్రం వెనుక భాగంలో ఒక బ్లేడ్ అమరిక ఉంటుంది. సీడ్ మీటరింగ్ మెకానిజంను మార్చటం వలన వివిధ పంటలకు ఉపయోగించవచ్చు. కందులు, పెసర, వరి వంటి పంటలను విత్తుటకు ఉపయోగిస్తారు.

విత్తనం, ఎరువు వేయు గొర్రు పరికరము (సీడ్ కమ్ ఫెర్టిలైజర్ డ్రిల్)

విత్తనం, ఎరువు వేయు గొర్రు పరికరములో విత్తనాలు, ఎరువులు నిల్వ ఉంచటానికి వేరువేరు డబ్బాలు ఉంటాయి. విత్తనాలు, ఎరువులను క్రమ పద్దతిలో నేలలో జారవిడుచుటకు వేర్వేరు మీటరింగ్ చక్రాలు ఉంటాయి. గ్రౌండ్ వీల్ తిరగటం వలన విత్తనాలు, ఎరువులు మీటరింగ్ చక్రాల సహాయంతో వేర్వేరు రబ్బరు పైపుల గుండా సాళ్ల మధ్యలో జారవిడవబడుతాయి. ఈ యంత్రం వెనుకాల మట్టి కప్పుటకు ఒక బ్లేడ్ అమరిక ఉంటుంది.

సీడ్ ప్లాంటర్

సీడ్ ప్లాంటర్‌ను పెద్ద విత్తనాలు విత్తటానికి ఉపయోగిస్తారు. దీనిలో కూడా సీడ్ డ్రిల్‌లాగే వరుసల మధ్య దూరం కావాల్సిన రీతిలో మార్చుకోవచ్చు. అయితే ఇందులో ఉపయోగించే సీడ్ మీటరింగ్ మెకానిజం ద్వారా విత్తనాల మధ్య దూరాన్ని నియంత్రించవచ్చు. ప్లాంటర్‌లో సమాంతర, నిలువు, వాలుగా ఉండే ప్లేట్లను ఉపయోగిస్తారు. ఈ ప్లేట్ల వలన ఒకటి లేదా రెండు విత్తనాలు మాత్రమే నేలలోకి జారవిడవబడతాయి. ఒక్కో పంటకు ఒక్కో రకమైన చక్రం వాడుతారు. వివిధ పంటలకు ఉపయోగించే ప్లేట్లను తయారిదారులు యంత్రంతో పాటు అందిస్తారు. ఈ యంత్రాలను 35 లేదా అంతకంటే ఎక్కువ అశ్వశక్తి గల ట్రాక్టర్‌తో నడపవచ్చు. వీటితో రోజుకు 4-5 హెక్టార్లలో విత్తవచ్చు. మార్కెట్లో ఎక్కువగా 9 సాళ్ల వరుసల యంత్రాలు లభ్యమవుతున్నాయి. సీడ్ ప్లాంటర్ ద్వారా మొక్కజొన్న, వేరుశనగ వంటి విత్తనాలు విత్తుకోవచ్చు.

ప్రెసిషన్ ప్లాంటర్

ప్రెసిషన్ ప్లాంటర్ అనేది ఆధునిక వ్యవసాయంలో విత్తనాలను ఖచ్చితమైన దూరం, లోతు, వరుసలలో సమానంగా విత్తేందుకు ఉపయోగించే యంత్రం. ఈ యంత్రంలో ప్రధాన ఫ్రేమ్, విత్తన డబ్బాలు, సీడ్ మీటరింగ్ వ్యవస్థ, సాళ్ళు చేయు పళ్ళ చక్రాలు (ఫర్రో ఓపెనర్), సీడ్ ట్యూబ్, లోతు నియంత్రణ చక్రాలు, కవరింగ్ పరికరాలు, ప్రెస్ వీల్స్ వంటి ముఖ్య భాగాలు ఉంటాయి. ప్రధాన ఫ్రేమ్‌పై అమర్చిన విత్తన డబ్బాలలో నిల్వ చేసిన విత్తనాలను సీడ్ మీటరింగ్ వ్యవస్థ ఒక్కొక్కటిగా లేదా నిర్దిష్ట వ్యవధిలో విడుదల చేస్తుంది. ఆధునిక న్యూమాటిక్ ప్రెసిషన్ ప్లాంటర్లలో గాలి పీడనం లేదా వాక్యూమ్ సహాయంతో విత్తనాలను హాపర్ నుండి ఎంచుకొని, సరైన దూరం, లోతులో ఖచ్చితంగా నేలలో వేస్తుంది. విడుదలైన విత్తనాలు సీడ్ ట్యూబ్ ద్వారా ఫర్రో ఓపెనర్ తయారుచేసిన సాలులో పడతాయి. గేజ్ వీల్స్ లేదా లోతు నియంత్రణ చక్రాలు విత్తనాలు ఒకే లోతులో పడేలా నియంత్రిస్తాయి. అనంతరం కవరింగ్ పరికరాలు విత్తనాలపై మట్టిని కప్పగా, ప్రెస్ వీల్స్ మట్టిని స్వల్పంగా నొక్కి విత్తనం-నేల మధ్య మంచి సంబంధాన్ని ఏర్పరుస్తాయి.

న్యూమాటిక్ ప్రెసిషన్ ప్లాంటర్లు అధిక ఖచ్చితత్వం, వివిధ రకాల, పరిమాణాల విత్తనాలను నిర్వహించగల సామర్థ్యం, అధిక వేగంతో పని చేసే సామర్థ్యం మరియు విత్తనాలకు తక్కువ నష్టం కలిగించడం వంటి ప్రత్యేక లక్షణాలను కలిగి ఉంటాయి.

ఆధునిక ప్లాంటర్లలో ఎరువుల తొట్టి, మీటరింగ్ యూనిట్, ఎలక్ట్రానిక్ డ్రైవ్ వ్యవస్థ, జి.పి.ఎస్ ఆధారిత మానిటరింగ్, నియంత్రణ వ్యవస్థలు కూడా అమర్చబడి ఉంటాయి. ఈ యంత్రాలను ప్రధానంగా మొక్కజొన్న, సోయాబీన్, పొద్దుతిరుగుడు, ప్రత్తి వంటి వరుస పంటలలో విస్తృతంగా ఉపయోగిస్తున్నారు.

ఈ భాగాలు, సాంకేతిక వ్యవస్థల సమన్వయంతో ప్రెసిషన్ ప్లాంటర్ విత్తనాలను అత్యంత ఖచ్చితత్వంతో విత్తి, విత్తన పొదుపు, సమాన మొక్కల జనాభా వల్ల అధిక దిగుబడులను సాధించడంలో రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఎక్కువ సాగు, ఆర్థిక సామర్థ్యం ఉన్న రైతులు వీటిని కొనుగోలు చేసి తమ పనులకు వాడుకోవటంతో పాటు ఇతర రైతులకు అద్దెకు ఇవ్వడం ద్వారా పెట్టుబడిని త్వరగా తిరిగి పొందవచ్చు. ఈ యంత్రం ట్రాక్టర్ కి అనుసంధానించి నడుపవలసి ఉంటుంది. ట్రాక్టర్ కి తప్పనిసరిగా డ్యూయల్ క్లచ్ కలిగి ఉండాలి.

చేతితో నడిచే పోర్టబుల్ సీడర్ - చిన్న రైతులకు ఉపయోగకరమైన విత్తనాలు విత్తే యంత్రం

చేతితో నడిచే పోర్టబుల్ సీడర్ అనేది మానవ శక్తితో పనిచేసే తక్కువ బరువు కలిగిన విత్తనాలు విత్తే యంత్రం. ఇది చిన్న, పెద్ద వ్యవసాయ క్షేత్రాలతో పాటు కూరగాయల తోటలు, పూల తోటలు, కిచెన్ గార్డెన్ లలో కూడా ఉపయోగించడానికి అనుకూలంగా ఉంటుంది. రైతు యంత్రాన్ని ముందుకు నెట్టినప్పుడు, చక్రాల కదలిక ద్వారా విత్తనాల పంపిణీ వ్యవస్థ పనిచేసి, విత్తనాలను నిర్ణీత దూరం, లోతులో వేస్తుంది. అనంతరం విత్తనాలపై మట్టిని కప్పి, స్వల్పంగా ఒత్తడం ద్వారా విత్తనాలు మట్టితో బాగా కలిసేలా చేస్తుంది. దీని వల్ల విత్తనాలకు తగిన తేమ లభించి, సమానంగా మొలకెత్తే అవకాశం పెరుగుతుంది.

ఈ యంత్రంలో విత్తనాలను నిల్వ చేసే సీడ్ హాపర్, విత్తనాలను క్రమపద్ధతిలో విడుదల చేసే మీటరింగ్ వ్యవస్థ, విత్తనాలను నేల లోపల వేసే పళ్ళు, మట్టితో కప్పే చక్రం వంటి ప్రధాన భాగాలు ఉంటాయి. విత్తనాల పంపిణీ, విత్తనాలు సాలులో వేసే వ్యవస్థలో రెండు ఉక్కు పలకలు, వాటికి అనుసంధానించబడిన స్ప్రింగ్ ఆధారిత ఆపరేటింగ్ లివర్‌తో రూపొందించబడింది. ఈ స్ప్రింగ్ లోడెడ్ లివర్ విత్తనాల మీటరింగ్ వ్యవస్థతో యాంత్రికంగా అనుసంధానించబడి ఉంటుంది. యంత్రాన్ని ఆపరేటర్ ముందుకు నెట్టినప్పుడు, ఉక్కు పలకలు నేలలోకి చొచ్చుకుపోయి సన్నని గాడిని ఏర్పరుస్తాయి.

అదే సమయంలో ఈ పలకల కదలిక స్ప్రింగ్ ఆధారిత లివర్‌ను ప్రేరేపించి, దాని ద్వారా విత్తనాల మీటరింగ్ వ్యవస్థ పనిచేస్తుంది. మీటరింగ్ వ్యవస్థ ముందుగా నిర్ణయించిన పరిమాణంలో విత్తనాలను విడుదల చేస్తుంది. విడుదలైన విత్తనాలు ఉక్కు పలకల మధ్యగా ప్రయాణించి ఏర్పడిన గాడిలో పడతాయి. విత్తనాలు గాడిలో పడిన అనంతరం యంత్రం ముందుకు కదులుతుండగా స్ప్రింగ్ వ్యవస్థ ప్రభావంతో ఉక్కు పలకలు తిరిగి యథాస్థితికి చేరుకుంటాయి. ఈ ప్రక్రియలో విత్తనాలపై మట్టి కప్పబడుతుంది. దీనివల్ల విత్తనాలు తగిన తేమను గ్రహించి మెరుగైన మొలక శాతాన్ని సాధిస్తాయి. గాడి ఏర్పరచడం, విత్తనాలను నిర్దిష్ట పరిమాణంలో వేయడం, గాడిని మట్టితో మూసివేయడం వంటి మూడు ప్రక్రియలు ఒకే ఆపరేషన్‌లో సమన్వయంతో జరుగుతాయి. ఫలితంగా విత్తనాలు సమాన దూరంలో పంపిణీ చేయబడి, విత్తనాల వృథా తగ్గి, విత్తడం మరింత సమర్థవంతంగా నిర్వహించబడుతుంది. ఈ యంత్రంతో ఒకేసారి సుమారు 4 కిలోగ్రాముల విత్తనాలను నిల్వ చేసుకుని విత్తవచ్చు. వివిధ రకాల విత్తనాల పరిమాణాలకు అనుగుణంగా సీడ్ ప్లేట్లను మార్చుకునే సౌకర్యం ఉండటం వల్ల ఒకే యంత్రాన్ని అనేక పంటలకు ఉపయోగించవచ్చు.

ఈ సీడర్ ద్వారా మొక్కజొన్న, వేరుశెనగ, బీన్స్, ప్రత్తి, మరియు ఇతర కూరగాయల విత్తనాలను సులభంగా విత్తవచ్చు. సీడర్ వినియోగం వల్ల రైతులు తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో విత్తనాలను విత్తగలుగుతారు. విత్తనాల వృథా తగ్గి, శ్రమ, సాగు ఖర్చులు ఆదా అవుతాయి. ఇంధనం అవసరం లేకుండా పూర్తిగా మానవ శక్తితో పనిచేయడం వల్ల ఇది పర్యావరణ హిత వ్యవసాయ పరికరంగా కూడా గుర్తింపు పొందింది. తక్కువ ధర, సులభమైన నిర్వహణ, ఖచ్చితమైన విత్తకం, తక్కువ బరువు, బహుళ పంటలకు అనుకూలత వంటి ప్రత్యేక లక్షణాల వల్ల చేతితో నడిచే పోర్టబుల్ సీడర్ చిన్న, మధ్య తరహా రైతులకు అత్యంత ప్రయోజనకరమైన వ్యవసాయ యంత్రంగా మారింది.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8555995273

28వ పేజీలోని పదవినోదం సమాధానాలు

1 జీ	వ	ఎ	రు	వు	లు			న్	లీ	థి	ఇ 2
					న్యా			స్థా			మి
					ధా			జ			డా
					ప్పు			3 రా			క్లో
			4 జ	న	5 ప	నా	ర				ప్రి
6 క	రు	వు									డ్
ర్కు			7 తే	నె	టీ	గ					
మి											
న్	లో	యో	డి	8 మా	9 బ్రో		10 మై			11 కా	
				మి			కో			ల్షి	
				డి			12 రై	జో	బి	యం	
13 పం	డు	ఈ	గ				జా				

టమాటలో పురుగుల నివారణ, పురుగుమందుల అవశేషాలు మరియు పంటకోత కాలాల ప్రాముఖ్యత

డా॥ కె. వాణిశ్రీ, డా॥ జి. శ్రీదేవి, డా॥ ఎస్. ఉపేంధర్, డా॥ యం. రాజశేఖర్, డా॥ సి. స్వాతి, డా॥ డి. రాకేశ్, డా॥ యం. అరుణ మరియు డా॥ బి. అపర్ణ

అఖిల భారత సస్యరక్షణ మందుల అవశేషాల పరిశోధన విభాగం, రాజేంద్రనగర్

టమాట భారతదేశంలో అత్యంత విస్తృతంగా సాగు చేసే కూరగాయల పంటలలో ఒకటి. ప్రతి ఇంటి వంటగదిలో రోజూవారిగా ఉపయోగించే ఈ పంట రైతులకు మంచి ఆదాయాన్ని అందించే వాణిజ్య పంటగా గుర్తింపు పొందింది. అయితే టమాట సాగులో అధిక దిగుబడి సాధించాలంటే పురుగులు, తెగుళ్ళ నియంత్రణ ఎంతో అవసరం. ఈ క్రమంలో రైతులు వివిధ రకాల పురుగుమందులను వినియోగిస్తుంటారు. కానీ పురుగుమందుల వినియోగంలో జాగ్రత్తలు పాటించకపోతే పంటలో అవశేషాలు మిగిలిపోతాయి. అందువల్ల పురుగుల నియంత్రణతో పాటు పురుగుమందుల అవశేషాల నియంత్రణ మరియు పంట కోత కాలాల పాటింపు కూడా అత్యంత కీలకం.

టమాట పంటను నష్టపరిచే ప్రధాన పురుగులు:

కాయతొలుచు పురుగు: టమాటా పంటలో అత్యధిక ఆర్థిక నష్టం కలిగించే పురుగులలో కాయతొలుచు పురుగు ముఖ్యమైనది. ఈ పురుగు లార్వా దశలో కాయలను తొలిచి లోపలి గుజ్జును తింటుంది. సాధారణంగా పురుగు తలను కాయలోకి చొప్పించి, మిగిలిన భాగాన్ని బయట ఉంచి ఆహారం తీసుకుంటుంది. దీని వల్ల కాయలు కుళ్ళిపోవడం, నాణ్యత తగ్గిపోవడం మరియు మార్కెట్‌లో ధర పడిపోవడం జరుగుతుంది.

సూది మొన పురుగు: సూది మొన ఇటీవల కాలంలో టమాట రైతులకు పెద్ద సవాలుగా మారింది. ఈ పురుగు ఆకుల పైభాగం మరియు లోపలి పొర మధ్య భాగాన్ని తింటూ సొరంగాల్లాంటి గీతలను ఏర్పరుస్తుంది. మొదట తెల్లటి లేదా పారదర్శక మచ్చలుగా కనిపించే ఈ లక్షణాలు తరువాత ఆకుల మొత్తం విస్తీర్ణానికి వ్యాపిస్తాయి. ఆకులతోపాటు కొమ్మలు, పుష్పాలు మరియు కాయలను కూడా దెబ్బతీస్తుంది. కాయలలోకి ప్రవేశించి గుజ్జును తినడం వల్ల అవి కుళ్ళిపోతాయి. తీవ్ర దాడి ఉన్నప్పుడు మొక్కలు బలహీనపడి ఎండిపోయే ప్రమాదం ఉంది.

తెల్లదోమ: తెల్లదోమలు ఆకుల నుండి రసాన్ని పీల్చి మొక్కల పెరుగుదలను తగ్గిస్తాయి. అంతేకాకుండా వైరస్ వ్యాధులను వ్యాప్తి చేసి పంటను పూర్తిగా దెబ్బతీసే ప్రమాదం కలిగిస్తాయి.

తామర పురుగులు: తామర పురుగుల దాడి వల్ల ఆకులపై వెండి రంగు మచ్చలు కనిపిస్తాయి. ఆకులు ముడుచుకుపోవడం, పుష్పాల అభివృద్ధి తగ్గిపోవడం మరియు చిన్న కాయల ఎదుగుదల దెబ్బతినడం జరుగుతుంది.

పేనుబంక: పేనుబంక మొక్కల నుండి రసాన్ని పీల్చి పెరుగుదలను తగ్గిస్తాయి. ఇవి అనేక వైరస్ వ్యాధులకు వాహకాలుగా పనిచేస్తాయి.

పొగాకు లద్దె పురుగు: ఈ పురుగు ఆకులను వేగంగా తినివేసి మొక్కలను నిర్వీర్యం చేస్తుంది. చిన్న మొక్కల దశలో తీవ్ర నష్టం కలిగించి మొత్తం మొక్కను నాశనం చేసే అవకాశం ఉంది.

పురుగుల నియంత్రణకు ఉపయోగించే ముఖ్య పురుగుమందులు:

పురుగుల తీవ్రతను బట్టి తగిన పురుగుమందులను సిఫార్సు చేసిన మోతాదులో మాత్రమే వాడాలి.

పురుగు	పురుగుమందు	మోతాదు
కాయతొలుచు పురుగు	సయాంట్రానిలిప్రోల్ 10.26 ఒడి	1.8 మి.లీ. / లీటరు
కాయతొలుచు పురుగు	స్పైనోసాడ్ 45 ఎస్‌సి	0.3 మి.లీ. / లీటరు
కాయతొలుచు పురుగు	ఇమామెక్టిన్ బెంజోయేట్ 5 ఎస్‌జి	0.4 గ్రా. / లీటరు
సూది మోన పురుగు	స్పైనటోరాం 11.7 ఎస్‌సి	0.5 మి.లీ. / లీటరు
సూది మోన పురుగు	క్లోరాంట్రానిలిప్రోల్ 18.5 ఎస్‌సి	0.3 మి.లీ. / లీటరు
తెల్లదోమ	ఇమిడాక్లోప్రిడ్ 17.8 ఎస్ఎల్	0.3 మి.లీ. / లీటరు
తెల్లదోమ	థయోమిథాక్సామ్ 25 డబ్ల్యుజి	0.25 గ్రా. / లీటరు
తామర పురుగులు	స్పైనటోరాం 11.7 ఎస్‌సి	0.5 మి.లీ. / లీటరు
తామర పురుగులు	ఫిప్రోనిల్ 5 ఎస్‌సి	0.2 మి.లీ. / లీటరు
పేనుబంక	ఎసిటామిప్రిడ్ 20 ఎస్‌పి	0.2 గ్రా. / లీటరు
పొగాకు లద్దెపురుగు	నొవాల్యూరాన్ 10 ఇసి	1.0 మి.లీ. / లీటరు

పురుగుమందుల అవశేషాలు: పురుగుమందులను పిచికారి చేసిన వెంటనే అవి పూర్తిగా నశించవు. కొంతకాలం పాటు పంటలో, పండ్లలో లేదా కూరగాయల్లో మిగిలి ఉంటాయి. వీటినే పురుగుమందుల అవశేషాలు అంటారు.

నేటి పరిస్థితుల్లో వినియోగదారులు సురక్షితమైన ఆహారాన్ని కోరుకుంటున్నారు. అలాగే ఎగుమతి మార్కెట్లలో కూడా అవశేషాల పరిమితులపై కఠిన నిబంధనలు అమలులో ఉన్నాయి. కాబట్టి అవశేషాల నియంత్రణ రైతులకు అత్యంత అవసరమైన అంశంగా మారింది.

అవశేషాల వల్ల కలిగే నష్టాలు: పురుగుమందుల అవశేషాలు అధికంగా ఉన్నప్పుడు అనేక సమస్యలు తలెత్తుతాయి.

- వినియోగదారుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడవచ్చు.
- మార్కెట్‌లో ఉత్పత్తి విలువ తగ్గుతుంది.
- ఎగుమతులకు ఆటంకం ఏర్పడుతుంది.
- నాణ్యత ప్రమాణాలు చేరుకోలేక సరుకులు తిరస్కరించబడవచ్చు.
- వినియోగదారుల విశ్వాసం దెబ్బతింటుంది.

అవశేషాలు పెరగడానికి కారణాలు: అధిక మోతాదులో పురుగుమందులను ఉపయోగించడం, తక్కువ వ్యవధిలో వరుసగా పిచికారీలు చేయడం, అలాగే పంట కోత కాలాలను పాటించకపోవడం వల్ల అవశేషాల స్థాయి పెరుగుతుంది.

పంట కోత కాలం: పురుగుమందు పిచికారి చేసిన రోజు నుండి పంట కోతకు మధ్య ఉండాల్సిన కనిష్ఠ వ్యవధిని పంట కోత కాలం లేదా ప్రీ-హార్వెస్టర్ ఇంటర్వెల్ (పిహెచ్ఐ) అంటారు. ఈ కాలంలో పురుగుమందుల అవశేషాలు సహజంగా తగ్గి సురక్షిత స్థాయికి చేరుకుంటాయి.

పిహెచ్ఐ పాటించడం వల్ల కలిగే ప్రయోజనాలు

- సురక్షితమైన ఆహార ఉత్పత్తి
- వినియోగదారుల ఆరోగ్య రక్షణ
- ఎగుమతి అవకాశాల పెరుగుదల
- మంచి మార్కెట్ ధర
- నాణ్యమైన ఉత్పత్తిగా గుర్తింపు

టమాటలో సాధారణంగా ఉపయోగించే పురుగుమందులు మరియు పిహెచ్ఐ

పురుగుమందు	నియంత్రించే పురుగు	పిహెచ్ఐ (రోజులు)
ఇమిడాక్లోప్రిడ్	తెల్లదోమ, పేనుబంక	3-5
స్పైనటోరాం	తామర పురుగులు, సూది మోన పురుగు	3
సయంట్రానిలిప్రోల్	కాయతొలుచు పురుగు	5-7
లుఫెన్యూరాన్	లద్దె పురుగులు	5-7
ప్రొఫెనోఫాస్	వివిధ పురుగులు	10

అవశేషాల తగ్గుదల: పురుగుమందులు శాశ్వతంగా పంటలో ఉండవు. సూర్యకాంతి, ఉష్ణోగ్రత, వర్షపాతం మరియు మొక్కల జీవక్రియల ప్రభావంతో అవి క్రమంగా విచ్ఛిన్నమై తగ్గిపోతాయి. ఈ ప్రక్రియను డిసిపేషన్ అంటారు.

సాధారణంగా సిఫార్సు చేసిన మోతాదులో వాడిన మందులు కోత సమయానికి సురక్షిత స్థాయికి చేరుకుంటాయి. కొన్ని మందులు 3-5 రోజుల్లో తగ్గిపోతే, మరికొన్ని 7-10 రోజులు లేదా అంతకంటే ఎక్కువ సమయం తీసుకుంటాయి.

కోత అనంతరం అవశేషాలను తగ్గించే పద్ధతులు:

- 2 శాతం ఉప్పు నీటితో కడగడం ద్వారా 30-40 శాతం వరకు అవశేషాలు తగ్గే అవకాశం ఉంది.
- వేడి నీటిలో కొద్దిసేపు ముంచే బ్లాంచింగ్ పద్ధతి ద్వారా 25-30 శాతం వరకు తగ్గించవచ్చు.
- అల్ట్రాసోనిక్ క్లీనింగ్ ద్వారా 20-25 శాతం వరకు తగ్గుదల సాధ్యమవుతుంది.
- సాధారణ నీటితో కడిగినా కొంతమేర అవశేషాలు తొలగిపోతాయి.

రైతులకు ముఖ్య సూచనలు:

- సిఫార్సు చేసిన మోతాదులోనే పురుగుమందులను వాడాలి.
- ఒకే రసాయన సమూహానికి చెందిన మందులను పదే పదే ఉపయోగించకూడదు.
- ప్రతి మందుకు సూచించిన పంట కోత కాలాన్ని తప్పనిసరిగా పాటించాలి.
- సమగ్ర సస్యరక్షణ పద్ధతులను అనుసరించాలి.
- జీవ నియంత్రణ పద్ధతులను ప్రోత్సహించాలి.
- పిచికారీల వివరాలను నమోదు చేసుకోవాలి.
- అవసరమైతే వ్యవసాయ నిపుణుల సలహాలు తీసుకోవాలి.

రైతు పండించే టమాట నేరుగా వినియోగదారుడి ఆహారంలో భాగమవుతుంది. కాబట్టి ఎక్కువ దిగుబడిని సాధించడం మాత్రమే కాకుండా, తక్కువ పురుగుమందుల అవశేషాలతో సురక్షితమైన మరియు నాణ్యమైన ఉత్పత్తిని అందించడం కూడా రైతు యొక్క ముఖ్యమైన బాధ్యత. అవశేషాల నియంత్రణ ద్వారా రైతు ప్రజల ఆరోగ్య సంరక్షణలో ప్రత్యక్షంగా భాగస్వామి అవుతాడు.

టమాట పంటలో పురుగుల నిర్వహణ ఎంత అవసరమో, పురుగుమందుల అవశేషాలను నియంత్రించడం కూడా అంతే అవసరం. సరైన పురుగుమందును ఎంపిక చేసుకొని, సిఫార్సు చేసిన మోతాదులో మరియు సరైన సమయంలో వినియోగించడంతోపాటు పంట కోత కాలాలను తప్పనిసరిగా పాటిస్తే, సురక్షితమైన మరియు అధిక నాణ్యత కలిగిన టమాటలను ఉత్పత్తి చేయడం సాధ్యమవుతుంది. దీనివల్ల వినియోగదారులకు ఆరోగ్యకరమైన ఆహారం అందడమే కాకుండా, రైతులకు మంచి మార్కెట్ ధర, అధిక ఆదాయం మరియు ఎగుమతి అవకాశాలు కూడా మెరుగుపడతాయి.

"పంట కోత కాలాన్ని పాటిద్దాం - పురుగుమందుల అవశేషాలను తగ్గిద్దాం - సురక్షిత ఆహారాన్ని సమాజానికి అందిద్దాం."

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9494407924

జూలై మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు

డా॥ ఐ.వి. శ్రీనివాస రెడ్డి
వ్యవసాయ కళాశాల, అశ్వారావుపేట

మామిడి: మొక్కల వరుసల మధ్య దున్నుకోవాలి. పాదుల్లో కలుపు తీసుకోవాలి. వర్షాధారపు తోటల్లో పాదులకు మల్చింగ్ చేసి వర్షపు నీటిని పొదుపు చేసుకోవాలి. పాదుల్లో క్లోరిపైరిపాస్ లేదా ఇమిడాక్లోప్రిడ్ పొడి మందును చల్లటం ద్వారా పిండినల్లిని నివారించుకోవచ్చు. ఈ మాసంలో మామిడి చెట్లు చిగురు వేస్తాయి. భవిష్యత్తులో సూక్ష్మధాతు లోపాలు రాకుండా ఉండటానికి చెట్లపై లీటరు నీటికి 5 గ్రా. జింకు సల్ఫేట్ + 3 గ్రా. మెగ్నీషియం సల్ఫేట్ + 2.5 గ్రా. ఫెర్రస్ సల్ఫేట్ + 2 గ్రా. కాపర్ సల్ఫేట్ + 2 గ్రా. బోరాన్‌లు చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి. అదేవిధంగా లేత ఆకులపై కార్బండాజిమ్ 1 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

జామ: పెద్ద చెట్లకి పాదులు చేసి 540 గ్రా. యూరియా, 625 గ్రా. సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 425 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను పాదుల్లో వేసి నీరు పెట్టాలి. ఈ మాసంలో జామ ఆకులు ఎరుపు రంగులోకి మారుతుంటాయి. దీనికి కారణం భాస్వరం, పొటాష్, జింక్ లోపాలు. దీని నివారణకు రసాయన ఎరువులతోపాటు సేంద్రియ ఎరువులు వేసుకోవాలి. 4 గ్రా. జింక్ సల్ఫేట్, 2 గ్రా. బోరాన్‌లను ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. కొత్తగా తోట వేయాలనుకునే వారు గుర్తింపు పొందిన నర్సరీ నుండి నేలంట్లుగాని, అంట్లుగాని సేకరించి నాటుకోవచ్చు.

అరటి: ఈ మాసంలో పెద్ద పచ్చ అరటి, పొట్టిపచ్చ అరటి, తెల్ల చక్కెరకేళి రకాలలో సిగటోకి ఆకుమచ్చ తెగులు ఉధృతి పెరిగే అవకాశం ఉంది. ట్రైడిమార్ఫ్ లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి 20 రోజుల వ్యవధిలో రెండు మూడు సార్లు పిచికారి చేసి నివారించుకోవచ్చు. నీరు నిలవకుండా మురుగు నీటి కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. తోటలో పేను మరియు పిండి పురుగుల ద్వారా వైరస్ తెగుళ్ళు వ్యాప్తి కాకుండా వాటిని డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాన్ 2 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసి నివారించాలి.

బత్తాయి, నిమ్మ: ఈ మాసంలో కొత్త బత్తాయి, నిమ్మ తోటలు నాటుకునే వారు మొక్కల వేర్లను లీటరు నీటికి 1 గ్రా. కార్బండాజిమ్ కలిపిన ద్రావణంలో 15 నిమిషాలపాటు ముంచాలి. కొత్తగా నాటుకునే బత్తాయి లేదా నిమ్మ తోటల్లో అంతర పంటలుగా మినుము, పెసర లేదా వేరుశనగ పంటలను 5 ఏళ్ళ వరకు వేసుకోవచ్చు. ఈ మాసంలో కాయ రాలుటను నివారించుటకు 1.5 గ్రా. 2,4-డి, 100 గ్రా. కార్బండాజిమ్, 1 కిలో యూరియాను 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. అంబే బహార్ పంట తీసుకునే తోటల్లో ఈ మాసంలో 180 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను ప్రతి చెట్టు మొదలుకి 3 అడుగుల దూరంలో వేసి మట్టిలో బాగా కలపాలి. గజ్జి తెగులు నివారణకు 180 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను మరియు 6 గ్రా. స్ట్రెప్టోసైక్లిన్‌లను 60 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

ద్రాక్ష: ఈ మాసంలో ద్రాక్షలో బూడిద తెగులు, పక్షి కన్ను తెగులు నివారణకు డైఫెన్‌కొనజోల్ 0.6 మి.లీ. లేదా టెబుకొనజోల్ 0.75 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. మజ్జిగ తెగులు నివారణకు మాంకోజెబ్ + ఫెనామడోన్ 2 గ్రా. లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి. ద్రాక్ష తోటలో మజ్జిగ తెగులు, బూడిద తెగులు ఒకేసారి గమనిస్తే అజాక్సీస్ట్రోబిన్ 0.5 మి.లీ. లేదా క్రిసోక్సిమ్ మిథైల్ 0.6 మి.లీ.ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

సపోట: తోటలో ఇరువైపులా దుక్కిదున్ని, చెట్లకు పాదులు చేసి, పెద్ద చెట్లకు 880 గ్రా. యూరియా, 1 కిలో సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 750 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌లను చెట్టు మొదలు నుండి 1.5 మీ. దూరంలో పాదు అంతా సమంగా వేసి మట్టిలో కలపాలి.

సీతాఫలం: చెట్టు చుట్టూ పాదులు చేసి, కిలో ఆముదం పిండి, 250 గ్రా. అజటోబ్యాక్టర్ 250 గ్రా. యూరియా, 350 గ్రా. సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 100 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులు వేసుకోవాలి.

కూరగాయలు:

బెండ: వర్షాకాలపు పంటను ఈ మాసం చివరి వరకు విత్తుకోవచ్చు. సకాలంలో వర్షాలు రాకపోతే 7-8 రోజులకొకసారి నీరు పెట్టాలి. గింజలు మొలకెత్తినప్పుడు, ఎండుతెగులు వల్ల మొదటి 15 రోజుల సమయంలోనే ఎండిపోయి చనిపోతాయి. దీని నివారణకు మొక్కల మొదళ్ళ వద్ద కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపిన ద్రావణాన్ని పోయాలి. వేప పిండిని ఎకరాకు 100 కిలోల చొప్పున దుక్కిలో వేసుకోవాలి.

వంగ: వర్షాకాలం నారుని ఈ మాసంలో నాటుకోవచ్చు. నారుని పీకటానికి వారం రోజుల ముందు 250 గ్రా. కార్బోఫ్యూరాన్ గుళికలను 100 చ.మీ. నారుమడికి వేసుకోవాలి. రసం పీల్చు పురుగులు ఆశించకుండా ఎకరాకు 10 కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలను, నాటే ముందు ప్రధాన పొలంలో వేసుకోవాలి.

టమాట: పచ్చదోమ ఆకుల అడుగుభాగం నుండి రసాన్ని పీల్చడం వల్ల, ఆకుల చివర్లు పసుపు పచ్చగా మారి క్రమేపి ఆకు అంతా ఎర్రబడి చివరిగా ఆకులు ముడుచుకొని దోనెలలాగా కన్పిస్తాయి. దీని నివారణకు డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాన్ 2 మి.లీ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

పందిరి కూరగాయలు: ఆనప, దోస, కాకర, బీర, దొండలను ఈ మాసం చివరి వరకు నాటుకోవచ్చు. ఈ మాసంలో బూజు తెగులు ఆశించే అవకాశం ఉంది. మొదటిగా లేత ఆకుపచ్చ, ముదురు ఆకుపచ్చ కలిసి మొజాయిక్ వలె కనిపిస్తుంది. తర్వాత ఆకుల పై భాగాన పసుపు రంగు మచ్చలు, అడుగు భాగాన ఊదా రంగు మచ్చలు, బూజు వంటి పదార్థం ఏర్పడుతుంది. ఆకులు పండుబారి ఎండిపోతాయి. దీని నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రా. లేదా మెటలాక్సిల్ ఎమ్‌జెడ్ 2 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

కరివేపాకు: నారును ప్రధాన పొలంలో ఈ మాసంలో నాటుకోవచ్చు. ఈ మాసంలో అధిక వర్షాల వల్ల వచ్చే ఆకుమచ్చ తెగులు నివారణకు 1 గ్రా. కార్బండాజిమ్‌ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పొలుసు పురుగులు కాండంపై చేరి రసాన్ని పీలుస్తాయి. మొక్క పెరుగుదల తగ్గిపోతుంది. నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పిచికారి చేసిన తర్వాత 10 రోజుల వ్యవధి ఇచ్చి ఆకులు కోయాలి.

మిరప: మిరపలో మంచి నారు అధిక దిగుబడికి నాంది కాబట్టి ఎత్తు నారుమడులు, 1 మీ. వెడల్పు, 15 సెం.మీ. ఎత్తుగా చేసి విత్తుకోవాలి. 1 సెంటు నారుమడికి 650 గ్రా. విత్తనం చల్లుకోవాలి. సెంటు నారుమడికి కిలో వేపపిండి, 80 గ్రా. ఫిప్రోనిల్ గుళికలను వాడి రసం పీల్చు పురుగులను నివారించవచ్చును. విత్తిన 9వ, 13వ రోజు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటిలో కలిపిన ద్రావణంలో నారుమళ్ళను తడపాలి.

పసుపు: అధిక వర్షాలు కురిస్తే మొక్కల చుట్టూ నీరు నిలబడి ఉండటం వల్ల దుంప, వేరుకుళ్ళు తెగులు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు ఎకరాకు 10 కిలోల ఫోరేట్ 10జి గుళికలు, కిలో సైమాక్సోనిల్ + మాంకోజెబ్ పొడి మరియు 20 కిలోల యూరియా కలుపుకొని పొలం అంతటా చల్లుకోవాలి.

బంతి: వర్షాకాలం పంట కోసం పెంచుకున్న నారును జూలై రెండవ వారంలో ప్రధాన పొలంలో నాటుకోవాలి. 25-30 రోజులు, 3-4 ఆకులు కలిగిన నారుని సాయంకాలం వేళలో నాటుకుంటే బాగా కుదురుకుంటాయి.

చామంతి: కొత్తగా నాటాలనుకునేవారు ఈ మాసాంతంలోపు వేర్లతో కూడిన కత్తిరింపులు లేదా పిలకలను నాటుకోవాలి.

గులాబి: ఈ మాసంలో గుండ్రటి నల్లటి మచ్చలు ఆకులకు రెండు వైపులా వ్యాపించడం వల్ల ఆకులు రాలిపోతాయి. నివారణకు బెనోమిల్ 1 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9441168156

ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవం 2026 సందర్భంగా ప్రత్యేక కథనం!
స్కిల్ కోర్సుల ద్వారా నైపుణ్య అభివృద్ధి మరియు మెరుగైన ఉపాధి అవకాశాలు

డా॥ ఎ. పోశాద్రి మరియు డా॥ కె.వి రమణారావు

స్కిల్ ట్రైనింగ్ విభాగం, అగ్రికల్చర్ ఇంజనీరింగ్ మరియు టెక్నాలజీ విభాగం

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్

ప్రపంచవ్యాప్తంగా సగం మంది జనాభా వయసు 30 లేదా అంతకంటే తక్కువ మరియు 2030 చివరి నాటికి 57% పైన యువజన జనాభా చేరుకుంటుందని అంచనా. భారతదేశం ప్రపంచంలోని అతిపెద్ద యువత జనాభాలో ఒకటి, దాదాపు 600 మిలియన్ల మంది 25 ఏళ్లలోపు ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి పది మందిలో ఏడుగురిలో ఆధునిక పరిశ్రమ మరియు వివిధ రంగాలకు కావలసిన నైపుణ్యాలు లేకపోవడం వలన సరైన ఉపాధి దొరకడం లేదు మరియు దేశ ఆర్థిక కార్యకలాపాలలో భాగస్వాములు కావడం లేదు. పెరుగుతున్న యువజన జనాభా కోసం ఉపాధి కల్పన మరియు వారి శక్తి యుక్తులను దేశాభివృద్ధికి విలువైన వనరుగా ఉపయోగించుట కొరకు వారిలో నైపుణ్యాభివృద్ధి పెంపొందించడం కోసం తగిన శిక్షణ కార్యక్రమాలు రూపొందించాలని 2014 సంవత్సరములో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ తీర్మానించింది. ప్రతి సంవత్సరం జులై 15వ తేదీ ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవంగా జరపాలని ఐక్యరాజ్య సమితి సభ్య దేశాలను కోరింది.

మన దేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం చాలా కీలకమైన రంగం. వ్యవసాయంలో యువతీ యువకులను నిమగ్నం చేయడం ద్వారా ప్రపంచ ఆహార భద్రతను పరిష్కరించడానికి మరియు దేశానికి పోషకాహార భద్రత, స్థిరమైన ఆహార ఉత్పత్తి మరియు సరఫరా వ్యవస్థలను పటిష్టం చేయడానికి ఎంతో కీలకమైనది. యువతీ యువకులు తాజా దృక్కోణాలు, వినూత్న ఆలోచనలు మరియు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించాలనే ఆసక్తిని కలిగి ఉంటారు. యువతీ యువకులు, రైతులు మరియు మహిళా రైతుల ఆలోచనలు మరియు ఆసక్తికి అనుగుణంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వివిధ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు మరియు సర్టిఫికెట్ కోర్సులు అందిస్తుంది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారి ఆలోచనలు ఆచరణలోకి తీసుకురావడానికి వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య గారి విస్తృత విషయ పరిజ్ఞానం, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పటిష్ట పరచడంలో యువత పాత్ర తెలిసిన వ్యక్తిగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని 13 కాలేజీలు, 8 కృషి విజ్ఞాన కేంద్రాలు మరియు 23 రైతు విజ్ఞాన కేంద్రాలలో ఈ క్రింది 22 స్కిల్ ట్రైనింగ్ కోర్సులు ఏడాది పొడవునా చేపట్టాలని నిర్ణయించారు.



స్కిల్ ట్రైనింగ్ కోర్సులు

స్కిల్ ట్రైనింగ్ కోర్సులు	ఏమి నేర్చుకుంటావు	ఉపాధి అవకాశాలు
ఫాం మెషినరీ సర్వీస్ టెక్నీషియన్	• ట్రాక్టర్ & మెషినరీ సర్వీసింగ్ • ఇంజిన్ & ఎలక్ట్రికల్ సిస్టమ్స్ • వ్యవసాయ పరికరాల మరమ్మత్తు & రక్షణ • వర్క్‌షాప్ నైపుణ్యాలు	• సర్వీస్ టెక్నీషియన్ • కస్టమ్ హైరింగ్ సెంటర్స్ • మెషినరీ రిపేర్ వర్క్‌షాప్
సూక్ష్మ సేద్య సాంకేతిక నిపుణుడు	• డ్రిప్ & స్ప్రింక్లర్ సిస్టమ్స్ • ఇన్‌స్టాలేషన్ & నిర్వహణ • ఫెర్టిగేషన్ & ఫిల్టర్స్ • సూక్ష్మ సేద్య సమస్యల పరిష్కారం	• సూక్ష్మ సేద్య సాంకేతిక నిపుణుడు • ఫీల్డ్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ • మైక్రో ఇరిగేషన్ పరికరాల సేల్స్ పర్సన్ లేదా ఎగ్జిక్యూటివ్
క్లౌడ్ కిచెన్ స్పెషలిస్ట్ & ఫుడ్ సేఫ్టీ హ్యాండ్లర్	• క్లౌడ్ కిచెన్ ఆపరేషన్స్ • ఫుడ్ సేఫ్టీ & శుభ్రత • మెనూ ప్లానింగ్ & ఖర్చుల గణన • ప్యాకేజింగ్ & డిజిటల్ ఆర్డర్లు	• క్లౌడ్ కిచెన్ ఎగ్జిక్యూటివ్ • ఫుడ్ సేఫ్టీ హ్యాండ్లర్ • హోటల్స్, రెస్టారెంట్స్, కేటరింగ్ • సర్వీసెస్/క్విక్ సర్వింగ్ రెస్టారెంట్స్ జాబ్స్
సూక్ష్మ వ్యాపార అభివృద్ధికి తెలంగాణ సాంప్రదాయ ఆహార పదార్థాలు	• తెలంగాణ సాంప్రదాయ ఆహార పదార్థాల తయారీ • ప్రమాణాలు & నాణ్యత • ప్యాకేజింగ్ & షెల్ఫ్ లైఫ్ • బ్రాండింగ్ & మార్కెటింగ్	• ఫుడ్ ఎంటర్ప్రెన్యూర్ • చిన్న స్థాయి ఫుడ్ బిజినెస్ • హోమ్-బేస్డ్ ఎంటర్ప్రైజెస్
బయో-ఇన్పుట్స్ ఉత్పత్తికి టెక్నీషియన్	• బయోఫర్టిలైజర్స్ & బయోపెస్టిసైడ్స్ తయారీ • వెర్మికంపోస్ట్ & జీవామృతం తయారీ • ఫెర్మెంటేషన్ టెక్నిక్స్ • నాణ్యత & నిల్వ	• బయో-ఇన్పుట్ ఉత్పత్తి కంపెనీలు • ఆర్గానిక్ ఇన్పుట్ వ్యాపారవేత్త • ఆర్గానిక్ మరియు సుస్థిర వ్యవసాయ సలహాదారు
ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ కోసం టెక్నీషియన్	• ఫుడ్ ప్రాసెసింగ్ మెలకువలు • ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ యంత్రాల • నిర్వాణ మరియు యాజమాన్యం • నాణ్యత & శుభ్రత • ప్యాకేజింగ్ & లేబులింగ్	• ఆహార ప్రాసెసింగ్ ఆపరేటర్ • క్వాలిటీ కంట్రోల్ అసిస్టెంట్ • ప్రొడక్షన్ సూపర్వైజర్
రక్షిత సాగు & నర్సరీ నిర్వహణ కోసం టెక్నీషియన్	• పాలిహౌస్ & షేడ్ నెట్ నిర్వహణ • నర్సరీ పెంచే విధానాలు • నర్సరీలో వివిధ రకాల మొక్కలు పెంచడంలో మెలకువలు • పంట రక్షణ	• నర్సరీ మేనేజర్ • పాలిహౌస్ టెక్నీషియన్ • పాలిహౌస్ & షేడ్ నెట్ ద్వారా పంటల • ఉత్పత్తితో జీవనోపాధి మరియు ఎంటర్ప్రెన్యూర్

స్కిల్ ట్రైనింగ్ కోర్సులు	ఏమి నేర్చుకుంటావు	ఉపాధి అవకాశాలు
డ్రోన్ల సాంకేతిక నిపుణుడు	• డ్రోన్ ఎగరవేయడం / ఆపరేషన్ మరియు భద్రత • డ్రోన్ మెయింటెనెన్స్ • పిచికారీ మరియు మ్యాపింగ్ • డేటా సేకరణ	• డ్రోన్ ఆపరేటర్ • వ్యవసాయానికి డ్రోన్ సేవలందించే ఆపరేటర్ • ఆధునిక వ్యవసాయానికి సహాయకుడిగా
క్వాలిటీ సీడ్ టెక్నీషియన్	• విత్తన ఉత్పత్తి మెలుకువలు • విత్తన శుద్ధి మరియు గ్రేడింగ్ • విత్తన పరీక్షా విధానాలు • విత్తన నిల్వ మరియు సంరక్షణ	• విత్తన నాణ్యత విశ్లేషకుడు • విత్తనశుద్ధి సాంకేతిక నిపుణుడు • విత్తన ధృవీకరణ సహాయకుడు
వ్యర్థాలను సంపదగా మార్చే సాంకేతిక నిపుణుడు	• వ్యర్థాల విభజన • కంపోస్టింగ్ మరియు రీసైక్లింగ్ • బయోగ్యాస్ మరియు బయోమాస్ ఉత్పత్తి మరియు వినియోగం • విలువ-జోడించిన వ్యర్థాల ఉత్పత్తులు	• వ్యర్థాల నిర్వహణ సాంకేతిక నిపుణుడు • కంపోస్ట్ యూనిట్ ఎంటర్ప్రెన్యూర్ • బయోమాస్ ఎంటర్ప్రెన్యూర్
స్పైసెస్ ప్రాసెసింగ్ సాంకేతిక నిపుణుడు	• వివిధ రకాల స్పైసెస్ క్లీనింగ్ మరియు గ్రేడింగ్ • మసాలా దినుసుల గ్రైండింగ్ మరియు విలువ జోడింపు పద్ధతులు • ప్యాకేజింగ్ మరియు నిల్వ • నాణ్యత ప్రమాణాలు మరియు నియంత్రణ	• సుగంధ ద్రవ్యాల ప్రాసెసింగ్ టెక్నీషియన్ • నాణ్యత నియంత్రణ సహాయకుడు • సుగంధ ద్రవ్యాల ఎంటర్ప్రెన్యూర్
విత్తనోత్పత్తి మరియు సీడ్ ప్రాసెసింగ్ టెక్నీషియన్	• విత్తన ఉత్పత్తి పద్ధతులు • విత్తన శుద్ధి మరియు గ్రేడింగ్ • విత్తన శుద్ధి పద్ధతులు • ప్యాకింగ్ మరియు నిల్వ	• విత్తన ఉత్పత్తి సాంకేతిక నిపుణుడు • విత్తన శుద్ధి ప్రక్రియ నిర్వాహకుడు • విత్తన పరిశ్రమలో ఉద్యోగాలు
భూసారం మరియు నీటి నాణ్యత పరీక్షించే టెక్నీషియన్	• మట్టి నమూనాల సేకరణ మరియు పరీక్ష • నీటి నాణ్యత విశ్లేషణ • ప్రయోగశాల పరికరాల నిర్వహణ • భూసారం మరియు నీటి నాణ్యత పరీక్ష నివేదిక తయారీ	• భూసారం పరీక్షా కేంద్ర సహాయకుడు • నీటి నాణ్యత విశ్లేషకుడు • వ్యవసాయ సలహాదారు
రైస్ మిల్లింగ్ పరిశ్రమ టెక్నీషియన్	• బియ్యం మిల్లింగ్ ప్రక్రియ • యంత్రాల నిర్వహణ • నాణ్యత నియంత్రణ • ఉప-ఉత్పత్తుల తయారీ	• రైస్ మిల్ ఆపరేటర్ • నాణ్యత నియంత్రణ సహాయకుడు • మిల్ సూపర్వైజర్
హైబ్రిడ్ విత్తన ఉత్పత్తి టెక్నీషియన్	• హైబ్రిడ్ విత్తన ఉత్పత్తి • నియంత్రిత పరాగసంపర్కం	• హైబ్రిడ్ విత్తన సాంకేతిక నిపుణుడు • విత్తన ఉత్పత్తి కార్యనిర్వాహకుడు

స్కిల్ ట్రైనింగ్ కోర్సులు	ఏమి నేర్చుకుంటావు	ఉపాధి అవకాశాలు
	• విత్తన సేకరణ • విత్తన శుద్ధి	• విత్తన కంపెనీ ఉద్యోగాలు
బయోచార్ / బ్రికెటింగ్ పరిశ్రమ టెక్నీషియన్	• బయోచార్ ఉత్పత్తి • బ్రికెట్ల తయారీ • బయోమాస్ వినియోగం • పరికరాల నిర్వహణ	• బయోచార్ యూనిట్ టెక్నీషియన్ • బ్రిక్వెట్ యూనిట్ ఆపరేటర్ • పునరుత్పాదక శక్తి ఎంటర్ప్రెన్యూర్
నూనె గింజల ప్రాసెసింగ్ పరిశ్రమ టెక్నీషియన్	• నూనె గింజల క్లీనింగ్ మరియు గ్రేడింగ్ • నూనె గింజల నుండి నూనె తీయడం మరియు వివిధ ప్రాసెసింగ్ పద్ధతులు • వడపోత పద్ధతులు • ప్యాకేజింగ్ మరియు నిల్వ	• ఆయిల్ మిల్ టెక్నీషియన్ • నాణ్యత నియంత్రణ సహాయకుడు • నూనె ప్రాసెసింగ్ ఎంటర్ప్రెన్యూర్
ధాన్య నిల్వ మరియు గిడ్డంగి నిర్వహణ టెక్నీషియన్	• ధాన్య నిల్వ పద్ధతులు • తెగుళ్ల నిర్వహణ • గిడ్డంగి కార్యకలాపాలు • సరుకు నిల్వల నిర్వహణ	• గిడ్డంగి పర్యవేక్షకుడు • స్టోర్ కీపర్ • వ్యవసాయ ఉత్పత్తుల సప్లై చైన్ సహాయకుడు
బేకరీ టెక్నీషియన్	• బేకరీ ఉత్పత్తుల తయారీ • బేకింగ్ పద్ధతులు • బేకింగ్ పరికరాల నిర్వహణ • ప్యాకేజింగ్ మరియు ప్రదర్శన	• బేకరీ సాంకేతిక నిపుణుడు • బేకరీ ఎంటర్ప్రెన్యూర్ • బేకరీ ఉత్పత్తుల సహాయకుడు
పెస్ట్ కంట్రోల్ సర్వీసెస్ టెక్నీషియన్	• తెగుళ్ల గుర్తింపు • నియంత్రణ పద్ధతులు • రసాయనాలను సురక్షితంగా వాడటం • పారిశుధ్యం మరియు పరిశుభ్రత	• కీటక నియంత్రణ సాంకేతిక నిపుణుడు • భవన నిర్వహణ ఉద్యోగాలు • వివిధ పరిశ్రమలు మరియు యూనిట్లలో కీటక నియంత్రణ సేవల సహాయకుడు
టైలరింగ్ / ఎంబ్రాయిడరీ టెక్నీషియన్	• టైలరింగ్ & వస్త్ర తయారీ • ఎంబ్రాయిడరీ పద్ధతులు • ప్యాటర్న్ తయారీ • ఫినిషింగ్ & నాణ్యత	• టైలర్ • ఎంబ్రాయిడరీ కళాకారుడు • బొటిక్ ఎంటర్ప్రెన్యూర్
న్యూట్రిషన్ ఎక్స్పర్ట్ ఫర్ ఎక్సర్సైజ్ మరియు స్పోర్ట్స్	• పోషకాహారం & ఆహార ప్రణాళిక • క్రీడా పోషకాహారం • శరీర కూర్పు అంచనా • న్యూట్రిషన్ సప్లిమెంట్లపై అవగాహన	• ఫిట్నెస్ పోషకాహార నిపుణుడు • క్రీడా ఆహార సలహాదారు • వెల్నెస్ కోచ్

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. **9492828965**

గొర్రె మరియు మేక పిల్లల యాజమాన్యం

డా॥ జె. సాయి కిరణ్

కృషి విజ్ఞాన కేంద్రం, పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ, మామునూరు, వరంగల్

గొర్రెలు మరియు మేకల పెంపకం లాభదాయకంగా ఉండాలంటే పిల్లలు పుట్టిన వెంటనే శాస్త్రీయ పద్ధతిలో యాజమాన్యం, పోషణ మరియు ఆరోగ్య పరిరక్షణ చర్యలు చేపట్టాలి.

పుట్టిన వెంటనే తీసుకోవలసిన జాగ్రత్తలు

- గొర్రె/ మేక పిల్ల పుట్టిన వెంటనే ముక్కు నోటి మీద ఉండే పొర తొలగించి పొడి గుడ్డతో తుడవాలి.
- బొడ్డు దానంతట అదే విడిపోని యెడల రెండు అంగుళాల పొడవు వరకు కత్తిరించి అయోడిన్‌తో శుభ్రపరచాలి.
- పుట్టిన అరగంటలోపు ముర్రుపాలు తాగించాలి. ముర్రుపాలల్లో మాంసకృత్తులు, ఖనిజలవణములు, విటమిన్లు మరియు వ్యాధి నిరోధక శక్తినిచ్చే యాంటిబాడీలు అధికంగా వుంటాయి.
- పిల్లలను పొడిగా, వెలుతురు మరియు గాలి బాగా ప్రసరించు ప్రాంతాలలో ఉంచాలి.
- పిల్లలను చలి గాలి నుండి కాపాడుకోవాలి.

పాలు మరిచే వరకు పాటించవలసిన యాజమాన్య పద్ధతులు

- పాలు మరిచే వరకు (దాదాపు 3 నెలలు) గొర్రెపిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.
- పిల్లలను తల్లితో పాటు మందతో పంపకుండా కొట్టంలో ఉంచి పెంచాలి. తల్లితో పాటు పంపినట్లయితే అధిక శక్తి వృధా అయి పెరుగుదల తగ్గుతుంది.
- ఇంటి దగ్గర పెట్టిన పిల్లలను గాలి, వెలుతురు సమృద్ధిగా ఉండే కొట్టంలో తడికలు / పొదలు కట్టి అందులో వదలాలి. వరిగడ్డి పక్కవేసినట్లయితే వెచ్చగా ఉండి పిల్లలు మట్టి తినకుండా చూడవచ్చు.
- కొన్ని ప్రాంతాలలో గంప క్రింద పిల్లలను కప్పి పెడతారు. ఇలా చేయడం వల్ల దానికింద చిత్తడిగా తయారై అమ్మోనియా వాయువు విడుదలై పిల్లలకు శ్వాసకోశ వ్యాధులు కలుగజేస్తాయి.
- అదే విధంగా చిత్తడిగా ఉన్న యెడల అంటువ్యాధి కారక క్రిములు ఎక్కువగా వృద్ధి చెందే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా రక్తపారుడు కలుగచేయు కాక్సిడియా వ్యాధి సోకే అవకాశం ఎక్కువ కావున పిల్లలను గాలి, వెలుతురు సక్రమంగా ప్రసరించే విధంగా దడి కట్టి అందులో ఉంచడం మంచిది.
- మందలో తల్లి జీవాలను వేరు చేసి మేపుకు పంపిన తరువాత పిల్లలన్నింటిని పరీక్షించి ఆరోగ్యంగా ఉన్నదీ లేనిదీ చూడాలి. నలతగా ఉన్న పిల్లలకు వెంటనే చికిత్స చేయాలి.
- కొన్ని తల్లి గొర్రెలు పిల్లలకు పాలు సరిగా త్రాగించవు. అలాంటి వాటిని గమనించి తల్లిని పట్టి త్రాగించాలి. ఒకవేళ తల్లి దగ్గర పాలు తక్కువ ఉన్నట్లయితే, పాలు బాగా ఉన్న ఇంకొక తల్లి గొర్రె దగ్గర త్రాగించాలి.

గొర్రెల మరియు మేక పిల్లల పోషణ

గొర్రెలు / మేకలు పెంపకందారులు పిల్లల పోషణలో తగిన మెళకువలు పాటించనందున వాటికి సరియగు పాలు మరియు ఇతర పోషక పదార్థాలు లభించక అవి రోగాల పాలై మరణిస్తున్నాయి. పిల్లల శరీర బరువు పుట్టినప్పుడు 2-3 కిలోలుంటుంది. పిల్లల జీవితంలో మొదటి 48 గం.లు చాలా ముఖ్యమైనది. పిల్లలు పుట్టిన వెంటనే అరగంటలోపు తల్లి నుండి జున్నుపాలు త్రాగాలి.

గొర్రె పిల్లల దాణా

గొర్రెపిల్లల దాణాలో 20% మాంసకృత్తులు (సిపి), 70-75% జీర్ణమయ్యే పోషక పదార్థాలు (టిడిఎన్) ఉండవలెను.

గొర్రెపిల్లల దాణాకు ఉదాహరణ

మొక్కజొన్న	40 కిలోలు
శనగపిండి	30 కిలోలు
గోధుమ తవుడు	10 కిలోలు
నూనె తీసిన వరి తవుడు	12.5 కిలోలు
మొలాసిస్	5 కిలోలు
లవణ మిశ్రమము	2 కిలోలు
ఉప్పు	0.5 కిలోలు

- గొర్రెపిల్లల దాణాను 10వ రోజు నుండి పప్పుజాతికి చెందిన ఎండుగడ్డిని 15వ రోజు నుండి గొర్రె / మేక పిల్లలు ఎంత తింటే అంత ఇవ్వాలి. బరువు. వయస్సు పెరిగే కొద్ది అవి ఎక్కువ తింటాయి.
- ఒక పిల్లకు 10వ రోజు నుండి 90వ రోజు వరకు అనగా తల్లి నుండి వేరు చేయు వరకు సుమారు 12 నుండి 15 కిలోల గొర్రె పిల్లల దాణా మరియు 30 కిలోల పప్పుజాతి ఎండు పశుగ్రాసము కావలసి ఉంటుంది.
- గొర్రెపిల్లలలో పెరుగుదల మొదటి మూడు మాసాలలో ఎక్కువగా అంటే రోజుకు దాదాపు 150 గ్రా. ఉంటుంది. ఇలా అధిక పెరుగుదల ఉన్న పిల్లలే ముందు ముందు కూడా ఏపుగా పెరిగి రైతు సోదరులకు లాభాలను ఆర్జిస్తాయి.
- కావున పాలు మరిచే వయస్సు వరకు తల్లిపాలకు అదనంగా పోషణ ఇవ్వాలి. పిల్లల దడిలో వేప కొమ్మలు వ్రేలాడదీసినట్లైతే పిల్లలు నిధానంగా ఆకులు తింటూ అవి జీర్ణించుకోవటానికి అలవాటు పడతాయి.
- గొర్రె పిల్లలకు ఇచ్చే దాణా ఆయా ప్రాంతాలలో లభించే ముడి సరుకులు ఉపయోగించి రైతుసోదరులు ఇంటి దగ్గర తయారు చేసుకోవచ్చును.
- ఖనిజ లవణ మిశ్రమ ఇటుకలను పాకలలో వ్రేలాడదీయాలి.
- బాహ్య పరాన్న జీవులను అరికట్టాలి.
- మూడు నెలల వయస్సులో గొర్రె పిల్లలను దాదాపు 8 గంటల సేపు బయట మేతకు పంపుతూ, ఉదయం లేదా సాయంత్రం 150 గ్రా. దాణా లేదా అవసరం మేరకు వేరుశనగ / ఉలవ / కంది / శనగ / మినుము / పెసరపొట్టు మేపినట్లయితే ఆరు నెలల వయస్సు వచ్చేటప్పటికి దాదాపు 18-20 కిలోల బరువు పెరిగి మార్కెట్టులో మంచి ధర పలుకుతాయి.
- శుభ్రమైన గాలి ఎల్లవేళలా ప్రసరిస్తుండాలి.
- 2 వారాల వయస్సు తరువాత మొదటిసారి నట్టల నివారణ మందు త్రాగించాలి. నట్టల మందు త్రాగించేటప్పుడు ఊపిరితిత్తులలోనికి మందు పోకుండా జాగ్రత్తగా త్రాగించాలి.
- నట్టల మందు త్రాగించిన 10-15 రోజుల వ్యవధిలో చిటుక వ్యాధి టీకా మందు ఇవ్వాలి. తరువాత నెల రోజులకు బూస్టర్ డోసు టీకా ఇవ్వవలసి ఉంటుంది.
- చిటుక వ్యాధి టీకా ఇచ్చిన 30 రోజుల తర్వాత బొబ్బ రోగానికి టీకా మందు ఇవ్వవలసి ఉంటుంది.

గొర్రెలు - మేకపిల్లల సంరక్షణలో చేపట్టవలసిన కార్యక్రమాలు

క్ర.సం.	వ.సం. వయస్సు	చేపట్టవలసిన కార్యక్రమము
1.	3-5వ రోజు	పారుడు మరియు నెమ్మును నివారించుటకు యాంటీబయాటిక్ మందులు వాడాలి
2.	7-10 వ రోజు	అజీర్ణం మరియు పసికర్లు రాకుండా ఉండుటకు లివర్‌టానిక్ త్రాగించాలి
3.	14వ రోజు	అంతర పరాన్న జీవుల నుండి పిల్లల రక్షణకు నట్టల నివారణకు మందును (అల్బెండజోల్) త్రాగించాలి.
4.	2వ నెల	చిటుకు వ్యాధి నిరోధక టీకాను వేయించాలి.
5.	3వ నెల	నట్టల నివారణకు మందు (ఫెన్బెండ్జోల్) ను త్రాగించాలి. మరియు బొబ్బరోగుల/ మశూచి వ్యాధి నిరోధక టీకా వేయించుకోవాలి.
6.	4వ నెల	పారుడు రోగం (పి.పి.ఆర్) మరియు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి.
7.	6వ నెల	నట్టల నివారణ మందు (లివామిజోల్) ను త్రాగించాలి.
8.	9వ నెల	నట్టల నివారణ మందు (లివామిజోల్) ను త్రాగించాలి
9.	10వ నెల	నట్టల నివారణ మందు (లివామిజోల్ + ఆక్సిక్లోజనైడీ) ను త్రాగించాలి

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8121451017

టి.వి. ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు

డా॥ యం. శ్రీనివాసులు మరియు డా॥ జె.ఎస్. సుధా రాణి
ఎలక్ట్రానిక్ వింగ్, రాజేంద్రనగర్, హైదరాబాద్

క్రమ సంఖ్య	తేది	అంశము	సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్
		I. టి-శాట్: (రైతు మిత్ర - సోమవారం): సాయంత్రం 4.00 - 5.00	
1	06.07.2026	వానాకాలం జొన్న సాగులో తీసుకోవాల్సిన మెళకువలు	**శ్రీ ఎ. శ్రీరామ్,** శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, ఫోన్ నెం.: 8096827745
2	13.07.2026	వాతావరణ మార్పుల సవాళ్లు - రైతులకు అవకాశాలు	**శ్రీమతి పి. సాధ్వి,** ఎస్.యం.ఎస్. (అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్) కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి, ఫోన్ నెం.: 9381181253
3	20.07.2026	వానాకాలంలో నేల మరియు నీటి సంరక్షణ యాజమాన్య పద్ధతులు	**డా॥ జి. మనోజ్ కుమార్,** ప్రధాన శాస్త్రవేత్త (అగ్రి ఇంజనీరింగ్) సహజ వనరులు మరియు పర్యావరణ కేంద్రం, పి.జె.టి.ఎ.యు., రాజేంద్రనగర్, ఫోన్ నెం.: 8464042879
4	27.07.2026	ఆలస్యంగా వరి సాగుకు అనువైన రకాలు మరియు యాజమాన్యం	**డా॥ శ్రీధర్ సిద్ది,** సీనియర్ శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) వరి పరిశోధన కేంద్రం, రాజేంద్రనగర్, ఫోన్ నెం.:9849635235
		II. టి-శాట్: (శనివారం): సాయంత్రం 4.00 - 5.00	
1	04.07.2026	అధిక దిగుబడులకు వర్షాధార వ్యవసాయంలో చేపట్టవలసిన సమర్థ నీటి యాజమాన్య పద్ధతులు	**డా॥ వి. రాములు,** డైరక్టర్ సహజ వనరులు మరియు పర్యావరణ కేంద్రం, పి.జె.టి.ఎ.యు., రాజేంద్రనగర్ ఫోన్ నెం.: 9866875739
2	18.07.2026	ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వానాకాలం పంటల్లో చేపట్టవలసిన ఎరువుల యాజమాన్యం	**డా॥ కస్తూరి రాజమణి,** శాస్త్రవేత్త (ఎస్ఎస్ఏసి) సహజ వనరులు మరియు పర్యావరణ కేంద్రం, పి.జె.టి.ఎ.యు., రాజేంద్రనగర్, ఫోన్ నెం.: 9441352517
3	25.07.2026	ఖరీఫ్ పంటలలో నత్రజని యాజమాన్య పద్ధతులు	**డా॥ కె. సురేష్,** ప్రధాన శాస్త్రవేత్త (అగ్రానమి) సహజ వనరులు మరియు పర్యావరణ కేంద్రం, పి.జె.టి.ఎ.యు., రాజేంద్రనగర్, ఫోన్ నెం.: 9849213541

రైతన్నకో ప్రశ్న...

డా॥ ఆర్. సునిత దేవి
వ్యవసాయ సమాచార ప్రసార మరియు ముద్రణాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్

1. వాతావరణ కార్యాలయాలు నిర్వహించే అధికారిక రికార్డు ప్రకారం, ఒక రోజును చట్టబద్ధంగా "వర్షపు రోజు" గా వర్గీకరించడానికి 24 గంటల వ్యవధిలో అవసరమైన కనీస వర్షపాతం పరిమితి ఎంత?

ఎ) 2.5 మి.మీ లేదా అంతకంటే ఎక్కువ వర్షపాతం

బి) 2.5 సెం.మీ లేదా అంతకంటే ఎక్కువ వర్షపాతం

సి) 5.0 మి.మీ లేదా అంతకంటే ఎక్కువ వర్షపాతం

డి) 5.0 సెం.మీ లేదా అంతకంటే ఎక్కువ వర్షపాతం

2. మొక్కలు బలమైన తల్లి వేరు నిర్మాణం, అభివృద్ధిని ప్రోత్సహించడానికి ప్రధానంగా బాధ్యత వహించే ముఖ్యమైన స్థూల పోషకం ఏది?

ఎ) నత్రజని బి) ఫాస్పరస్

సి) పొటాష్ డి) జింక్

3. లాభదాయ వ్యవసాయం కొరకు సరైన పంటల ప్రణాళికలో భాగంగా రైతులు సాగులో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

ఎ) అంతర పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి

బి) ఏక పంటకు బదులుగా బహుళ పంటలు ఎన్నుకోవాలి

సి) ప్రాంతాలకు అనువైన వివిధ చీడపీడలను తట్టుకునే రకాలను ఎన్నుకోవాలి

డి) పైవన్నీ

4. రైజోబియం అనే జీవన ఎరువులు ఏ పంటలలో వాడవచ్చు?

ఎ) పప్పుజాతి పంటలైన కంది, పెసర, మినుము, అలసంద, బఠాణీ

బి) నూనెగింజ పంటలైన వేరుశనగ, సోయాచిక్కుడు

సి) గడ్డిజాతి పంటలైన బర్సీమ్, టాసర్న్

డి) పైవన్నీ

5. అమ్మోనియం క్లోరైడ్ ఎరువులలో ఎంత శాతం నత్రజని ఉంటుంది?

ఎ) 14% బి) 60%

సి) 25% డి) 46%

6. భూమిలో నత్రజనిని స్థిరీకరించే జీవన ఎరువులు ఏవి.

ఎ) అజిటోబాక్టర్ బి) అజోస్ స్పైరిలం

సి) మైకోరైజా డి) ఎ మరియు బి

7. కాంప్లెక్స్ ఎరువులను జింక్ తో కలిపి వేయకూడదు అంటారు కారణాలు?

ఎ) భాసరం మరియు జింక్ ఎరువులను ఎప్పుడూ కలిపి వేయకూడదు

బి) వీటి రెండింటి మధ్య వ్యతిరేక చర్యల వలన వేసిన జింకు లభ్యత తగ్గడంలేక పూర్తిగా అందకపోవడం జరుగుతుంది

సి) భాస్వరం ఎరువులు వేసిన మూడు రోజుల తర్వాత జింకు ఎరువులను వేసుకోవాలి

డి) పైవన్నీ

8. క్రింద తెలిపిన ఏ పంటలకు అడవి పందుల బెడద ఉండదు?

ఎ) ఆముదం మరియు కుసుమ

బి) ఆముదం మరియు ప్రొద్దుతిరుగుడు

సి) కుసుమ మరియు ప్రొద్దుతిరుగుడు

డి) ఏదీకాదు

9. ఐ.సి.ఎ.ఆర్ ఆధ్వర్యంలోని భారతీయ మొక్కజొన్న పరిశోధన కేంద్రం ఎక్కడ ఉంది?

ఎ) కాన్పూర్ బి) సిమ్లా

సి) లూథియానా డి) కోయంబత్తూర్

10. భారతదేశంలో అత్యధికంగా కొబ్బరి ఉత్పత్తి చేసే రాష్ట్రం ఏది?

ఎ) కర్ణాటక బి) కేరళ

సి) తమిళనాడు డి) ఆంధ్రప్రదేశ్

పై ప్రశ్నలకు సమాధానాలు 50వ పేజీలో చూడవచ్చు

ప్రొఫెసర్ జయశంకర్ గారికి ఘన నివాళి

ప్రొఫెసర్ జయశంకర్ గారి వర్ధంతి సందర్భాన్ని పురస్కరించుకొని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన త్యాగాలని, కృషిని వర్సిటీ ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య స్మరించుకొని, వర్సిటీ ప్రాంగణంలోని జయశంకర్ గారి విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. తదనంతరం వర్సిటీ ఉన్నతాధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు నివాళులు అర్పించారు.

2027 నాటికి వ్యవసాయ విశ్వవిద్యాలయం 10 లోపు ర్యాంకే లక్ష్యం – ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య

విశ్వవిద్యాలయ పరిధిలోని వివిధ వ్యవసాయ కళాశాలలకి అసోసియేట్ డీన్స్‌గా, పరిశోధనా స్థానాల అసోసియేట్ డైరక్టర్లుగా నూతనంగా నియమితులైన ఎస్.సీ, ఎస్టీ ఫ్యాకల్టీ సభ్యుల అభినందన, సన్మాన సభ రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో జూన్ 6న జరిగింది. మొత్తం 16 మంది అసోసియేట్ డీన్స్, అసోసియేట్ డైరక్టర్ ఆఫ్ రీసెర్చ్‌లో ఎనిమిది మంది ఎస్.సి, ఎస్టీ లే నియమితుల అవడం వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఇదే తొలిసారి అయిన సందర్భంగా విశ్వవిద్యాలయం ఎస్.సీ, ఎస్టీ సెల్ మరియు విశ్వ విద్యాలయం బోధన, బోధనేతర ఎస్.సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య హాజరై ప్రసంగించారు. తాను బాధ్యతలు చేపట్టి నేటికి 18 నెల 18 రోజులు అయిందని, ముఖ్యమంత్రివర్యులు శ్రీ రేవంత్ రెడ్డి గారి స్ఫూర్తి తోనే తాను విశ్వ విద్యాలయంలో అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు, గ్రామ గ్రామానికి నాణ్యమైన విత్తనం వంటి వినూత్న కార్యక్రమాలతో రైతులతో నిత్యం మమేకం అవుతున్నామని, బోధన, బోధనేతర సిబ్బంది సమిష్టి కృషి తోనే ఇన్ని కార్యక్రమాలు చేపట్టగలిగామని అభిప్రాయపడ్డారు. అందరి కృషి వల్లనే గతం లో 37 వ స్థానంలో ఉన్న విశ్వవిద్యాలయం గత ఏడాది 24వ ర్యాంక్ సాధించిందన్నారు. ఈ ఏడాది 20 లోపు ర్యాంక్ సాధిస్తుందని, 2027లో పది లోపు ర్యాంక్‌ని విశ్వవిద్యాలయం సాధిస్తుందని అల్దాస్ జానయ్య ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా॥ జి.ఈ.సి.హెచ్. విద్యాసాగర్‌తో పాటు పలువురు విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

రైతు ఆదాయ భద్రత పై మేధో మథన సదస్సు

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రైతు ఆదాయ భద్రత– మార్గాలు, ప్రత్యామ్నాయ విధానాలు అన్న అంశంపై విస్తృత స్థాయి సదస్సు జూన్ 23న నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వర్సిటీ ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ రైతుల ఆదాయం పెంపొందించేందుకు అవసరం అయిన అన్ని చర్యలు తీసుకునేందుకు ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు సిద్ధంగా ఉన్నారని, అందుకు అవసరం అయిన సాంకేతిక అంశాలని సూచించే నోడల్ ఏజెన్సీ బాధ్యతని వ్యవసాయ విశ్వ విద్యాలయానికి అప్పగించారన్నారు. ప్రకృతి వనరులని పరిరక్షిస్తూనే రైతుల ఆదాయం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ విధానాలతోపాటు అనేక ఇతర కారణాల వల్ల వరి విస్తీర్ణం బాగా పెరిగిందని, అవసరాలకి మించి పెరిగిన వరి ఉత్పత్తి కొనుగోలు, నిల్వల వల్ల సవాళ్ళు ఎదురవుతున్నాయని జానయ్య అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు, రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యవసాయ వర్సిటీ, ఆస్కిల మధ్య అవగాహన ఒప్పందం

వ్యవసాయ విశ్వవిద్యాలయం, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (ఆస్కి), హైదరాబాద్‌ల మధ్య జూన్ 23న అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం జరిగింది. వర్సిటీ ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య సమక్షంలో రిజిస్ట్రార్ డా॥ జి.ఈ.సిహెచ్. విద్యాసాగర్, ఆస్కి రిజిస్ట్రార్, సెక్రటరీ డా॥ ఓ పీ సింగ్ లు ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి సంబంధించిన అంశాలలో మానవ వనరుల శిక్షణ, అభివృద్ధి, యాజమాన్య పద్ధతులు, ఆధునిక పరిపాలన విధులు, పద్ధతులు, ఎంటర్ ప్రెన్యూర్ షిప్ తదితర అంశాలలో కలిసి పని చేయాలని ఇరు సంస్థలు నిర్ణయించాయి. ఈ ఒప్పంద కార్యక్రమంలో ఆస్కి సెంటర్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ డైరక్టర్ వి.ఉషారాణి, పరిశోధన సంచాలకులు డా॥ బలరాం, విస్తరణ సంచాలకులు డా॥ యాకాద్రి, వర్సిటీ మానవ వనరుల అభివృద్ధి కేంద్రం సంచాలకులు డా॥ అయ్యంగార్ పాల్గొన్నారు.

డా॥ వి. సుధాకర్, పిఆర్ఓ మరియు మార్ఠ్వ బాబు

శాస్త్రీయ వ్యవసాయంతో అత్యధిక దిగుబడులు సాధించిన మహిళా రైతు – విజయగాథ

డా॥ పి. అర్చన మరియు డా॥ కె. కళ్యాణి

తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, మహబూబ్‌నగర్

శ్రీమతి ఈశావోని జానమ్మ గారు మహబూబ్‌నగర్ జిల్లా కౌకుంట్ల గ్రామానికి చెందిన కష్టపడే మహిళా రైతు. ఆమె 8వ తరగతి వరకు మాత్రమే చదువుకున్నప్పటికీ, తన తెలివితేటలు, అనుభవం మరియు కృషితో వ్యవసాయంలో ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. గత 15 సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తూ ఆధునిక పద్ధతులను అనుసరించి మంచి విజయాలు సాధిస్తున్నారు. ఆమెకు మొత్తం 18 ఎకరాల సాగుభూమి ఉండగా, ఆ భూమిలో ఆల్ఫిసాల్స్ నేల రకం ఉండటం వల్ల ఉద్యాన మరియు వాణిజ్య పంటల సాగుకు అనుకూలంగా మారింది. బోర్‌వెల్‌ను నీటి వనరుగా ఉపయోగించుకొని డ్రిప్ ఇరిగేషన్ వంటి ఆధునిక పద్ధతులను అమలు చేస్తూ నీటిని ఆదా చేస్తున్నారు. సంప్రదాయ వ్యవసాయానికి భిన్నంగా శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా అధిక దిగుబడులు మరియు మంచి ఆదాయం పొందుతూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

శ్రీమతి ఈశావోని జానమ్మ గారు మహబూబ్‌నగర్ జిల్లా కౌకుంట్ల గ్రామానికి చెందిన కష్టపడే మహిళా రైతు. ఆమె 8వ తరగతి వరకు మాత్రమే చదువుకున్నప్పటికీ, తన తెలివితేటలు, అనుభవం మరియు కృషితో వ్యవసాయంలో ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. గత 15 సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తూ ఆధునిక పద్ధతులను అనుసరించి మంచి విజయాలు సాధిస్తున్నారు. ఆమెకు మొత్తం 18 ఎకరాల సాగుభూమి ఉండగా, ఆ భూమిలో ఆల్ఫిసాల్స్ నేల రకం ఉండటం వల్ల ఉద్యాన మరియు వాణిజ్య పంటల సాగుకు అనుకూలంగా మారింది. బోర్‌వెల్‌ను నీటి వనరుగా ఉపయోగించుకొని డ్రిప్ ఇరిగేషన్ వంటి ఆధునిక పద్ధతులను అమలు చేస్తూ నీటిని ఆదా చేస్తున్నారు. సంప్రదాయ వ్యవసాయానికి భిన్నంగా శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా అధిక దిగుబడులు మరియు మంచి ఆదాయం పొందుతూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

పంటల వివరాలు

క్ర.సం.	పంట	రకం / వెరైటీ	విస్తీర్ణం (ఎకరాలు)
1	పత్తి	---	2
2	డ్రాగన్ ఫ్రూట్ + టమాట	షియామి రెడ్, సాహో	2.5
3	నిమ్మ	సాత్గుడి	2
4	పుచ్చకాయ	మహాబలి	5
5	బొప్పాయి	తైవాన్ రెడ్ లేడీ	4.5
6	వంకాయ	లలిత్ F1	3

పంటల వారీగా దిగుబడి మరియు ఆదాయం

పంట	దిగుబడి	సాగు ఖర్చు (రూ./ఎకరం)	స్థూల ఆదాయం (రూ./ఎకరం)	నికర ఆదాయం (రూ./ఎకరం)	బి:సి నిష్పత్తి
పత్తి	1,450 కిలోలు	48,000	1,02,000	54,000	2.13
డ్రాగన్ ఫ్రూట్	8,500 కిలోలు	1,80,000	4,25,000	2,45,000	2.36
నిమ్మ	7,200 కిలోలు	55,000	1,80,000	1,25,000	3.27
పుచ్చకాయ	18,000 కిలోలు	70,000	1,95,000	1,25,000	2.79
బొప్పాయి	24,000 కిలోలు	1,10,000	3,00,000	1,90,000	2.73
వంకాయ	16,500 కిలోలు	65,000	2,10,000	1,45,000	3.23

శ్రీమతి ఈశావోని జానమ్మ తాను వ్యవసాయంలో పత్తి, డ్రాగన్ ఫ్రూట్, నిమ్మ, పుచ్చకాయ, బొప్పాయి మరియు వంకాయ వంటి పంటలను సాగు చేసి మంచి దిగుబడులతో మరియు ఆర్థికంగా లాభాలను సాధించారు. పత్తి పంటలో ఎకరానికి 14.5 క్వింటాళ్ల దిగుబడితో రూ.1,02,000 స్థూల ఆదాయం, రూ.54,000 నికర ఆదాయం మరియు 2.13 బి:సి నిష్పత్తి నమోదైంది. డ్రాగన్ ఫ్రూట్ సాగులో ఎకరానికి 8,500 కిలోల దిగుబడితో రూ.4,25,000 స్థూల ఆదాయం, రూ.2,45,000 నికర ఆదాయం లభించి 2.36 బి:సి నిష్పత్తి సాధించారు. నిమ్మ పంటలో ఎకరానికి 7,200 కిలోల దిగుబడితో రూ.1,25,000 నికర ఆదాయం మరియు 3.27 బి:సి నిష్పత్తి నమోదు కావడం విశేషం. పుచ్చకాయ పంటలో రూ.1,25,000 నికర ఆదాయం, బొప్పాయిలో రూ.1,90,000 నికర ఆదాయం లభించగా, వంకాయ పంటలో ఎకరానికి 16,500 కిలోల దిగుబడితో రూ.2,10,000 స్థూల ఆదాయం మరియు రూ.1,45,000 నికర ఆదాయం పొందారు. మొత్తం మీద పంటల వైవిధ్యంతో రైతు అధిక ఆదాయాన్ని పొందుతూ లాభదాయకమైన సమగ్ర వ్యవసాయ విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నారు.

వ్యవసాయం ద్వారా వచ్చిన మార్పులు

శ్రీమతి జానమ్మ గారు పంటల వైవిధ్యీకరణ ద్వారా సంవత్సరమంతా ఆదాయం పొందుతున్నారు. ఒకే పంటపై ఆధారపడకుండా ఉద్యాన, కూరగాయ మరియు వాణిజ్య పంటలను సాగు చేయడం వల్ల:

- ఆదాయం స్థిరంగా పెరిగింది
- మార్కెట్ ప్రమాదాలు తగ్గాయి
- నీటి వినియోగం సమర్థవంతమైంది
- నేల ఆరోగ్యం మెరుగుపడింది
- కుటుంబ ఆర్థిక పరిస్థితి బలపడింది

ఇతర రైతులపై ప్రభావం: శ్రీమతి జానమ్మ గారి విజయాన్ని చూసి చుట్టుపక్కల రైతులు కూడా డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్ మరియు ఉద్యాన పంటల సాగు వైపు ఆకర్షితులయ్యారు. ముఖ్యంగా మహిళా రైతులు ఆమెను ఆదర్శంగా తీసుకుని ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తున్నారు. ఆమె పొలాలను సందర్శించేందుకు అనేక మంది రైతులు వస్తున్నారు. డ్రాగన్ ఫ్రూట్ వంటి అధిక ఆదాయం ఇచ్చే పంటలను స్థానిక పరిస్థితుల్లో విజయవంతంగా సాగు చేయవచ్చని ఆమె నిరూపించారు.

మహిళా సాధికారతకు ప్రతీక

శ్రీమతి ఈశావోని జానమ్మ గారు మహిళా రైతులు కూడా శాస్త్రీయ వ్యవసాయంతో అధిక ఆదాయం సాధించగలరని నిరూపించారు. కష్టపడి పని చేయడం, కొత్త పద్ధతులను నేర్చుకోవడం మరియు సమర్థవంతమైన వ్యవసాయ నిర్వహణ ద్వారా గ్రామీణ మహిళలకు ప్రేరణగా నిలిచారు.

రైతు అభిప్రాయం: "పంటల వైవిధ్యీకరణ, నీటి సంరక్షణ, శాస్త్రీయ వ్యవసాయం మరియు కృషి ఉంటే వ్యవసాయం లాభదాయక వృత్తిగా మారుతుంది" అనే విషయాన్ని శ్రీమతి ఈశావోని జనమ్మ గారు తమ విజయంతో నిరూపించారు. ఆమె విజయగాథ రైతులకు మాత్రమే కాకుండా గ్రామీణ మహిళలకు కూడా స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9666150842

47వ పేజీలోని ప్రశ్నలకు సమాధానాలు : 1. ఎ 2. బి 3. డి 4. డి 5. సి 6. డి 7. డి 8. ఎ 9. సి 10. ఎ

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

ఎలక్ట్రానిక్ వింగ్, ఎ.ఆర్.ఐ., రాజేంద్రనగర్, హైదరాబాద్

పిజెటిఎయు అగ్రికల్చరల్ వీడియోస్ (2017)

2nd Among SAUs

@ పిజెటిఎయుఅగ్రికల్చరల్‌వీడియోస్

98,700 సబ్‌స్క్రైబర్స్, 804 వీడియోలు మరియు 95,40,770 వీక్షకులు

ఆధునిక వ్యవసాయ సమాచారం కొరకు 'మా' యూట్యూబ్ ఛానల్ సబ్‌స్క్రైబ్ చేయండి

PJTAU AGRICULTURAL VIDEOS

RNI No : TELTEL/2015/60296
Total No. of Pages : 52

July, 2026

Postal Regd.No:HSE/1013/2024-2026
Date of Publication : 06.07.2026
Date of Posting : 09.07.2026

Posting at BPC - IV Patrika Channel, Nampally, Hyderabad- 500 001

కూనారం వరి-2 (కె.యన్.యమ్. 1638)

ఉల్లికోడు బయోటైప్ 3 మరియు అగ్గితెగులును సమర్ధవంతంగా తట్టుకునే సన్నగింజ రకం.

To

Striving for a greener tomorrow...

ముద్రణ మరియు ప్రచురణ: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

Printed and Published by Dr. M. Sreenivasulu on behalf of Professor Jayashankar Telangana Agricultural University, Owned by Professor Jayashankar Telangana Agricultural University,
Printed at: PJTAU Press, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana
Published From: Professor Jayashankar Telangana Agricultural University, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana
Editor: Dr. M. Sreenivasulu, RNI File No. 1262077, Title-Code: TELTEL00152